Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 165 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 6 జూలై 2023 | గురువారం | పేజీలు : 4

## యాదాద్రి ఆలయానికి భారీగా పెరిగిన ఆదాయం

యాదగిరిగుట్ట , యాదాద్రి భువనగిరి : యాదగిరిగుట్టలోని శ్రీ యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆదాయం భారీగా పెరిగింది. ఆలయాన్ని ముఖ్య మంత్రి కేసీఆర్ అన్ని హంగులతో తీర్చిదిద్దడంతో దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ సందర్భంగా గడిచిన 19 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలు, వివిధ సేవల రూపంలో వచ్చిన ఆదాయాన్ని అధికారులు లెక్కించారు. లెక్కింపులో ఆలయానికి రూ.,కోటి 86 లక్షలు ఆదాయం వచ్చిందని యాదాద్రి దేవస్థానము కార్యనిర్వహణాధికారి వెల్లడించా రు. 159 గ్రాముల మిశ్రమ బంగారం, 7 కిలోల 300 గ్రాముల మిశ్రమ వెండి స్వామివారికి కానుకల రూపేణా సమకూరిందని వెల్లడించారు. 1249 అమెరికా డాలర్లు, 65 యూఏఈ దిరామ్స్, రియల్స్ 22, 150 ఆస్ట్రేలియా డాలర్స్, 5కెనడా డాలర్స్, ఒక ఒమన్ కరెన్సీచ బైసాకతార్ 2, యూరోప్ 30,థాయిలాండ్ 60 ఇండోనేషియా 50, 000,కువైట్ నుంచి 1 1/2,బహరైన్ నుంచి 1/2 దిరామ్స్ సమకూరాయని వివరించారు.



IMAGE-ANI



## ఇక్కడున్నది 'అపర చాణుక్యుడు' కేసీఆర్!

# కిషన్‌రెడ్డి బండి లా దూకుడు చూపగలడా...!?

హైదరాబాద్ : అందరూ ఊహించిందే జరిగింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ స్థానంలో జి. కిషన్ రెడ్డికి బీజేపీ అధినాయకత్వం పట్టం కట్టింది.

వచ్చే ఎన్నికలకు కొత్త అధ్యక్షుడి సారధ్యంలో వెళ్లాలని అధిష్టానం నిర్ణయించింది. పార్టీలో అంతర్గత కలహాలు ఎలా ఉన్నా, బండి సంజయ్ ను వ్యతిరేకించే వర్గం ఉన్నా.. ప్రస్తుత పరిస్థితులలో అధ్యక్షుడు మార్పు బిజెపికి నష్టం చేస్తుందన్న టాక్ పార్టీ శ్రేణులలోనూ, రాజకీయ వర్గాల్లోనూ వ్యక్తమవుతోంది. కిషన్ రెడ్డి కెసిఆర్ ను బలంగా ఢీ కొట్టగలరా అన్న ప్రశ్న అందరిలోనూ ఉత్పన్నమవుతుంది. ఇదే సమయంలో కిషన్ రెడ్డికి , బండి సంజయ్ కి మధ్య ఉన్న తేడా పార్టీశ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. సాధారణ కార్యకర్త నుండి అంచెలంచెలుగా ఎదిగిన కిషన్ రెడ్డి కేంద్రమంత్రిగా ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ పార్టీని, సీఎం కేసీఆర్ ను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో బండి సంజయ్ కంటే ఒక అడుగు వెనకే ఉన్నారని చర్చ జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ కి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జవసత్వాలు తీసుకురావడంలో బండి సంజయ్ చేసిన కృషి చాలా ఉంది. సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి చెమటలు పట్టించిన, టెన్షన్ పుట్టించిన నేత బండి సంజయ్ అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అయితే బండి సంజయ్ లా దూకుడుగా ప్రస్తుత తెలంగాణ పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ముందుకు వెళ్లడంలో విఫలమవుతారేమో అన్న చర్చ జరుగుతుంది. వచ్చేది ఎన్నికల కాలం కావడంతో, పదునైన మాటల దాడితో, కెసిఆర్ కు వెన్నులో వణుకు పుట్టించేలా కిషన్ రెడ్డి పాత్ర ఉంటుందని రాజకీయవర్గాలు భావించడం లేదు.

కిషన్ రెడ్డి ప్రతీది ఆచితూచి మాట్లాడుతాడు. విమర్శలు చేసినా, ప్రభుత్వంపై యుద్ధం చేసినా ఆయన స్టైల్ వేరు. అయితే ప్రస్తుత పరిస్థితులలో కిషన్ రెడ్డి తరహా వ్యాఖ్యలు, పోరాటాలు బీఆర్ఎస్ పార్టీకి దున్నపోతు మీద వాన కురిసినట్టు ఉంటాయని చర్చ జరుగుతుంది. పార్టీలో సీనియర్ నాయకులు, కొత్తగా వచ్చిన నాయకులు మినహాయించి మిగతావారు బండి సంజయ్ నాయకత్వాన్ని బలంగా సమర్థించారు. కానీ ఇప్పుడు బండి సంజయ్ ను మార్చి ఆ స్థానంలో కిషన్ రెడ్డికి పట్టం కట్టడం ఎన్నికల సమయంలో ఎక్స్పరిమెంట్ అంటున్నారు రాజకీయ పార్టీల నాయకులు. బీజేపీ అధిష్టానం ఎంతో నమ్మకంతో కిషన్ రెడ్డికి అప్పగించిన ఈ బాధ్యత ఆయన ఏ మేరకు సక్సెస్ చేస్తారు? సీఎం కేసీఆర్ ను ఆయన వచ్చే ఎన్నికల్లో బలంగా ఢీ కొడతారా? తెలంగాణ బీజేపీ లో ఏం జరగబోతుంది? అన్నది ముందు ముందు తెలియనుంది.

## అంతర్మధనంలో బండి సంజయ్ .. నెక్ట్స్ ఏంటి?

బండి సంజయ్.. తెలంగాణ రాష్ట్ర బిజెపి రథసారధిగా తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి తీసుకురావడం కోసం సంచలన నిర్ణయాలతో దూకుడుగా ముందుకు సాగారు. అయితే అనూహ్యంగా ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో బిజెపి అధ్యక్షుడిగా బండి సంజయ్ ను పక్కనపెట్టి, ఆయన స్థానంలో కిషన్ రెడ్డి కి బీజేపీ అధిష్టానం పట్టం కట్టడం తో బండి సంజయ్ షాక్ కు గురయ్యారు. ఇంతకాలం పార్టీ కోసం, వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకు రావడం కోసం అహర్నిశలు కష్టపడితే, అద్భుతంగా పని చేసావ్ అని చెప్పిన అధిష్టానం, అకస్మాత్తుగా పక్కకు జరపడం పైన బండి సంజయ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. బాగా పని చేసావ్ అని మెచ్చుకున్న అధిష్టానం చివరికి ఇటువంటి నిర్ణయం తీసుకోవడం బండి సంజయ్ కు డైజెస్ట్ కావడం లేదు. దీంతో ఆయన అంతర్మథనంలో పడ్డారు అని సమాచారం. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో అనూహ్య నిర్ణయం తీసుకోవడం పట్ల ఆయన ఆవేదనలో ఉన్నారని తెలుస్తుంది. అగ్ర నేతలు తనను ప్రశంసిస్తూనే, తన పనితీరును మెచ్చుకుంటూనే తనను పక్కన పెట్టడం బండి సంజయ్ కు ఏమాత్రం రుచించడం లేదని సమాచారం. కెసిఆర్ ని బలంగా ఢీ కొట్టాలని, వచ్చే ఎన్నికలలో కెసిఆర్ ను గద్దె దించాలని ఏ మాత్రం తగ్గకుండా పోరాటం చేసిన బండి సంజయ్ అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో వాట్ నెక్ట్స్ అని ఆలోచిస్తున్నారు. నిస్తేజంగా ఉన్న పార్టీకి ఉన్న పార్టీకి బండి సంజయ్ తన దూకుడుతో జోష్ తీసుకువచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో అధికార బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయ పార్టీగా బిజెపిని బలంగా చూపించే ప్రయత్నం చేశారు. తన వాక్చాతుర్యంతో ప్రత్యర్థులకు చుక్కలు చూపించారు. సవాళ్లకు ప్రతిసవాళ్లు, విమర్శలకు ప్రతి విమర్శలు చేస్తూ, కేసులను సైతం లెక్కచేయకుండా ముందుకు సాగారు. అయినా ఆయనను బీజేపీ అధిష్టానం పక్కన పెట్టింది. ఎంతో కష్టపడి యాత్రలు చేసి ప్రజల దగ్గరకు బీజేపీని తీసుకెళ్ళే ప్రయత్నం చేసినా ఆయన ప్రయత్నం అంతా బూడిదలో పోసిన పన్నీరు అయ్యింది. మాస్ లీడర్ గా ప్రజల బలాన్ని సంపాదించిన బండి సంజయ్ పార్టీలో ఉన్న విభేదాలను, వివాదాలను పరిష్కరించి ఒక్కటిగా పార్టీని నడిపించడంలో ఫెయిల్ అయ్యారని, చేరికలకు ఆయన దూకుడు ఆటంకంగా మారిందని అనేక రాజకీయ సమీకరణాలను బేరీజు వేసిన అధిష్టానం ఆయనని అధ్యక్షుడిగా తొలగించింది.

అయితే ఈ విషయంలో బండి సంజయ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తర్వాత ఏం చెయ్యాలన్నది ఆలోచిస్తున్నారని సమాచారం.

# కిషన్ రెడ్డి అలిగారా?

ఢిల్లీ : కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ నూతన అధ్యక్షుడు కిషన్ రెడ్డి నేడు ఢిల్లీలో ఉండి కూడా కేబినెట్ సమావేశానికి హాజరుకాకపోవడం ఒక్కసారిగా కలకలం రేపింది. ఆయనను తెలంగాణ అధ్యక్ష పదవిని అప్పగించిన అనంతరం అసలు ఆయన ఎక్కడా స్పందించింది లేదు. మీడియా ముందుకు సైతం వచ్చేందుకు నిరాకరిస్తున్నారు. అయితే ఆయన తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసినట్టు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. నిజానికి కిషన్ రెడ్డి బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని ఆశించినట్టు తెలుస్తోంది. బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి ఈసారి దక్షిణాదికి వస్తుందని కిషన్ రెడ్డి భావించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే జేపీ నడ్డా తరువాత తనకే బీజేపీ పగ్గాలు అప్పగిస్తారని భావించినట్టు తెలుస్తోంది. అలాంటిది తెలంగాణ బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించి అధిష్టానం చేతులు దులుపుకోవడంతో ఆయన మనస్తాపం చెందినట్టు సమాచారం. పైగా ప్రస్తుతం తెలంగాణలో బీజేపీకి అంత అనుకూల పరిస్థితులు లేవు. కర్ణాటక ఎన్నికల ఫలితాలకు ముందు వరకూ రెండో స్థానంలో కొనసాగిన బీజేపీ.. ఇప్పుడు మూడో స్థానానికి పడిపోయిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ తరుణంలో రాష్ట్రంలో పార్టీ బాధ్యతలు తీసుకుంటే రాజకీయంగా మునుగుతామని తన అనుచరులతో కిషన్ రెడ్డి చెప్పినట్టు సమాచారం. మొత్తంగా ఆయన బీజేపీ తెలంగాణ అధ్యక్షుడి బాధ్యతలు స్వీకరించేందుకు ఏమాత్రం సుముఖంగా లేరని తెలుస్తోంది. ఈ క్రమంలోనే కిషన్ రెడ్డి అలకబూనినట్టు సమాచారం.

**కేబినెట్ భేటీకి కిషన్ రెడ్డి డుమ్మా.. కేంద్ర మంత్రి పదవికి రాజీనామా?**

: కేబినెట్ బేటీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డుమ్మా కొట్టారు. ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారని.. అందుకే కేబినెట్ భేటీకి హాజరు కాలేదని ప్రచారం జరుగుతోంది. అయితే అనారోగ్య కారణాల వల్లనే కేబినెట్ సమావేశానికి కిషన్ రెడ్డి దూరంగా ఉన్నారని అధికారులు అంటున్నారు.

## బీజేపీ జాతీయ అధ్యక్షుడి పదవి ఇస్తారనుకుంటే..



కిషన్ రెడ్డిని మంత్రి వర్గంలో కొనసాగిం చడంపై సస్పెన్స్ నెలకొంది. సాయంత్రానికి మరికొంత మంది మంత్రులు రాజీనామా చేసే అవకాశం ఉందని ఢిల్లీ రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నిన్న కిషన్ రెడ్డిని తెలంగాణ బీజే పీ చీఫ్‌గా పార్టీ అధిష్టానం నియ మించింది. బీజేపీ అధ్యక్షుడిగా నియమించిన అనంతరం ఆయన మీడియా ముందుకు ఇప్పటి వరకూ గమనార్హం. మీడియాతో మాట్లాడటానికి కూడా ఆయన నిరాకరిస్తున్నారు. ఇప్పుడు ఢిల్లీలోని ఉండి కూడా ఆయన కేబినెట్ సమావేశానికి హాజరు కాలేదు.

దీంతో ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారని ప్రచారం జరుగుతోంది. సాయంత్రం కిషన్ రెడ్డి బాటలోనే మరికొందరు కేంద్ర మంత్రులు రాజీనామా చేయనున్నట్టు సమాచారం.




# దూకుడు మీదున్న కాంగ్రెస్

# ఇక తగ్గేదేలే!!

## 20న ప్రియాంకా గాంధీతో కొల్లాపూర్‌లో భారీ సభకు ఏర్పాట్లు

హైదరాబాద్: ఖమ్మం వేదికగా లక్షలాది మందితో జనగర్జన సభ నిర్వహించి కొత్త జోష్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ మరో భారీ బహిరంగ సభ ఏర్పాటుకు సిద్ధమువుతోంది.

ఈ నెల 20న నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో సభ నిర్వహించాలని భావిస్తోంది. ఖమ్మం సభకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ముఖ్యఅతిథిగా రాగా, కొల్లాపూర్ సభకు ప్రియాంకాగాంధీ హాజరుయ్యే అవకాశముంది.

ఈ మేరకు కొల్లాపూర్ సభకు హాజరు కావాలని కోరుతూ ప్రియాంకా గాంధీకి రాష్ట్ర కాంగ్రెస్ పక్షాన టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20న ప్రియాంక సభ ఖరారైనట్టేనని, అధికారికంగా ప్రకటన చేయడమే తరువాయి అనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ప్రియాంక హాజరయ్యే సభలో మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు రాజేశ్‌రెడ్డితోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.

**కీలక ప్రకటనలు కూడా...** జూపల్లి చేరిక సభలో ప్రియాంకగాంధీ చేత కీలక ప్రకటనలు ఇప్పించేందుకు టీపీసీసీ కసరత్తు చేస్తోంది. ఖమ్మం వేదికగా వృద్ధులు, వితంతువులు, ఇతర వర్గాల పింఛన్‌ను రూ. 4 వేలకు పెంచుతూ హామీ ఇచ్చినట్టుగానే, కొల్లాపూర్ సభావేదికగా మహిళా ఓటర్లను ఆకర్షించే విధంగా భారీ ఎన్నికల హామీ ఇస్తామని, ఇందుకోసం నాలుగైదు అంశాలను పరిశీలిస్తున్నామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కర్ణాటక ఎన్నికల్లో ఇచ్చినట్టుగానే తెలంగాణలోనూ మహిళలకు ఉచిత బస్సుప్రయాణ హామీని ప్రకటించే అవకాశాలున్నాయని వారంటున్నారు. దీంతోపాటు పావలా వడ్డీరుణాల స్థానంలో మహిళలకు వడ్డీ లేని రుణాలిస్తామని, రూ.లక్ష వరకు ఈ రుణం ఇస్తామని, నామినేటెడ్ పదవుల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామనే హామీలను కూడా ఇప్పించే అంశాలను టీపీసీసీ ముఖ్య నేతలు పరిశీలిస్తున్నారు. మొత్తం మీద ప్రియాంకాగాంధీ సభ ద్వారా మహిళలకు భారీ ఎన్నికల హామీని ప్రకటించేందుకు కాంగ్రెస్ పార్టీ రంగం సిద్ధం చేస్తోంది.

## సంపాదకీయం

### భారత్ కి కన్ను గీటుతున్న పుతిన్ బైడెన్ ఏమంటారో...?

ప్రపంచం ఒక కుగ్రామం అయిన వేళ ఏ ఇద్దరు మధ్య యుద్ధం వచ్చినా మొత్తం విశ్వం మీద ప్రభావం పడుతుంది. అదే సమయంలో ఈ ఇద్దరికీ చెరో వైపునా లాగేసే వారూ ఉంటారు. ఎటూ కాకుండా తటస్థంగా ఉంటూ మన వ్యక్తిత్వాన్ని నిలుపుకుందామనుకుంటే కుదిరే రోజులు కావు. అయినా భారత్ కి అందరూ కావాలి అన్నదే నినాదం. శాంతి మన మంత్రం. అయితే అర్థం చేసుకునే వారు ఉన్నారా అన్నదే ఇక్కడ చర్చ. ఇక రష్యా ఉక్రెయిన్ మీద పడి యుద్ధం చేయడాన్ని అంతా తప్పుపడుతున్నారు. భారత్ కూడా యుద్ధం వద్దు అనే చెబుతోంది. రెండు దేశాలూ కూర్చుని మాట్లాడుకోవాలని కూడా కోరుతోంది. అయితే ఈ విషయంలో పుతిన్ తో ఫోన్ లో ప్రధాని మోడీ మాట్లాడారు అలాగే ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్ స్కీతో కూడా చర్చించారు. అయినా ఈ యుద్ధం ఆగడం లేదు. నాటో దేశాలతో పాటు అమెరికా పెద్దన్న తెర వెనక ఉన్నారని రష్యా అనుమానం. దాన్ని నిజం చేసేలా ఉక్రెయిన్ రష్యాల మధ్య చర్చలు దోబూచులాట ఆడుతున్నాయి. యుద్ధం మాత్రమే నికరంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత్ అయితే తనది న్యూట్రల్ రోల్ అని చెప్పేసింది. ఐక్య రాజ్యసమితిలో కూడా ఎటూ ఓటేయకుండా తటస్థ వైఖరి అవలంబించింది. దాంతో అమెరికా ప్రెసిడెంట్ బైడెన్ కి కోపం వచ్చిందని అప్పట్లో ప్రచారం జరిగింది. ఇదిలా ఉండగా ఇపుడు రష్యా భారత్ కి ఉన్న ఉదుటన ఒక బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఈ యుద్ధం వల్ల ప్రపంచంలో చమురు ధరలు విపరీతంగా పెరుగుతాయన్న ఆందోళన ఉంది. అలాగే భారత్ లో ఆ భయాలు ఉన్నాయి. అయితే రష్యా ప్రెసిడెంట్ పుతిన్ మాత్రం భారత్ పట్ల ప్రేమ చూపిస్తూ కారు చౌకగా చమురుని ఇస్తామని ఆఫర్ ఇచ్చేశారని ప్రచారం సాగుతోంది. రష్యా డిప్యూటీ ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ అయితే దీని మీద కేంద్రంలో డైరెక్ట్ గా మాట్లాడారని తెలుస్తోంది. ఒక విధంగా ఇది భారత్ పరంగా చూస్తే సూపర్ ఆఫర్. భారత్ ఆర్థిక వ్యవస్థ మొత్తానికి ఊపిరి ఇచ్చే పరిణామం. అయితే ఇక్కడే లోతుగా కేంద్రం ఆలోచించాల్సిన పరిస్థితి ఉంది అంటున్నారు. ఎందుకంటే అమెరికా సహా యూరోపియన్ దేశాలు భారత్ పట్ల ఎలా వ్యవహారిస్తాయి అన్న మీమాంస అయితే ఉంది. ఇక రష్యా ఆఫర్ చూస్తే క్రూడాయిల్ నిల్వలు పెద్ద ఎత్తున అక్కడ పేరుకుపోతున్నాయి. మిగిలిన ప్రపంచంలో బ్యారెల్ క్రూడాయిల్ ధర 139 డాలర్లకు చేరగా రష్యా మాత్రం భారత్ కే మా ఆఫర్ అని ఊరిస్తోంది. అయితే ఇది అంతర్జాతీయ పరిణామాలను కూడా దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాల్సిన అంశమని అంటున్నారు. ఏకపక్షంగా రష్యా ఆఫర్ కి తలొగ్గితే మిగిలిన ప్రపంచానికి భారత్ దూరం అయ్యే ప్రమాదం ఉంది. ఏది ఏమైనా రష్యా బంపర్ ఆఫర్ మాత్రం ఊరించే విధంగానే ఉంది.

# వార్ధా ప్రాజెక్టు పట్టాలెక్కేనా?

ఆసిఫాబాద్ : ప్రతిపాదిన వార్ధా ప్రాజెక్టు ఇప్పుడప్పుడే పట్టాలెక్కే పరిస్థితి కన్పించడం లేదు. రెండేళ్లుగా ఇదిగో శంకుస్థాపన.. అదిగో ప్రాజెక్టు అంటూ ప్రభుత్వం హడావుడి చేస్తున్నా ఇప్పటికీ డీపీఆర్‌లే సిద్ధం కాలేదు. మొట్టమొదటిసారి 2020డిసెంబరులో ఈ ప్రాజెక్టు ప్రతిపాదన తెరపైకి వచ్చింది. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించతలపెట్టిన ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో ప్రాణహితకు ప్రత్యామ్నాయంగా దీనికి ట్రిబ్యూటరీగా ఉన్న పెన్‌గంగపై ఆనకట్ట నిర్మించి ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల రైతాంగానికి సాగునీరు అందించాలని తలపెట్టారు. ఈ క్రమంలోనే 2020డిసెంబరులో రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు కౌటాల మండలం తుమ్మిడిహెట్టికి సమీపంలోని పెన్‌గంగపై బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టు నిర్మించాలన్న డిమాండు పెరగడంతో తిరిగి 2021లో ప్రాజెక్టు నిర్మాణ సాధ్యా..? అసాధ్యాలను..? తేల్చటం కోసం కేంద్ర సర్వే ఏజెన్సీ అయినా వ్యాప్కోస్‌కు బాధ్యతలను అప్పగించారు. అప్పట్లో లైడార్ సర్వే నిర్వహించి ప్రభుత్వానికి డీపీఆర్‌ను ఆ సంస్థ అప్పగించింది. అయితే ఏ కారణంచేతో ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసింది. తిరిగి మరోసారి సర్వే జరిపి రెండు నెలల్లోగా నివేదికలు ఇవ్వాలని వ్యాప్కోస్‌ను కోరగా ఈ యేడాది జనవరిలో ముఖ్యమంత్రి కార్యదర్శి స్మితాసబర్వాల్, నీటి పారుదల ప్రధాన కార్యదర్శి రజిత్‌కుమార్ తదితరులు ప్రాజెక్టు సైట్‌ను సందర్శించి కొత్త హడావుడి చేశారు. ఈ క్రమంలో వ్యాప్కోస్ సభ్యులు కూడా సర్వేల పేరిట ఈ ప్రాంతాన్ని పలుసార్లు హెలిక్యాప్టర్ ద్వారా సర్వే నిర్వహించారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ప్రాజెక్టు పనులకు అంకురార్పణ జరుగుతుందన్న అంచనాలు వ్యక్తమయ్యాయి. అయితే అనూహ్యంగా వ్యాప్కోస్ సంస్థ డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చేది లేదని తిరకాసు పెట్టింది. దాంతో వార్ధా ప్రాజెక్టుపై మరోసారి సర్కారుకు, సర్వే ఏజెన్సీకి మధ్య దాగుడుమూతల కారణంగా ఇప్పట్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం కార్యరూపం దాల్చే అవకాశం లేదని నీటి పారుదలశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే వ్యాప్కోస్ ఉన్న ట్టుండి తిరకాసు పెట్టడానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం ఆ ఏజెన్సీకి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకపోవడం వల్లే ఆ ఏజెన్సీ డీపీఆర్‌లకు లంకె పెట్టిందని అంటున్నారు. పెన్‌గంగలో 30,500 క్యూమెక్స్ నీటి లభ్యత..ప్రతిపాదిన పెన్‌గంగాపై నిర్మించతలపెట్టిన వార్ధా ప్రాజెక్టుకు సాలీన 30,500క్యూమెక్స్ నీటి లభ్యత ఉంటుందని నీటిపారుదలశాఖ అధికారులు అంచనా వేశారు. వార్ధాపై బ్యారేజీ నిర్మించడం ద్వారా ఆసిఫాబాద్ జిల్లా, మంచిర్యాల జిల్లాలో 2లక్షల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చని అంచనా వేశారు. ఇందుకు సంబంధించి కౌటాల మండలం వీర్దండి, గుండాయిపేట గ్రామాల మధ్య బ్యారేజీ నిర్మించి అక్కడి నుంచి కాల్వల ద్వారా ఇప్పటికే ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టులో భాగంగా తవ్విన గ్రావిటీ కెనాల్‌కు అనుసంధాలించాలని నిర్ణయించారు. తద్వారా సిర్పూరు, ఆసిఫాబాద్, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని మెట్టప్రాంతాలకు సాగునీరు అందించి ఆయకట్టును నీరు అందించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) రాగానే పనులు ప్రారంభించే అవకాశం ఉండగా, తాజాగా సర్వే ఏజెన్సీ డీపీఆర్‌పై నాలుక మడత వేయడంతో ఈ ప్రాజెక్టు భవితవ్యంపై సందేహాలు అలుముకున్నాయి. వాస్తవానికి ఈపాటికే సర్వే ఏజెన్సీ ప్రాజెక్టు రిపోర్టులను ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంది. ముంపు అంతా మహారాష్ట్రలోనేవార్ధానదిపై తలపెట్టిన ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపు తీవ్రత మహారాష్ట్ర వైపే ఎక్కువ ఉంది. మిగితా ప్రాజెక్టులతో పోల్చినప్పుడు ఈ ప్రాజెక్టు కింద ముంపు స్వల్పంగానే ఉన్నప్పటికీ సింహభాగం బ్యారేజీ నిర్మాణం మహారాష్ట్ర భూభాగంలో ఉన్నందున అటువైపు 228హెక్టార్లల్లో ముంపు ఉంటుందని ఇంజ నీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. మాత్రమే భూములు ముంపునకు గురవుతాయి. ఇదిలా ఉండగా ఇక్కడ ఫుల్ రిజర్వాయర్ లెవల్(ఎఫ్ఆర్ఎల్) 160 మీటర్లుగా నిర్మించే అవకాశాలున్నాయని చెపుతున్నారు. అలాగే నీటినిల్వ సామర్థ్యం 4టీఎంసీలుగా ఉంటుందని అంచనా వేశారు.

# బాల్యంలోనే బలహీనం

జగిత్యాల : రోజురోజుకు మారుతున్న ఆహా రపు అలవాట్ల కారణంగా చిన్న నాటి నుంచే పలు రుగ్మతలు చుట్టుము డుతున్నాయి. దీంతో చిన్నారుల్లో ఎదుగుదల లోపం తలెత్తుతోంది. దీంతో పాటు చర్మ, దంత, వినికిడి, కంటి తదితర సమస్యలకు గురవుతున్నారు. ఇలాంటి వాటి నుంచి రక్షించి వారిని బంగారు భవిష్యత్తుకు ఆరోగ్య బాట లు వేసేందుకు ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం చేపడుతోంది. విద్యార్థుల ఆరోగ్యానికి ఆర్‌బీఎస్‌కే బాసటగా నిలుస్తోంది. జిల్లాలో ఆర్‌బీ ఎస్‌కే బృందాలు నిర్వహిస్తున్న పరీక్షల్లో పలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బాల్యం దశలోనే విద్యార్థులు అనేక రోగాలకు గురవుతున్న ట్లు గుర్తిస్తున్నారు.

జిల్లాలో పది బృందాలు...జిల్లాలో పది ఆర్‌బీఎస్‌కే బృందాలు పనిచేస్తున్నాయి. ఒక్కో బృందంలో ఇద్దరు వైద్యులు, ఒక ఏఎన్ఎం, ఒక ఫార్మసిస్టు చొప్పున ఉన్నారు. ఒక్కో బృందానికి ఒక్కో ఆర్‌బీఎస్‌కే వాహనాన్ని కేటాయించారు. వీరు ప్రతీ ని త్యం ప్రభుత్వ పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలను సందర్శిస్తుంటారు. విద్యాసంస్థలను సందర్శించి బాల బాలికలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహి స్తుంటారు. బృందంలోని సభ్యుల పరిధిలో పరిష్కారం అయ్యే ఆరోగ్య స మస్యలకు అక్కడికక్కడే వైద్య సేవలు అందిస్తారు. అంతకు మించి ఆరో గ్య సమస్య ఉంటే సమీపాల్లోని ప్రభుత్వ ఆసు పత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారు. వైద్య నిపుణులతో సంప్రదించి అవస రమైన పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేయిస్తారు. ఒక్కో బృందం రోజుకు 120 మంది విద్యార్థులను పరీక్షించాల్సి ఉంటుంది.అనారోగ్య సమస్యల గుర్తింపు..జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి జూన్, జూలై మాసాల్లో ఆర్‌బీఎస్‌కే బృందాలు పలు అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశా లలు, కళాశాలలను సందర్శించాయి. జిల్లాలో 39,302 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదు ర్కొంటున్న 584 మందిని ఆసుపత్రులకు రెఫర్ చేశారు. మరో 566 మం దికి అవసరమైన వైద్యం అందిస్తున్నారు. 2,339 మంది విద్యార్థులకు అక్క డిక్కడే వైద్య సేవలను అందించారు. కాగా 15 మంది చిన్నారులు పుట్టుకతోనే లోపాలతో ఉన్నట్లుగా వైద్యులు గుర్తించారు. ఇందులో జూన్‌లో 21, 218 మందిని పరీక్షించగా 144 మందిని ఆసుపత్రులకు రెఫర్ చేశారు. 1,145 మంది విద్యార్థులకు అక్కడికక్కడే వైద్య సహాయం అందించగా, 143 మందికి వైద్య సేవలను అందిస్తున్నారు. జూలైలో 18,084 మంది వి ద్యార్థులను పరీక్షించగా 440 మందిని ఆసుపత్రులకు రెఫర్ చేశారు. 1,194 మంది విద్యార్థులకు అక్కడికక్కడే వైద్య సహాయం అందించగా, 423 మందికి వైద్య సేవలను అందిస్తున్నారు. బయట పడుతున్న ప్రత్యేక రుగ్మతలు..జిల్లాలోని బాల బాలికల్లో పలు ప్రత్యేక రుగ్మతలు సైతం బయట ప డుతున్నాయి. జిల్లాలో ప్రస్తుత యేడాది జూన్, జూలైలో వైద్య పరీక్షలు చేసిన చిన్నారుల్లో పలు ప్రత్యేక అనారోగ్య సమస్యలను గుర్తించారు. ఇం దులో దంత వైద్య సమస్యలతో 62 మంది, చర్మ వ్యాధులతో 112 మంది, కంటి సమస్యలతో 25 మంది, చెవి సమస్యలతో నలుగురు విద్యార్థులు న్నట్లుగా ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం సభ్యులు గుర్తించారు. జలుబు, దగ్గు, జ్వరం తదితర చిన్న చిన్న అనారోగ్య సమస్యలను సైతం పలువురు బాల బాలికలు ఎదుర్కొంటున్నట్లుగా అధికారులు గుర్తించారు. కొంత మంది పి ల్లలకు అక్కడికక్కడే వైద్య సహాయం అందించారు. మందులను సైతం ఉ చితంగా అందించారు. గుండె సంబంధిత, ఎదుగుదల లోపం, గ్రహణ మొర్రి, రక్త హీనత, బుద్ధి మాంధ్యం, నరాల బలహీనత, కండరాల సమ స్యలు, రుతు స్రావ సమస్యలు, శ్రద్ధలోపం తదితర 32 అంశాలలో ఆర్ బీఎస్‌కే వైద్య బృందం అవసరమైన వైద్య సేవలను అందిస్తోంది. పోషకాహార లోపమే ప్రధాన కారణం...బడీడు వయస్సు గల బాల బాలికలల్లో వస్తున్న అనేక రోగాలకు పో షకాహార లోపమే ప్రధాన కారణమనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. అలసట, చిరాకు, శ్వాస సమస్య, చర్మ సమస్యలు, గుండె సంబంధిత జబ్బులు, పెరుగుదలలో లోపం, జీర్ణలోపాలు, కంటి, రక్తహీనత, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వంటి అనేక రుగ్మతలకు పోషకారహార లోపం కార ణంగా నిలుస్తుందంటున్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి చిన్నారులకు బలవర్ధక ఆహారం అందించాలని సూచిస్తున్నారు.పకడ్బందీగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం

– డాక్టర్ రాకేశ్, ఆర్‌బీఎస్‌కే ఇన్‌చార్జి, జగిత్యాలజిల్లాలో అంగన్ వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రతీ విద్యార్థికీ పకడ్బందీగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో పది ఆర్‌బీఎస్‌కే బృందాలు పర్యటిస్తూ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్నా యి. అవసరమైన వారికి అక్కడికక్కడే వైద్యం అందిస్తున్నాం. ప్రత్యేక రు గ్మతలు కలిగిన విద్యార్థులను గుర్తించి నిపుణులైన వైద్యుల వద్దకు వెళ్లా లని సూచిస్తున్నాం.ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ

– పుప్పాల శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిజిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తున్నాం. ప్రతీ విద్యార్థికి వైద్య బృందం సభ్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనారోగ్య సమస్యలను గుర్తించి అవస రమైన సలహాలు, సూచనలు, వైద్య సహాయం అందిస్తున్నారు. తీవ్ర సమస్యలున్న పిల్లలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సహాయం అందిస్తున్నాం.

# మారనున్న రూపురేఖలు

సిరిసిల్ల : జిల్లాలోని మినీ కేంద్రాల రూపురేఖలు మార నున్నాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 560 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 27 మినీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 22 కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా ఉన్నతీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. గతంలో జిల్లాలోని మారుమూల గ్రామాలు, తండాల్లో జనాభా తక్కువగా ఉన్న చోట మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే వీలు కల్పించింది. ప్రధాన కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్‌తో పాటు సహాయకురాలు సేవలు అందిస్తున్నారు. మినీకేంద్రాల్లో ఒక టీచర్‌ను మాత్రమే నియమించి నిర్వహణ భారమంతా ఒక్కరే చూసేలా ఏర్పాటు చేశారు. ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలను విస్తృతంగా పెంచారు. ఆరోగ్యలక్ష్మి, పోషణ్ అభియాన్, పూర్వ ప్రాథమిక విద్య వంటి కార్యక్రమాలు పెరగడంతో మినీ అంగన్‌వాడీ టీచర్లపై భారం పెరిగింది. అనేక మార్లు మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని కోరుతూ వస్తున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మార్చడానికి పూనుకుంది. ఇందులో భాగంగా జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో 300 జనాభా, గ్రామాల్లో 400 జనాభా ఉన్న మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్పు చేస్తున్నారు. దీంతో ఒక టీచర్‌కు తోడుగా ఆయాల నియామకం చేపట్టనున్నారు. ప్రస్తుతం ప్రధాన అంగన్‌వాడీ టీచర్‌కు రూ.13,650 వేతనం ఇస్తుండగా మినీ అంగన్‌వాడీ టీచర్‌కు రూ.7,800 మాత్రమే ఇస్తున్నారు. ఆయాకు ఇచ్చే వేతనమే ఇస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా వేతనం కూడా పెరగనుంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉండడంతో మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్‌లు ఎదురు చూస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 39,771 మంది లబ్ధిదారులు జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పోషకాహారం పొందుతున్న లబ్ధిదారులు 39,771 మంది ఉన్నారు. వీరిలో గర్భిణులు 4,766 మంది, బాలింతలు 2,976 మంది, మూడు సంవత్సరాల లోపు పిల్లలు 18,748 మంది, 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలు 13,318 మంది ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార లోపాన్ని అధిగమించడానికి ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా ఆరు నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలకు నెలకు 2.5 కిలోల బాలామృతం ప్యాకెట్, 16 కోడి గుడ్లు టేక్‌హోం రేషన్‌గా అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ఒకపూట సంపూర్ణ భోజనం, ప్రతీ రోజు కోడిగుడ్డు, పాలు, పప్పు, కూరగాయలతో సంపూర్ణ భోజనాన్ని అందిస్తున్నారు. దీంతోపాటు పిల్లలకు ఆట, మాట, పాట, కథలతో పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నారు. పోషణ్ అభియాన్, తల్లిపాల ఆవశ్యకతను తెలిపే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వ్యాక్సినేషన్ వంటి కార్యక్రమాలను కూడా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్నారు. అద్దె భవనాల్లో ఇబ్బందులుజిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాగున్నా అద్దె భవనాలు, ఖాళీలతో ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం 587 అంగన్‌వాడీ కేంద్రాల్లో 257 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. ఇటీవల 181 కేంద్రాలను ప్రాథమిక పాఠశాలల్లోని తరగతి గదులకు మార్చారు. 159 కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. సిరిసిల్ల ప్రాజెక్ట్ పరిధిలో 362 అంగన్‌వాడీ కేంద్రాల్లో 107 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వేములవాడ ప్రాజెక్ట్ పరిధిలో 225 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 52 అద్దె భవనాల్లో ఉన్నాయి. వీటితోపాటు సంవత్సర కాలంగా ఖాళీల భర్తీ కోసం ఎదురు చూస్తున్నారు. 587 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 80 ఖాళీలు ఉన్నాయి. 15 అంగన్‌వాడీ టీచర్లు, ఒక మినీ టీచర్, 64 సహాయకుల ఖాళీలు ఉన్నాయి. గతేడాది ఆగస్టులో 72 ఖాళీలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేశారు. 600పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి సిద్ధంగా ఉంచారు. దరఖాస్తు చేసుకున్న వారు పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇదే క్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం చేస్తున్న పోస్టుల భర్తీ, కొత్త నియామకాలు జరుగుతాయని భావిస్తున్నారు.

# రూ.వెయ్యితో బతికేదెట్లా?

ఇల్లెందు : చీకటి గనుల్లో తమ రక్తాన్ని చెమటగా మార్చి సింగరేణికి సిరులు కురిపించిన బొగ్గుగని కార్మికులు వానప్రస్థంలో అర్థాకలితో అలమటిస్తున్నారు. ప్రాణాలు పణంగా పెట్టి నల్లబంగారాన్ని వెలికి తీసి సంస్థకు వేలకోట్ల రూపాయల లాభాలు తెచ్చిపెట్టిన కార్మికుల జీవితాలు ఉద్యోగ విరమణ తరువాత దుర్భరంగా మారుతున్నాయి. ఉద్యోగ విరమణ తరువాత వారికి వచ్చే పెన్షన గొర్రెతోక బెత్తడు మాదిరిగానే ఉండటం గమనార్హం. కార్మికుల కష్టంతో కూడబెట్టిన సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం తను చేపట్టవలసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు మళ్లిస్తూ రిటైర్డ్ కార్మికుల గోడును పట్టించుకోకపోవడం గమనార్హం. దాదాపు 20వేల మంది రిటైర్డ్ కార్మికులు ఒక రూ.వెయ్యిలోపే పెన్షన్ పొందుతున్నా వారి కష్టాలను పట్టించుకునే నాథులే కరువయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం 57ఏళ్లు, 60ఏళ్ల వృద్దులకు అందిస్తున్న ఆసరా పింఛన కంటే అధ్వాన్నంగా గనికార్మికులకు పెన్షన్ అందుతున్నా వారి గోడు ఎవరికీ పట్టడం లేదు. అంతేకాకుండా అరకొర పెన్షన్ పొందుతున్న కార్మికుల కుటుంబాల వార్షిక ఆదాయం రూ.50వేల నుంచి రూ.రెండు లక్షల లోపే ఉన్నా వారికి ప్రభుత్వ రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్, పక్కాగృహాల పథకాల విషయంలో వారిని అనర్హులుగా గుర్తించడంతో వారి పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. వృద్ధాప్యంలో దుర్భర జీవితంఉద్యోగ విరమణ చేసిన సింగరేణి కార్మికులు, ఉద్యోగులకు కోల్‌మైన్స్, ప్రావిడెంట్ ఫండ్ ద్వారా బోర్డాఫ్ ట్రస్టీల నిర్ణయం మేరకు 1998 మార్చి నుంచి ఫెన్షన్ పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకంలో కార్మికుల వేతనాల నుంచి ప్రతి నెల ఏడు



శాతం, యాజమాన్య వాటాగా ఏడుశాతం కలిపి మొత్తం 14శాతం సొమ్మును సీఎంపీఎఫ్ ట్రస్టుకు జమచేస్తారు. దీంతో పాటు ఉద్యోగ విరమణ నాటి వేతనంతో నాలుగో వంతు పెన్షన్‌గా చెల్లించాలని, ప్రతి మూడేళ్లకు ఒకసారి ఈ పథకాన్ని రివిజన్ చేయాలని నిబంధన విధించారు. కానీ వీరికి పెరుగుతున్న ధరల సూచిక ప్రకారం కాకుండా ఉద్యోగ విరమణ సమయంలో ఎంత లబిస్తుందో కార్మికుడి చరమాంకం వరకు అంతే మొత్తం పెన్షన్‌గా చెల్లొస్తున్నారు. ఫలితంగా 2010 ముందు వరకు రిటైర్డ్ అయిన కార్మికులు అతి తక్కువ పెన్షన్ పొందుతూ వృద్యాప్యంలో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. అనేకమంది వృద్ధాప్యంలో సరైన వైద్యం అందక ఆలనాపాలనా చూసేవారు లేక చావుకోసం ఎదురుచూస్తున్నారు. సాధారణ జనానికి ఆసరా పింఛనగా రూ.2,016, వికలాంగులకు రూ.3,016ల పింఛన చెలిస్తున్మన ప్రభుత్వం సింగరేణికి కోట్లాది రూపాయలు లాభాలు అందించిన తమ పెన్షన్ పెంపుదల గురించి మాత్రం పట్టించుకోవడం లేదని వృద్ధకార్మికులు తల్లడిల్లుతున్నారు. సింగరేణిలో రూ.1000లోపు పెన్షన్ పొందే కార్మికులు 19,128 మంది, రూ,1,000నుంచి రూ.2,000లోపు పెన్షన్ పొందేవారి సంఖ్య 14,431మంది, రూ.2,000నుంచి రూ.3,000ల లోపు 8,041 మంది, రూ.3000 వేల నుంచి రూ.4,000వేల లోపు పెన్షన్ పొందుతున్నవారు 3,559 మంది, రూ.4,000 నుంచి రూ.5,000 లోపు పెన్షన్ పొందుతున్న వారు 2,390మంది, రూ.5,000నుంచి రూ.6,000లోపు పెన్షన్ పోందేవారు 2032 మంది, రూ.6000పైన పెన్షన్లు పొందే వారిసంఖ్య 35,227మంది ఉన్నారు. మంచానికే పరిమితమయ్యాఅజ్మీరా లచ్చిరాం, రిటైర్డ్ కార్మికుడు 35ఏళ్లు బొగ్గుబావిలో పనిచేసి 2004లో రిటైర్డ్ అయ్యా.. 18ఏళ్లుగా రూ.1,100పెన్షన వస్తోంది. కాళ్లు పనిచేయడం లేదు. మంచానికి పరిమితమయ్యాను. వచ్చే పెన్షన్ మందుల ఖర్చులకు కూడా సరిపోవడం లేదు. ఏట్లా బతకాలి. పెన్సన్ పెంచండి బాంచన్. ఈ పెన్షనతో ఎలా బతకాలిశ్రీనివాసరావు, రిటైర్డ్ కార్మికుడు, ఇల్లెందునేను స్టట్‌ఫిట్ గనిలో 29 ఏళ్లు పనిచేశా. 2003లో రిటైర్డ్ అయ్యాను. అప్పటి నుంచి రూ.1,100 పెన్షన్ మాత్రమే ఇస్తున్నారు. ఆ కొద్ది మొత్తం మందులకు, కుటుంబపోషణకు చాలక ఇబ్బందులు పడుతున్నాను. మా కంటే కూడా ఆసర పెన్షన్‌దారుల జీవితం బాగుంది.

# పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

వైరా : వైరా మండలంలోని ఆర్‌అండ్‌బీ సిబ్బంది వ్యవహారశైలి కంచే చేను మేసిన విధంగా తయారైంది. ఆర్‌అండ్‌బీ రోడ్లకు రెండువైపులా ఉన్న పచ్చటి భారీ వృక్షాలను కొంతమంది ప్రైవేట్ వ్యక్తులతో కలిసి ఆర్‌అండ్‌బీ సిబ్బందే అడ్డంగా నరికించి అక్రమంగా సొమ్ములు వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. వైరా–జగ్గయ్యపేట, మధిర ఆర్‌అండ్‌బీ రోడ్డులో శని, ఆది, సోమవారాల్లో పచ్చటి భారీ వృక్షాలను ప్రైవేట్ కలప వ్యాపారులతో కలిసి ఒక ఆర్‌అండ్‌బీ వర్క్‌ఇన్‌స్పెక్టర్ దగ్గరుండి నరికించారనే ఆరోపణలున్నాయి. రాత్రి వేళ మర్రిచెట్ల తొర్రల్లో నిప్పుపెట్టి ఆమంటల్లో కాలి పడిపోయిన తర్వాత వాటిని ప్రైవేట్ కలప వ్యాపారులకు సదరు ఆర్‌అండ్‌బీ వర్క్‌ఇన్‌స్పెక్టర్ అప్ప జెపుతూ అందిన కాడికి దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. రెబ్బవరంలో ఒక భారీ వేప చెట్టును శనివారం వర్క్‌ఇన్‌స్పెక్టర్ పర్యవేక్ష ణలోనే కలప వ్యాపారి అడ్డగోలుగా నరికివేశాడు. మొదట చెట్టు కొమ్మలను నరికారు. ఆతర్వాత వేప చెట్టు మొదలు భాగంలో మట్టి తవ్వి యంత్రంతో కట్‌చేశారు. ఆసమయంలో రెబ్బవరానికి చెందిన కొంతమంది వర్క్‌ఇన్‌స్పెక్టర్‌ను, నరికేవారిని నిలదీశారు. ఆవెంటనే కంగారు పడుతూ వేప చెట్టు మొదలుభాగం పడిపోకుండా దాని చుట్టూ మట్టి పోశారు. అది ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సదరు వర్క్‌ఇన్‌స్పెక్టర్ సోమవారం హడావుడిగా చెట్టు నరికే అనుమతి కోసం బ్యాంకులో ఒక చలానా తీసినట్లు సమాచారం. రోడ్ల పక్కన ఎండి కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న చెట్లను తొలగిస్తున్నామనే సాకుతో సదరు వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఇటీవల పాలడుగు సమీపంలో ఇప్పుడు రెబ్బవరంలో వేలాదిరూపాయల విలువయ్యే చెట్లను అడ్డగోలుగా నరికించేశారు. అయినప్పటికీ ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. వైరాలో ఆర్‌అండ్‌బీ డీఈ దేవికాచౌహాన్, ఇన్‌చార్జి ఏఈగా కొణిజర్లకు చెందిన ప్రవీణ్ పని చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులందరూ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై వివరణ కోసం ప్రయత్నించగా డీఈ దేవికాచౌహాన్ అందుబాటులో లేరు. సదరు వర్క్‌ఇన్‌స్పెక్టర్‌ను కూడా వివరణ కోసం ప్రయత్నించగా స్పందించలేదు.

# తీరనున్న తాగునీటి సమస్య

కరీంనగర్ : జిల్లాలో పురపాలికలు, నగరపాలక సంస్థల పరిధిలోని విలీన కాలనీల్లో తాగునీటి సమస్య తీరనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమృత్ 2.0 పథకం కింద నిధులు కేటాయించడంతో ఆ పనులు చేసేందుకు పరిపాలన అనుమతులు కూడా వచ్చాయి. ప్రజారోగ్య శాఖ ద్వారా టెండర్లు పిలిచారు. ఆ ప్రక్రియ పూర్తి చేసి ఒప్పందం కుదుర్చుకునే వరకు సమయం పట్టే అవకాశముంది. వచ్చే నెలాఖరులోగా పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

పేరుకే మిషన్ భగీరథ..విలీన కాలనీల్లో రూరల్ మిషన్ భగీరథ ద్వారా



తాగునీరు అందించేందుకు పైపులైన్లు, రిజర్వాయర్లు నిర్మించగా ఎక్కడా సరిపడా నీరు రాకపోవడం, లీకేజీలతో ట్యాంకులు పని చేయకపోవడంతో నగర, మున్సిపాలిటీలపై భారం పడింది. విలీనమైన తర్వాత వీధులకు తాగునీరు ఇవ్వడంలేదనే ఫిర్యాదులు అధికమయ్యాయి. వాస్తవంగా విలీనమైన సమయంలో సరఫరా చేయాల్సి ఉండగా జనాభా, నల్లా కనెక్షన్లకు పొంతన లేకపోవడం, ఈ విషయాన్ని మున్సిపల్ ఇంజినీర్లు ఎత్తి చూపడంతో రూరల్ మిషన్ భగీరథ అధికారులు అయోమయంలో పడ్డారు.

నేరుగా సరఫరా చేసేలా..

నగరంలో ఏ విధంగా నీటి సరఫరా జరుగుతుందో అదే తరహాలో చేసేలా అంచనాలు తయారు చేశారు. రేకుర్తి గుట్టపై మరొక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించనున్నారు. అక్కడి నుంచి రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లికి సరఫరా జరిగేలా పైపులైన్లు, అవసరమున్న చోట రిజర్వాయర్లు నిర్మిస్తారు. నగరంలో త్వరితగతిన పనులు పూర్తి చేసి ఆయా కాలనీలకు నీటి ఎద్దడి లేకుండా చేస్తామని అధికారులు, పాలకులు చెప్పారు.

# చెత్తశుద్ధికి మోక్షం లభించేనా!

గోదావరిఖని : పారిశుద్ధ్య నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్న రామగుండం నగరపాలక ప్రాంతంలో పురపాలక సంచాలకుల ఆదేశాలతోనైనా పరిస్థితి మెరుగుపడుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెత్త నిర్వహణలో ఒకప్పుడు రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిన రామగుండం ప్రాంతంలో నేడు మొక్కుబడిగా సాగుతోంది. నగరంలోని రహదారులపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, దుర్గంధం వెదజల్లుతున్న మురుగు కాలువలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చెత్త నిర్వహణలో నిబంధనలు పాటించడం లేదంటూ జాతీయ హరిత ట్రైబ్యునల్ అపరాధ రుసుము విధించడంతో స్పందించిన పురపాలక నిర్వహణ సంచాలకులు బయోమైనింగ్ విధానంపై దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 12 పురపాలక, నగరపాలికల్లో బయోమైనింగ్ విధానంతో చెత్త నిర్వహణను విజయవంతంగా నిర్వహిస్తుండగా తాజాగా రామగుండంతో పాటు మరో 11 పుర, నగరపాలికల్లో బయోమైనింగ్ విధానాన్ని అమలు చేయాలంటూ పురపాలక సంచాలకులు ఇటీవల ఆదేశించారు. దీంతోనైనా రామగుండంలో చెత్త నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం

పురపాలక సంచాలకులు తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం రామగుండం ప్రాంతంలో డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం లభించనుంది. రాష్ట్రంలోని ఇతర కార్పొరేషన్ల కంటే అత్యధిక విస్తీర్ణంతోఉన్న రామగుండం ప్రాంతంలో ఆదినుంచీ డంపింగ్ యార్డు సమస్య వేధిస్తోంది. గత కొన్నేళ్లుగా సుందిళ్ల సమీపంలోని సింగరేణి స్థలాన్ని డంపింగ్ యార్డుగా వినియోగించుకునే వారు. సింగరేణి ఉపరితలగని విస్తరణతో డంపింగ్ యార్డును తొలగించారు. దీంతో ఖాళీ స్థలం ఎక్కడ కనబడితే అక్కడ చెత్త పడేసే పరిస్థితులు నెలకొన్నాయి. చాలాసార్లు సమీపంలోని కాలనీల వారు చెత్త తరలిస్తున్న వాహనాలను అడ్డుకొని ఆందోళనకు దిగారు. దీంతో గోదావరినది ఒడ్డున సమ్మక్క జాతర ప్రాంతంలో నగరంలోని చెత్తనంతా పడేస్తున్నారు. దీనికి సమీపంలో నివాసాలు లేకపోవడంతో అభ్యంతరాలు వ్యక్తం కాకపోగా పవిత్రమైన గోదావరినదీ జలాలు కలుషితమవుతున్నాయి. పుణ్యస్నానాల కోసం, అంత్యక్రియలకు హిందూ శ్మశాన వాటికకు వచ్చే వారు దుర్గంధంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కొంత చెత్తను గౌతమినగర్ ముందున్న రామగుండం ఎరువుల కర్మాగారం ఖాళీస్థలంలో పడేస్తున్నారు. దీంతో గౌతమినగర్ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో బయోమైనింగ్ విధానం ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపనుంది.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

నగరంలో భారీ చెత్త నిల్వలు సింగరేణి విస్తరణలో పోయాయి. దీంతో రామగుండంలో బయోమైనింగ్ అవసరం లేదు. గోదావరి ఒడ్డున చెత్త నిల్వలు బయోమైనింగ్ చేసేందుకు సరిపోవని పరిశీలకులు పేర్కొన్నారు. స్థానికంగా గోదావరి ఒడ్డున చెత్త నిల్వలను శుద్ధిచేసి తొలగించేలా సమాలోచన చేస్తున్నాం. ప్రస్తుతం గౌతమినగర్‌లోని పొడి చెత్త నిర్వహణ కేంద్రాన్ని అభివృద్ధి చేశాం. తడి చెత్త నిర్వహణపై దృష్టి పెట్టాం. చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
బి.సుమన్‌రావు, కమిషనర్, రామగుండం కార్పొరేషన్

ప్రక్రియ వేగవంతం చేస్తే మేలు

రాష్ట్రంలో డంపింగ్ యార్డుల్లో సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త నిల్వలు ఉన్నట్లుగా గుర్తించిన అధికారులు సత్వరమే బయోమైనింగ్ విధానాన్ని అమలు చేస్తూ సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. మొదటి దశలో డంపింగ్ యార్డుల్లోని చెత్తను శుద్ధిచేసి తడి చెత్తను సేంద్రియ ఎరువు తయారీకి, పొడి చెత్తను సిమెంటు కర్మాగారాలతో పాటు అవసరమైన పరిశ్రమలకు తరలించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఏరోజుకారోజు తడి, పొడిచెత్తను వేరుచేసి శుద్ధిచేసి సేంద్రియ ఎరువు తయారీ, పునర్వినియోగానికి తరలిస్తే డంపింగ్ యార్డు అవసరమే ఉండదు. రామగుండంలో అత్యధిక చెత్త నిల్వ కలిగిన డంపింగ్ యార్డు సింగరేణి విస్తరణలో పోయింది. తాజాగా గోదావరి ఒడ్డున డంపింగ్ యార్డును సైతం ఇప్పటికే సంబంధిత అధికారులు పరిశీలించి వెళ్లారు. డంపింగ్ యార్డుల్లోని చెత్త నిల్వల నిర్వహణ కోసం టెండర్లు నిర్వహించిన ప్రభుత్వం త్వరలోనే ఆయా సంస్థలకు బాధ్యతలు అప్పగించనుంది.

# 24 గంటల వైద్యం ఉత్తమాటే



కరీంనగర్ : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ)లో 24 గంటల వైద్య సేవలు ఉత్తమాటగానే మిగిలిపోయాయి. వైద్యులు, సిబ్బంది కొరతతో వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకే సిబ్బంది రోగులను పరిక్షించి తర్వాత ఆసుపత్రులను మూసివేస్తున్నారు. దీంతో అత్యవసర వేళల్లో పట్టణాలు, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో జిల్లాలోని పీహెచ్‌సీలను బృందం పరిశీలించింది. ఆ వివరాలు..

ప్రారంభానికి నోచుకోని భవనం

మల్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అరకొర వసతులతో ఆసుపత్రి సిబ్బంది అసౌకర్యానికి గురవుతున్నారు. ఆసుపత్రి భవనంలోని గదులు శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలం ఉరుస్తున్నాయి. నూతన భవన నిర్మాణం పూర్తయి ఏడాది గడుస్తున్నా వినియోగంలోకి తీసుకురావడంలేదు. ఆసుపత్రిలో ప్రసవాలు పూర్తిగా తగ్గాయని, రెండు వైద్యుల పోస్టులకుగాను ఒకే వైద్యురాలి నియామకం జరిగింది. నలుగురు ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రతి నేత్రవైద్య నిపుణుడు అందుబాటులో ఉండాల్సినప్పటికీ రావడంలేదని రోగులు తెలిపారు. కుక్క, పాముకాటుకు టీకాలు అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని రకాల యాంటీబయాటిక్, బీపీ మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రైవేటు మందుల దుకాణాల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది

ఒకే వైద్యుడు..

కథలాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులను నియమించగా.. ఇందులో ఒకరిని కోరుట్ల పట్టణం అల్లమయ్యగుట్ట వద్దనున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీఏస్‌సీ)కి డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. ఒక వైద్యురాలు సింధూజ వైద్య సేవలందిస్తున్నారు. నిత్యం సుమారు 100 మందికి పరీక్షలు చేసి మందులను అందజేస్తున్నారు. మండల పరిధిలో సుమారు 40 మంది గర్భిణులు ఉన్నారు. సాయంత్రం తర్వాత ఆసుపత్రిలో వైద్య సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. 3 హెల్త్ అసిస్టెంట్, 2 మొదటి ఏఎన్ఎం, 2 సెంకండ్ ఏఎన్ఎం పోస్టులు ఖాళీలున్నాయి. గర్భిణులకు సాధారణ ప్రసవాలు చేస్తున్నారు. శస్త్రచికిత్స అవసరమైతే కోరుట్ల ఏరియా ఆసుపత్రికి పంపిస్తున్నారు. పాము, తేలు, కుక్కకాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉండటంతో నిత్యం అందిస్తున్నారు. కోరుట్ల.

ఒప్పంద పద్దతిలో

ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తుంది. 24 గంటల ఆసుపత్రి అయినప్పటికీ వైద్యుల కొరతతో అది నెరవేరడం లేదు. ఆరోగ్య కేంద్రానికి పక్కా భవనం, సౌకర్యాలు ఉండగా, సరిపడా సిబ్బంది లేరు. రెండు వైద్యుల పోస్టులుండగా రెండు ఖాళీగా ఉన్నాయి. ఒప్పంద పద్ధతిలో ఓ వైద్యురాలు విధులు నిర్వహిస్తున్నారు. అటెండర్ పోస్టులు 02, ఎన్‌హెచ్ఎం స్టాఫ్ నర్సు 01, ఎంపీహెచ్ఎస్(పురుష) 01, ఏఎన్ఎం 05, రెండో ఏఎన్ఎం 01 పోస్టు ఖాళీగా ఉన్నాయి. పోస్టులను భర్తీ చేస్తేనే గ్రామీణ ప్రజలకు 24 గంటలు నిరంతర సేవలు అందనున్నాయి. పాము, తేలు, కుక్కకాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉండటంతో నిత్యం అందిస్తున్నారు. ఇబ్రహీంపట్నంఒప్పంద పద్ధతిలో..

ప్రసవాలు నామమాత్రం

రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రంగా మారుస్తూ 30 పడకలతో వసతులు సమకూర్చింది. స్థాయి పెరగడంతో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందాల్సి ఉండగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరవై వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులకు అరకొర వైద్యం అందుతుంది. 24 గంటలు వైద్య సేవలు అందించాల్సి ఉండగా మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆసుపత్రి ఖాళీ అవుతుంది. ప్రస్తుతం ప్రసవాలు నామమాత్రంగా జరుగుతున్నాయి. వర్షాకాలంలో శస్త్రచికిత్స గదితోపాటు ఇతర గదుల్లో నీటి లీకేజీ ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వైద్య విధాన పరిషత్ పరిధిలోని వైద్యశాలలో 24 గంటలు వైద్య సేవలు అందేలా జనరల్ ఫిజీషియన్, సర్జన్లను నియమించి పూర్తి స్థాయిలో సిబ్బంది, ఇతర పరికరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కుక్క, పాము, తేలు కాటుకు టీకాలు అందుబాటులో ఉన్నాయి. రాయికల్

రాత్రి వేళ ఇబ్బందులు

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలు అందించాల్సి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో అందడంలేదు. రాత్రివేళ ఆసుపత్రి మూసి ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది. ఇద్దరు వైద్యులకుగాను ఒక్కరే ఉన్నారు. మల్లాపూర్-1, కొత్తదాంరాజుపల్లి-1, మొగిలిపేట-1, ముత్యంపేట-1 ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉండగా, సిరిపూర్ ఏఎన్ఎం డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఖాళీ ఏర్పడింది. ఎంఎల్‌హెచ్‌పీ-1 స్థానం ఖాళీగా ఉంది. దీంతో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలితే పూర్తిస్థాయిలో వైద్య సేవలకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. పాము, కుక్క, తేలు కాటుకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. వర్షాలు కురుస్తుండటంతో పలువురు వ్యాక్సిన్ వేయించుకుంటున్నారు. మల్లాపూర్

సౌకర్యాల కొరత

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవల్లో జిల్లాలోనే ముందు వరుసలో ఉన్నా వసతుల్లో మాత్రం నామమాత్రంగానే ఉంది. ఆసుపత్రిలో రెండు పర్యవేక్షకుల పోస్టులు, మూడు మగ ఆరోగ్య సహాయకులు, నాలుగు మహిళా ఫస్ట్ ఏఎన్ఎంలు, ఒక స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే భవనం పైకప్పు ఉరుస్తుండటం, బయటి నుంచి వచ్చే రోగులకు మూత్రశాలలు లేకపోవడం, ప్రహరీ అసంపూర్తిగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. బీపీకి సంబంధించి టెల్మా-40 మాత్రలు అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. పాము, కుక్క, తేలు కాటుకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. కొడిమ్యాల

మౌలిక వసతుల లేమి సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో 24 గంటలు వైద్య సేవలందించాల్సి ఉన్నప్పటికీ సిబ్బంది లేక మూసివేయాల్సి వస్తోంది. ఇద్దరు వైద్యాధికారుల పోస్టులకు గానూ ఒక్కరే ఉండడంతో సాయంత్రం వేళ మూసి ఉంచుతున్నారు. నలుగురు స్టాఫ్‌నర్స్ పోస్టులకు గానూ ఒక్కరే ఉన్నారు. కొన్నేళ్లుగా వైద్య సహాయకుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో అన్ని ఖాళీలే ఉన్నాయి. ప్రభుత్వం అన్ని రకాల సేవలందిస్తుండంతో ఆయా వైద్య పరీక్షల పరికరాలు ఆరోగ్య కేంద్రానికి తరలించడంతో గదుల కొరతతో ఆరుబయటనే ఉంచాల్సిన పరిస్థితి. సారంగాపూర్

# పనులు దారి కొచ్చేదెన్నడో!

కరీంనగర్: 'దారంతా గుంతల చింత'.. అంటూ ప్రయాణికులు ఈ వానా కాలంలోనూ కష్టాల ప్రయాణాన్ని సాగించక తప్పని పరిస్థితి ఉమ్మడి జిల్లాలో నెలకొంది. గతేడాది వర్షాల హోరుతో నాలుగు జిల్లాల పరిధిలో ఊహించని విధంగా రోడ్లు దెబ్బతిన్నాయి.. కల్వర్టులు కూలిపోయాయి.. ముక్కలైన తారు.. తెగిన దారులతో ఆయా గ్రామాలకు వెళ్లే మార్గాలు రూపుని కోల్పోయాయి.. నదులు, వాగుల ఉద్ధృత ప్రవాహానికి వంతెనలు, కాజ్‌వేలు కొట్టుకుపోయాయి.. రహదారులు భవనాల (ఆర్అండ్‌బి) శాఖతోపాటు పంచాయతీరాజ్ (పీఆర్)శాఖ పర్యవేక్షణలోని దెబ్బతిన్న రోడ్లను బాగు చేసేందుకు నిధులు వచ్చినా.. మరమ్మతుల విషయంలో అనుకున్న పురోగతి కనిపించడంలేదు. 'దారంతా గుంతల చింత'.. అంటూ ప్రయాణికులు ఈ వానా కాలంలోనూ కష్టాల ప్రయాణాన్ని సాగించక తప్పని పరిస్థితి ఉమ్మడి జిల్లాలో నెలకొంది. గతేడాది వర్షాల హోరుతో నాలుగు జిల్లాల పరిధిలో ఊహించని విధంగా రోడ్లు దెబ్బతిన్నాయి.. కల్వర్టులు కూలిపోయాయి.. ముక్కలైన తారు.. తెగిన దారులతో ఆయా గ్రామాలకు వెళ్లే మార్గాలు రూపుని కోల్పోయాయి.. నదులు, వాగుల ఉద్ధృత ప్రవాహానికి వంతెనలు, కాజ్‌వేలు కొట్టుకుపోయాయి.. రహదారులు భవనాల (ఆర్అండ్‌బి) శాఖతోపాటు పంచాయతీరాజ్ (పీఆర్)శాఖ పర్యవేక్షణలోని దెబ్బతిన్న రోడ్లను బాగు చేసేందుకు నిధులు వచ్చినా.. మరమ్మతుల విషయంలో అనుకున్న పురోగతి కనిపించడంలేదు. వర్షాకాలం వచ్చినా పనుల నత్తనడక తీరు ఇబ్బందిని పెంచుతోంది.

ఏ జిల్లాలో ఏమిటీ పరిస్థితి?కరీంనగర్ జిల్లాలో పీఆర్ రోడ్లు 114 చోట్ల దెబ్బతిన్నాయి. ఇందులో ఇప్పటి వరకు 62 దారులకు మరమ్మతు చేశారు. రూ.70 కోట్లు మంజూరవగా ఇందులో సగం నిధులు వెచ్చించారు. ఇంకా చాలా గ్రామాల పరిధిలో అవసరమైన పనులు చేస్తున్నారు. ఆర్అండ్‌బి శాఖ పర్యవేక్షణలో 30 రోడ్లను బాగు చేయాలని భావించారు. రూ.2 కోట్ల నిధులతో పనులను దాదాపుగా పూర్తి చేశారు. వర్షాలకు దెబ్బతిన్నవి మాత్రమే పూర్తవగా నాలుగు నియోజకవర్గాల్లో సాగుతున్న రోడ్ల విస్తరణ, కొత్తదారుల పనులు నత్తనడకనే సాగుతున్నాయి.రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని ఎంఆర్ఆర్ (గ్రామీణ రహదారుల నిర్వహణ)లో తొమ్మిది ప్యాకేజీలకుగాను రూ.24.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దాదాపుగా 110 కి.మీ.ల మేర దెబ్బతిన్న రోడ్లు మరమ్మతు చేయాలి. ఈ జిల్లా పరిధిలో ఇంకా 20శాతం మేర కొసరు పనులు మిగిలే ఉన్నాయి. ఇవి కాకుండా పీఎంజీఎస్‌వై కింద జిల్లాకు 12 రహదారులు, మూడు వంతెనలకు రూ.44 కోట్లు రాగా.. ఇందులోనూ కేవలం ఆరు పనులు మాత్రమే ప్రారంభమయ్యాయి. ఆర్అండ్‌బి పర్యవేక్షణలో 9 పెద్ద రహదారులకు రూ.46లక్షలతో అవసరమైన చోట ప్యాచ్ వర్క్‌లను పూర్తిచేశారు.

జగిత్యాల జిల్లాలోనే అత్యధికంగా రోడ్లు దెబ్బతిన్నాయి. రాయికల్, సారంగాపూర్, ధర్మపురి మండలాల్లో ఎక్కువ నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 66 పీఆర్ రోడ్ల మరమ్మతుకు రూ.28.79 కోట్లు కేటాయించారు. ఇందులో 58 పనులు ప్రారంభమవగా కేవలం 15 పూర్తయ్యాయి. మరో 43 ప్రగతి దశలో ఉన్నాయి. 8 పనులు అసలు ప్రారంభించలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్అండ్‌బి కోసం మంజూరైన రూ.58 లక్షలతో 10 దారుల్లో మాత్రం తాత్కాలిక మరమ్మతులను చేపట్టారు.

పెద్దపల్లి జిల్లాలో ప్రధాన రహదారులకు ఎక్కువ నష్టం వాటిల్లింది. ముఖ్యంగా ఆర్అండ్‌బి పరిధిలో ఉన్న 40 రోడ్లకుగానూ రూ.2.50 కోట్లను తాత్కాలికంగా గుంతలు పూడ్చడం సహా ఇతర పనులకు ఖర్చు చేశారు. గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న పంచాయతీరాజ్ దారుల పరిస్థితి మాత్రం పూర్తిస్థాయిలో మెరుగవలేదు.

బిల్లుల గుబులుతో..!

ఇంజినీరింగ్ శాఖల పర్యవేక్షణలో చేపట్టే ఈ పనులను చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో టెండర్ల నిర్వహణ ఆలస్యమైంది. మరోవైపు గుత్తేదారులు ఉమ్మడి జిల్లాలో కొత్త రోడ్ల నిర్మాణాల్లో తీరిక లేకుండా ఉండటంతో మరమ్మతు పనులపై అంత ఆసక్తిని చూపించలేదు. దీంతో ఆయా మండలాల పరిధిలో టెండర్ల జోలికి వెళ్లకపోవడం ప్రతిబంధకంగా మారింది. మరోవైపు గతంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో అందకపోవడం వల్ల ఈ పనులనెవరూ పట్టించుకోలేదు. రెండు మూడేళ్లుగా కోట్లాది రూపాయల బకాయిల గుదిబండ సమస్యను మరింతగా పెంచింది. ఇప్పటికే పాత పనుల పైసలు చేతికి అందక ఆర్థికంగా కుదేలయ్యామని పలువురు వారు అధికారుల ఎదుట ఆవేదనను వ్యక్తం చేశారు. దీంతో తప్పనిసరైన పరిస్థితుల్లో ముందుకొచ్చిన కొంతమందికి వీటి బాధ్యతల్ని అధికారులు అప్పగించాల్సి వచ్చింది. ప్రాధాన్యత క్రమంలో అవసరమైన పనులను అక్కడక్కడ పూర్తి చేయించారు.

ఈసారీ అవే కష్టాలు..!ఈ వానాకాలంలోనూ ఉమ్మడి జిల్లాలో లోతట్టు వంతెనలు, కోతకు గురైన రోడ్లు, తారు కొట్టుకుపోయిన దారుల పరంగా పాత కష్టాల్ని ఎదుర్కోవాల్సిన దుస్థితియే ఎదురవబోతోంది. చాలా గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లు శిథిలమయ్యాయి. అన్నింటికన్నా ముఖ్యంగా నాలుగు జిల్లాల పరిధిలో కొత్త రోడ్లను కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్నారు. విస్తరణ పనులతోపాటు కంకర దారుల్ని బీటీలుగా మారుస్తున్నారు. ఈ పనులన్నీ ఈ వేసవిలోనే పూర్తవ్వాలి. కాని ఎక్కడా నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయలేదు. దీంతో ఈ నెలలో వర్షాలు పడితే చేసిన సగం పనులు కొనసాగడం ఇబ్బందే. లోతట్టు వంతెనలు, కల్వర్టులను చాలాచోట్ల విస్మరించారు.

# సర్కారు బడుల్లో సాంకేతిక బోధన

కరీంనగర్ : ప్రభుత్వ బడుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. 'మన ఊరు-మన బడి' పథకంలో భాగంగా తరగతి గదిలో విద్యార్థులకు బోధనలోనూ సరికొత్త సౌకర్యాలను కల్పించారు. ఈసారి ఉన్నత పాఠశాలల్లో సాంకేతిక పరికరాలతో బోధిస్తున్నారు.

8, 9, 10 తరగతి విద్యార్థులకు

జిల్లాలో మొదటి విడతగా మన ఊరు-మన బడి పథకంలో ఎంపికైన 213 పాఠశాలల్లో అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, పలు పాఠశాలల్లో చివరి దశకు చేరగా, కొన్నింట్లో పనులు పూర్తయ్యాయి. జిల్లాలో ఎంపిక చేసిన 94 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ)లను ఏర్పాటు చేశారు. ఒక్కో పాఠశాలల్లో 8, 9, 10వ తరగతుల గదుల్లో వాటిని పాఠశాలల ప్రారంభానికి ముందే నెలకొల్పడంతో ఉపాధ్యాయులు వాటిపై బోధిస్తున్నారు. ఒక్కో పాఠశాలకు సుమారు రూ.10 లక్షల విలువైన పరికరాలను అందించారు. 75 అంగుళాల తెర, ఓపీఎస్ మెటల్ ఫ్రేమ్, ఆన్‌లైన్ యూపీఎస్‌లు, బ్యాటరీలను సమకూర్చారు. విద్యుత్తు సరఫరా లేకున్నా దాదాపు 6 గంటలపాటు బ్యాటరీల సాయంతో ఇవి పని చేస్తాయి.



సాంకేతిక బోధనతోపాటు ఇరువైపులా ఉండే గ్రీన్‌చాక్ బోర్డు సాయంతో విద్యార్థులకు పాఠాలు వివరిస్తున్నారు. వైఫై సౌకర్యాన్ని కల్పించడంతో యూట్యూబ్, వివిధ యాప్‌ల ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. వివిధ రకాల పాఠ్యాంశాలకు కావాల్సిన వివరాలను చిత్రాలు, వీడియోల రూపంలో అర్థవంతంగా ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. ఈ సౌకర్యాలు కల్పించడంతో పాఠశాలల్లో హాజరు శాతం, నూతన ప్రవేశాలు పెరిగాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఆసక్తిగా వింటున్నాం

గతంలో కంటే భిన్నంగా ఐఎఫ్‌పీలపై బోధన చేయడంతో పాఠ్యాంశాలను ఆసక్తిగా వింటున్నాం. వీడియోలు, వివిధ రకాల చిత్రాల పాఠాలను ప్రత్యక్ష అనుభవం పొందేలా బోధన కొనసాగుతుండటంతో నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతోంది.- టి.రాధిక, 10వ తరగతి, జడ్పీ ఉన్నత పాఠశాల, గన్నేరువరం.

బోధన సులభతరం ప్రభుత్వం ఐఎఫ్‌పీలను అందించడంతో బోధన సులభతరమైంది. వీడియోలు, చిత్రాల ద్వారా దృశ్యరూపంలో పాఠాలను బోధిస్తున్నాం. పాఠ్యాంశంలోని అంశాలే కాకుండా వాటికి సంబంధించి అదనపు సమాచారాన్ని కూడా చూపించడంతో విద్యార్థులు ఆసక్తిగా వింటున్నారు.జి.రంగారావు, ప్రధానోపాధ్యాయుడు, వెదురుగట్ట

# సీజన్ ముగిశాక.. యంత్రాల కేటాయింపు

కరీంనగర్ : ఈ చిత్రంలోని ప్యాడీ క్లీనర్ (వరి ధాన్యం శుభ్రం చేసే యంత్రం) గంగాధర మండలం బూర్గుపల్లిలోని వన నర్సరీలో రెండేళ్ల నుంచి వృథాగా పడి ఉంది. ఇక్కడి కొనుగోలు కేంద్రంలో కరెంటు వసతి లేకపోవడంతో దీనిని వినియోగించడం లేదు. గత రెండు సీజన్లలో ధాన్యం శుభ్రం చేసినా, చేయకపోయినా తూకం వేసే సమయంలో బస్తాకు అదనంగా మూడు నుంచి నాలుగు కిలోలు కోత వేస్తూ తూకం వేస్తున్నారు. మిల్లులకు తరలించాకా అక్కడా కోతలు విధిస్తుండడంతో అన్నదాతలు విసిగిపోయి ధాన్యాన్ని శుభ్రం చేయడంలేదు.ఇదొక్క యంత్రమే కాదు దాదాపు అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డుల పరిధిలో విలువైన యంత్రాలు ఉన్నా ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిధిలో ఆరుబయటే ఉంచడంతో వర్షాలకు తడుస్తూ, ఎండకు ఎండుతూ తుప్పు పట్టిపోతున్నాయి. వీటినే




సద్వినియోగం చేసుకోలేక వృథా చేయగా జిల్లా అధికారులు రైతు ధనాన్ని దుర్వినియోగం చేసేలా మరోసారి అదను దాటాక జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్యాడీ క్లీనర్లు, ఫ్యాన్లు కేటాయించారు.

సొంత స్థలం లేక...

యాసంగి సీజన్ వరి ధాన్యం కొనుగోలు పూర్తయ్యాక జిల్లాలోని 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్యాడీ క్లీనర్లు, ఫ్యాన్లు (పంకలు) కేటాయించారు. గంగాధర, చొప్పదండి, గోపాల్‌రావుపేట, కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, చిగురుమామిడి, గన్నేరువరంలోని మార్కెట్ యార్డుల పరిధిలోని ప్రభుత్వ కేంద్రాలకు 408 ప్యాడీ క్లీనర్లు, 21 ఫ్యాన్లు కేటాయించారు. గతంలో ఉన్న పాత యంత్రాలనే వినియోగించకుండా ఆయా గ్రామాల్లోని కేంద్రాల్లో ఓ మూలన పడేశారు. కొన్ని గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు సొంత స్థలం లేకపోవడం, ఊరుకు దూరంగా రైతుల పంట పొలాల్లోనే కేంద్రాల ఏర్పాటుతో విద్యుత్తు వసతి కల్పించక యంత్రాలు వినియోగించడం లేదు. ప్రస్తుతం కేటాయించిన యంత్రాలను కూడా వినియోగించే పరిస్థితి లేదని ఆయా గ్రామాల రైతులు పెదవి విరిచారు. కేవలం కమీషన్ల కక్కుర్తితోనే కొనుగోలు చేశారనే ఆరోపణలున్నాయి.

# పోస్టుల భర్తీతో.. విద్యా సమాచార విభాగం పటిష్ఠం

కొత్తగూడెం : విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) పోస్టుల భర్తీకి రెండేళ్ల తర్వాత మోక్షం కలుగుతోంది. ఇవన్నీ విద్యాలయాల సమగ్ర సమాచార నిర్వహణకు సంబంధించి కీలమైన పోస్టులే. తాజాగా జారీ అయిన రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వుల కాంట్రాక్టు పద్ధతిన భర్తీ అయ్యే పోస్టులు ఖమ్మం జిల్లాలో 15, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 33 ఉన్నాయి. వీటిలో డేటా ఎంట్రీ ఆపరేటర్, సిస్టం అనలిస్టులు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రోగ్రామర్, ఇన్‌క్లుజివ్ ఎడ్యుకేషన్ రిసోర్సు పర్సన్ పోస్టులున్నాయి. వీటి భర్తీకి 2019, నవంబరులోనే నోటిఫికేషన్ వెలువడగా.. 2020, డిసెంబరులో రాత పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. కరోనా విజృంభణతో తదనంతన ప్రక్రియ నిలిచింది. జాబితాలో చోటుదక్కిన



అభ్యర్థుల తుది వివరాల పరిశీలన పూర్తయితే జులై 10న విధుల్లో చేరే అవకాశం ఉంది. మండల స్థాయిలో అన్నిరకాల యాజమాన్యాల పాఠశాలలకు చెందిన సమాచారంతో పాటు, డీఈఓ కార్యాలయ ఆదేశాలతో అమలు జరపాల్సిన పనులను సంబంధించిన వివరాలన్నీ మండల స్థాయి సిబ్బంది ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, ఇన్‌క్లుజివ్ ఎడ్యుకేషన్ ఆర్పీ, డేటా ఎంట్రీ ఆపరేటర్లు చూస్తారు. జిల్లా స్థాయిలో విద్యాలయాల సమాచార నిర్వహణతో పాటు రాష్ట్రస్థాయి నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం వివరాలు ఆన్‌లైన్ చేయడం, నివేదికలు రూపొందించడం డీఈఓ కార్యాలయ డేటా ఎంట్రీ ఆపరేటర్, సిస్టం అనలిస్టులు, అసిస్టెంట్ ప్రోగ్రామర్‌ల బాధ్యత. ఆయా పోస్టుల భర్తీలో భాగంగా ఈ నెల 3 వరకు అభ్యంతరాలు స్వీకరించి.. తుది జాబితా 7న ప్రకటించనున్నారు. మరుసటి రోజు నిజ ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుంది. ఎంపికైన వారికి పదో తేదీన నియామక పత్రాలు అందజేస్తామని డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. మెరిట్ లిస్టును ఇప్పటికే ఎంఈవో కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు చెప్పారు.

# కడగండ్లే మిగిలాయి..

భూపాలపల్లి : అకాల వర్షాలతో పంట నష్టం జరిగిన అన్నదాతలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కలగానే మిగిలింది.. గత మార్చిలో పంట చేతికందే సమయంలో వడగళ్ల వాన కురవడంతో జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. దీంతో ప్రభుత్వం అన్నదాతలకు ఇబ్బందులు ఉండొద్దనే ఉద్దేశంతో ఎకరాకు రూ.10 వేలు అందిస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా రైతన్నలకు నష్ట పరిహారం వచ్చిన దాఖలాలు లేవు. దీంతో ఎప్పుడెప్పుడు నష్టపరిహారం అందిస్తారా..? అని రైతులు ఎదురుచూస్తున్నారు. గత మార్చిలో కురిసిన అకాల వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2,425 మంది అన్నదాతలకు సంబంధించిన వరి, మొక్కజొన్న, మిరప, బొప్పాయి, అరటి, పుచ్చకాయ పంటలు 2,115 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. పంట నష్టపోయిన ప్రతి అన్నదాతకు నష్ట పరిహారం



అందిస్తామని ప్రభుత్వం తెలపడంతో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేశారు. 30 శాతం కంటే ఎక్కువగా దెబ్బతిన్న పంటలను నష్టపరిహారం జాబితాలో చేర్చి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నుంచి ఎకరా రూ.10 వేల చొప్పున నెల క్రితం నిధులను మంజూరు చేసినా జిల్లాలో మాత్రం అన్నదాతలకు నష్టపరిహారం చెల్లింపులో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. వానాకాలం పెట్టుబడికి ఉపయోగపడుతుందని, త్వరగా పరిహారం వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతన్నలు వేడుకుంటున్నారు.

**రూ.2.11 కోట్లు మంజూరు**

అకాల వర్షాలతో జిల్లాలోని 5 మండలాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. వడగండ్ల వానలతో ఎక్కువ మొత్తంలో మొక్కజొన్న పంట దెబ్బతినగా ఆ తర్వాత స్థానాల్లో మిరప, వరి పంటలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు అకాల వర్షాలతో 2,115 ఎకరాలు పంట దెబ్బతిన్నట్లు నివేదిక అందించారు. దీంతో ఎకరా రూ.10 వేల చొప్పున జిల్లాకు రూ.2.11 కోట్ల నిధులను మంజూరు చేశారు.

**పంటల బీమాకు చర్యలు శూన్యం**

పంట సాగు సమయంలోనే అన్నదాతలు పంటల బీమా చేసుకునేలా ఒక నోడల్ ఏజెన్సీని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. బీమా చేసుకున్న రైతులకు అకాల వర్షాలతో నష్టం జరిగితే బీమా కంపెనీ వారు పరిహారం అందిస్తారు. అలాంటి పంటల బీమాకు సంబంధించి ప్రభుత్వం కొన్నేళ్లుగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. పంట నష్టం వాటిల్లినప్పుడు ప్రభుత్వం అందించే పరిహారం అందకున్నా కనీసం బీమా అయినా వర్తిస్తుందని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని పంటల బీమాపై విస్తృత ప్రచారం కల్పించి ప్రతి ఒక్క అన్నదాత బీమా చేసుకునేలా చర్యలు తీసుకోవాలని రైతన్నలు అంటున్నారు.

**వారంలోగా పంపిణీ– విజయ్‌భాస్కర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి**

పంట నష్టం పరిహారానికి సంబంధించి వారం రోజుల్లో సంబంధిత అన్నదాతలకు నష్ట పరిహారం చెల్లింపు చేపడతాం. ప్రభుత్వం నుంచి పరిహారానికి సంబంధించి నిధులు మంజూరయ్యాయి. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

# ఇక రేషన్ బియ్యం లెక్కా పక్కా



నర్సంపేట : పేదలకు చౌక ధరకు అందించే రేషన్ బియ్యం సరఫరాలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాహనాల ద్వారా సరఫరా చేసే సమయంలో, బియ్యం పంపిణీలో అవకతవకలకు చెక్ పెడుతూ పలు సంస్కరణలు తీసుకొచ్చింది. అయినా మండల స్థాయి నిల్వ (ఎంఎల్ఎస్) కేంద్రాల దగ్గర అక్రమాలు కొనసాగుతున్నాయి. అక్కడి నుంచి చౌక ధరల దుకాణాలకు పంపే బియ్యంలో కోత పెడుతుండటంతో డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. బస్తాకు రెండు నుంచి అయిదు కిలోలు తక్కువ ఇస్తున్నారని ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేశారు. ప్రభుత్వం స్పందించిన ఈ అక్రమానికి అడ్డుకట్ట వేసి, ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపట్టింది.

**ఎంఎల్ఎస్ పాయింట్లలోనూ బయోమెట్రిక్..**

ప్రతి నెలా కార్డుదారులకు బయోమెట్రిక్ పద్ధతిలో బ్లూటూత్‌తో అనుసంధానమైన ఎలక్ట్రానిక్ కాంటాపై డీలర్లు బియ్యం తూకం వేసి అందిస్తున్నారు. అయితే రేషన్ దుకాణాలకు పంపించే బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ వద్దే తూకంలో కోత పెడుతున్నారు. దీంతో డీలర్లు లబ్ధిదారులకు పంపిణీ చేసే సమయంలో కోత పెడుతున్నారు. లేదంటే తాము తీవ్రంగా నష్టపోతామని బాహాటంగా చెబుతున్నారు. దీనిపై దృష్టి సారించిన పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు ఎంఎల్ఎస్ పాయింట్ల దగ్గర అక్రమాలకు చెక్ పెట్టడానికి రాష్ట్రంలోని 13 జిల్లాల్లో బయోమెట్రిక్ విధానం తీసుకొచ్చింది. డీలర్లు వచ్చి నేరుగా బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర మేసి, పక్కాగా తమ దుకాణానికి కేటాయించిన బియ్యాన్ని తూకం వేసుకొని వెళ్లేలా చర్యలు చేపట్టింది.

**జిల్లాలో 504 రేషన్ దుకాణాలు..**

వరంగల్ జిల్లాలో మొత్తం 504 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వాటి పరిధిలో 7,88,511 కుటుంబాలు రేషన్ కార్డులను కలిగి ఉన్నాయి. వారికి ప్రతి నెలా 49,889.90 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నారు. ఆహార భద్రత కార్డుదారులకు ఒక్కో సభ్యుడికి ఆరు కిలోలు, అంత్యోదయ కార్డుదారుడికి 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోల చొప్పున ప్రభుత్వాలు ఉచితంగా బియ్యం అందజేస్తున్నాయి.

**అవకతవకలకు తావు లేకుండా..**

**– వినోద్, డీటీసీఎస్, నర్సంపేట**

ప్రభుత్వం ఉచితంగా పేదలకు పంపిణీ చేస్తున్న బియ్యం తూకాల్లో అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం బయోమెట్రిక్ విధానం అమలు చేస్తోంది. దీన్ని జిల్లాలో పారదర్శకంగా అమలు చేస్తున్నారు. ఎంఎల్ఎస్ కేంద్రాల వద్ద డీలర్లు వేలి ముద్రలు వేసి బస్తాలను తూకం వేసి బరువు సరి చూసుకొని తీసుకెళ్తారు. దీనిద్వారా బస్తాల్లో తక్కువ బియ్యం వచ్చే ఆస్కారం ఉండదు.

# నత్తనడకన పల్లె దవాఖానా భవనాల నిర్మాణం



జనగామ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్లె వైద్యానికి పెద్ద పీట వేస్తున్నాయి. ఇందులో భాగంగా గతంలో కేవలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మాత్రమే ఉండగా, ఇప్పటికే గ్రామాల్లో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మారుస్తున్నారు. వీటిని మినీ పీహెచ్‌సీల తరహాలో తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. గతేడాది ప్రారంభమైన పల్లె దవాఖానాల భవనాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

**మూడు విడతల్లో నిధులు మంజూరు**

2022లో మొదటి విడతలో 15 పల్లె దవాఖానాల భవనాల నిర్మాణ పనులు ప్రారంభించారు. చిన్నమడూరు, వడ్లకొండ, పెంబర్తి, కట్కూరు, కొన్నె, నమిలిగొండ ఎస్సీ బస్తీ, సముద్రాల, కోమటిగూడెం, విస్నూరు, వావిలాల, ముత్తారం, శ్రీపతిపల్లి, ఏడునూతల, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. వీటిలో కొన్ని భవనాల పనులు పూర్తయ్యే దశలో ఉండగా, మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. ఈ ఏడాది రెండో విడతలో మాదాపురం, దేవరుప్పల, ధర్మాపురం, ఆగాపేట, గండిరామారం, నర్మెట్ట, కొండాపూర్, మంచుప్పల, పాలకుర్తి, దర్దేపల్లి, చిల్పూరు, పెద్దరామన్‌చర్ల, బచ్చన్నపేట–1, బచ్చన్నపేట–2, కొడకండ్లలో పల్లె దవాఖానాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కొద్ది నెలల క్రితం మూడో విడతలో మరో 47 పల్లె దవాఖానాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. మొదటి విడతలో ప్రారంభించిన దవాఖానాల భవనాల పనులు పూర్తి కాలేదు. రెండో, మూడో విడతల్లో మంజూరైన భవనాల పనులను ప్రారంభించ లేదు.

**ఆగుతూ.. సాగుతూ**

జిల్లాలో మొత్తం 104 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా ఇప్పటి వరకు 77 పీహెచ్‌సీలు పల్లె దవాఖానాలుగా మారాయి. వీటిలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు, స్టాఫ్ నర్సులను నియమించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిగిలిన పీహెచ్‌సీలన్నీ పల్లె దవాఖానాలుగా మారబోతున్నాయి. గతేడాది పలు మండలాల్లోని గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలుగా ఉండి, ప్రస్తుతం పల్లె దవాఖానాలుగా మారిన వాటికి శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టారు. 15 చోట్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. రెండో దశలో 15 పల్లె దవాఖానాలు, మూడో దశలో 47 పల్లె దవాఖానాల భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. నిధులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి పంచాయతీరాజ్ శాఖకు వెళ్తాయి. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పల్లె దవాఖానాల భవనాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధులున్నా పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొదటి దశలో 15 భవన నిర్మాణాలకు టెండర్లు పూర్తయి పనులు ప్రారంభం కాగా ఒకటి, రెండు భవనాలు మాత్రమే పూర్తయ్యే దశలో ఉన్నాయి. రెండు, మూడో దశల్లో మంజూరైన భవనాలకు టెండర్ దశ కూడా దాటలేదు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం– డాక్టర్ ఎస్.ప్రశాంత్, జిల్లా వైద్యాధికారి**

జిల్లా వ్యాప్తంగా మొదటి, రెండో దశల్లో మంజూరైన భవనాల నిర్మాణాలు ప్రారంభయ్యాయి. ఇటీవలే రెండు భవనాలను ప్రారంభించాం. 13 భవనాల పనులు పురోగతిలో ఉన్నాయి. మూడో దశలో మంజూరైన 47 భవనాలకు టెండర్లను పిలవాల్సి ఉంది. నిర్మాణ పనుల్లో జాప్యాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

# వరుణా.. కరుణించు..

మహబూబాబాద్ : పచ్చగా ఎదగాల్సిన పైర్లు వాడిపోతున్నాయి.. నేలవాలి పోతున్నాయి.. మాలో ఆశలు సన్నగిల్లుతున్నాయి.. నీ కోసం ఎదురుచూస్తున్న మా కళ్లలో నీళ్లు ఇంకిపోతున్నాయి. కరుణించి మేఘాల గుండెలను చీల్చుకుంటూ ఆవనిపైకి జాలువారుతూ కరవు తీరా కురిసిపో. వానదేవుడిని దారి మళ్లిస్తున్నా ఓ గాలిదేవుడా ఒక గడియ అడ్డుతొలిగిపో.ఏడాది క్రితం: సరిగ్గా ఏడాది కిందట జులై మాసంలో మేఘానికి చిల్లు పడిందా అన్నట్లు వర్షించావు.. గోదారమ్మ ఉరకలెత్తింది. పాకాల, మున్నేరు, ఆకేరు పరవళ్లు తొక్కాయి. ఇక వాగులు, వంకలు పరుగులు తీశాయి. అన్నదాతల్లో ఆనందం వెల్లివిరిసింది. సాగుబాట పట్టారు.. మరీ ఇప్పుడు తొలకరి అంటూ తొంగి చూసి వెళ్లావు.. వారమైనా ఓ మోస్తారుగా కూడా కురవలేదు. సాయంత్రమైతే మేఘావృతమై అదిగో.. ఇదిగో..అంటూ ధరిణి మురిసేలా కనిపిస్తూ దోబూచూలాడుతున్నావు.

కొద్దిపాటి వర్షంతో..తొలకరితో పొలం పనులు మొదలు పెట్టాం.. దుక్కులు దున్నాం.. విత్తనాలు నాటాం.. వర్షం ఎప్పుడు పడుతుందా అని నింగివైపు దిగాలుగా చూస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో లోటు వర్షపాతం నమోదైంది. మొన్న కురిసిన కొద్ది పాటి వానకు సుమారు 3.50 లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటాం. సుమారు రూ. 56 కోట్ల పెట్టుబడి పెట్టాం. అందులో కొన్ని మొలకెత్తక నష్టపోయాం. మొలకెత్తిన చోట వాటిని కాపాడుకునేందుకు కడవలతో నీళ్లు తెచ్చి పాదుల్లో పోస్తున్నాం. పైపుల ద్వారా మొక్క మొదళ్లు తడిసేలా



నీరందిస్తున్నాం.మరింత ఆలస్యమైతే..ఇంకొద్ది రోజుల పాటు పుడమిపై నీ తడి పడకుంటే పంటలన్నీ ఎండిపోతాయి.. పెట్టిన పెట్టుబడులకు అప్పుల వడ్డీలు పెరిగిపోతాయి.. కుటుంబం రోడ్డున పడుతుంది. ఈ పెను ప్రమాదం నుంచి తప్పించేందుకు నలు దిక్కుల్లో నీవెక్కడున్నావో తెలుసుకుని చెప్పే వాతావరణ శాఖ తీపి కబురు కోసం ఎదురుచూస్తున్నాం. నిన్ను మెప్పించేందుకు పిల్లలు కప్పల పెళ్లి, కప్పతల్లి ఆట ఆడేందుకు.. ఆడపడుచులు ఉయ్యాల పాటలతో కోలాటాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. తెలిసో.. తెలియకో పర్యావరణానికి ప్రజానీకం చేస్తున్న తప్పులను మన్నించు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలను సంతోషంగా ఉంచేలా పుడమికి జలాభిషేకం చేయి.. బీడు బారుతున్న మా భూములను తడుపుతూ.. మొక్కలకు ఊపిరిపోయి.. చెరువులు మత్తుళ్లు పోసేలా.. వరదలతో కాలువలు ఉప్పొంగేలా వర్షించు. వానదేవా మా మొర ఆలకించు.

# విద్యార్థులకు.. రాయితీ బస్‌పాస్‌లు

మహబూబాబాద్ : ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులకు బస్ పాసులు అందించేందుకు ఆర్టీసీ సంస్థ సన్నద్ధమైంది. విద్యా సంస్థల ప్రారంభం నుంచి జారీ మొదలు పెట్టినా ఇప్పుడిప్పుడే ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో విద్యార్థులకు ఉచిత, రాయితీ పాసులు అందించడానికి సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. పన్నెండేళ్లలోపు బాలురు, 18 ఏళ్లలోపు బాలికలకు 20 కిలోమీటర్ల వరకు ప్రయాణానికి ఉచిత పాసులు అందిస్తారు. పదో తరగతిలోపు బాలికలు మాత్రమే అర్హులు.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వారికీ ఇస్తారు. పాఠశాల నుంచి బోనఫైడ్ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని సమీపంలోని ఆర్టీసీ బస్టాండుల్లోని బస్ పాసుల జారీ కేంద్రాల వద్ద రూ.50 చెల్లిస్తే పాసు అందిస్తారు.

**డీడీలు చెల్లించాలి..**

ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు బస్ పాసులు మంజూరు చేయాలంటే సదరు ప్రైవేటు విద్యా సంస్థలు ఆర్టీసీకి ఏటా డీడీ రూపంలో నగదు



చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో విద్యా సంస్థకు ఆర్టీసీ ప్రత్యేకంగా యూజర్ ఐడీ, పాస్ వర్డులను కేటాయిస్తుంది. సూచించిన పేరు మీద డీడీలు తీసి, సమీపంలోని డిపోల్లో అందజేయాలని అధికారులు చెబుతున్నారు. 200 మందిలోపు విద్యార్థులున్న ప్రైవేటు పాఠశాలలు రూ.750, 500లోపు విద్యార్థులున్న పాఠశాలలు రూ.1000, 500 పైన విద్యార్థులున్న పాఠశాలలు రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది.

**35 కి.మీ లోపే..**

ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోని 12 ఏళ్ల పైబడి విద్యార్థులకు రాయితీ బస్‌పాసులు అందిస్తారు. 35 కిలోమీటర్ల లోపు మాత్రమే ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. కిలోమీటర్ల ఆధారంగా ఛార్జీలు వసూలు చేస్తారు. గుర్తింపు కార్డుల కోసం అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుంది.

**సద్వినియోగం చేసుకోవాలి– ప్రతిమారెడ్డి, ఆర్టీసీ డీఎం, భూపాలపల్లి**

ఆర్టీసీ అందిస్తున్న ఉచిత, రాయితీ బస్ పాసులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 12 ఏళ్లలోపు బాలురు, పదో తరగతి వరకు బాలికలకు 20 కిలోమీటర్ల వరకు ఉచితంగా జారీ చేస్తాం. విద్యా సంస్థలు వారికి కేటాయించిన డీడీలు సకాలంలో చెల్లించి పాసుల జారీకి సహకరించాలి.

# దారి తప్పిన లక్ష్యం

వరంగల్ : గిరిజన సంక్షేమ శాఖ లక్ష్యం దారి తప్పింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 12, పూర్వ కరీంనగర్ నుంచి వచ్చిన 2 వసతి గృహాలను గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలుగా మార్చారు. 2015–16 విద్యా సంవత్సరంలో ఈ వసతి గృహాలను ఆశ్రమ పాఠశాలలుగా మార్చినప్పటి నుంచి ప్రధానోపాధ్యాయులు, విషయ బోధన ఉపాధ్యాయులను నియమించలేదు. ప్రారంభం నుంచి అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పటివరకు పదో తరగతి ఆరు బ్యాచ్‌లు బయటకు వెళ్లాయి. ప్రారంభం నుంచి సీఆర్‌టీ (కాంట్రాక్ట్ రిసోర్స్ టీచర్స్)లు, డిప్యుటేషన్‌పై వచ్చిన నలుగురు ఉపాధ్యాయులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. వసతి గృహాలను ఆశ్రమ ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించి, ఉపాధ్యాయ పోస్టులు ఇవ్వకుండా తమ పిల్లల భవిష్యత్తును అంధకారం చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ ఒక్క ప్రజాప్రతినిధి కూడా ఈ విషయంపై పాలకవర్గ సమావేశాల్లో ప్రశ్నించకపోవడం గమనార్హం.

**ఉన్నతీకరించిన పాఠశాలలు**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12, పూర్వపు కరీంనగర్ జిల్లా నుంచి 2 గిరిజన సంక్షేమ వసతి గృహాలను ఆశ్రమ ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించారు. ఏటూరునాగారం, గూడూరు, దంతాలపల్లి, మహబూబాబాద్, మరిపెడ, జనగాం, పర్వతగిరి, బాలసముద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహాలు, కురవి, మహబూబాబాద్, వర్ధన్నపేట, హనుమకొండలోని జులైవాడ ఎస్టీ బాలికల వసతి గృహాలు, పూర్వపు కరీంనగర్ జిల్లాలోని తాడిచర్ల ఎస్టీ గిరిజన బాలుర వసతి గృహం, మహాదేవ్‌పూర్‌లోని ఎస్టీ బాలికల వసతి గృహాలను ఆశ్రమ ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించారు. ఎక్కువ మంది ఉపాధ్యాయులున్న ఆశ్రమ పాఠశాలల నుంచి డిప్యూటేషన్ ఇస్తూ నలుగురు ఎస్జీటీ ఉపాధ్యాయులను పంపించి, మిగతా సీఆర్‌టీలను నియమించి బడులను నిర్వహిస్తున్నారు. ప్రతి పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు, సబ్జెక్ట్ వారీగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయాలని నిబంధనలున్నా.. ఏడేళ్లు గడిచినా ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. తప్పుదోవ పట్టిస్తున్న వార్డెన్లు వసతి గృహాలను ఆశ్రమ ఉన్నత పాఠశాలలుగా మార్చడంతో తమ ఆదాయానికి గండి పడిందన్న అక్కసుతో వార్డెన్లు గిరిజన సంక్షేమ శాఖ లక్ష్యాన్ని దారి మళ్లిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వసతి గృహాలుగానే ఉంటే విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేవారు. దాంతో మధ్యాహ్న అందించాల్సిన భోజనం, ఇతరత్రా ఆహార పదార్థాలు అందించాల్సిన అవసరం ఉండేది కాదు. ఫలితంగా సంబంధిత ఖర్చులు మిగులుబాటయ్యేవి. హాస్టల్ విద్యార్థులు బయటి పాఠశాలకు సరిగా వెళ్లడంలేదని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ వసతి గృహాలను ఆశ్రమ ఉన్నత పాఠశాలలుగా మార్చింది. దీంతో వార్డెన్లు మిగిలించుకునే పరిస్థితులు లేక ఆశ్రమ పాఠశాలల అభివృద్ధిని ప్రోత్సహించడంలో వివక్ష చూపుతున్నారు.

**మూసివేసే దిశగా..**

ప్రవేశాల కోసం వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేరని చెబుతుండడంతో వచ్చిన వారు వెనక్కి వెళ్తున్నారు. ప్రతి ఏటా ఒక తరగతి చొప్పున పెంచుకుంటూ పోవాల్సిన పాఠశాలలు వార్డెన్లు తప్పుదారి పట్టిస్తుండడంతో.. చేరిన విద్యార్థులు కూడా టీసీ తీసుకుని వెళ్లిపోతున్నారు. ఇలా ఈ బడులు మూసివేత దారిలో పయనిస్తున్నాయి. ఉదాహరణకు జనగామ జిల్లాలోని కొడకండ్లలోని హాస్టల్ నుంచి మారిన గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను విద్యార్థులు చేరక మూసివేశారు. మార్చిన వాటిలో పదో తరగతి లేకపోవడం గమనార్హం. ఏటూరునాగారం ఎస్టీ ఏహెచ్ఎస్‌లో ప్రస్తుతం 9వ తరగతి వరకే కొనసాగుతోంది. వసతి గృహంలో పదో తరగతి చదివే విద్యార్థులు పక్కనున్న జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నారు.

**ప్రతిపాదనలు పంపించాం– గిరిజన సంక్షేమ శాఖ డీడీ, పోచం**

రాష్ట్ర వ్యాప్తంగా మూడు ఐటీడీఏల పరిధిలో వసతి గృహాల నుంచి ఆశ్రమ ఉన్నత పాఠశాలలుగా మార్చిన బడులకు ప్రధానోపాధ్యాయుడు, స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. మూడు ఐటీడీఏలకు మొత్తం 1,295 ఉపాధ్యాయ పోస్టుల అవసరం ఉంది.

# డబుల్ ఓటుకు చెక్

ఆదిలాబాద్ : ఒక వ్యక్తి ఒకే ఓటు హక్కు ఉండాలనేది ఎన్నికల కమిషన్ నిబంధన. అయితే నివాసాలు మారడంతో చాలా మందికి రెండు, అంతకుమించి చోట్ల ఓటుహక్కు ఉంటోంది. కాగజ్‌నగర్ పట్టణంలో ఎస్పీఎం, సర్‌సిల్క్ మిల్లు కార్మికులు అధికంగా ఉన్నారు. ఇందులో పనిచేసే వారంతా కూడా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే. ఇందులో కొంత మందికి స్వగ్రామంలో ఓటు హక్కు ఉంది. అలాగే ఇక్కడ కూడా ఓటు హక్కు ఉంది. వీటితో పాటు సిర్పూరు నియోజకవర్గంలోని సమీప ప్రాంతాల్లో కొంతమంది పిల్లల చదువు, ఉద్యోగరిత్యా పట్టణాల్లో నివాసం ఉంటున్నారు. సొంత గ్రామాల్లో ఓటు హక్కుతో పాటు నివాసం ఉంటున్నచోట సైతం వీరు ఓటు హక్కు వినియోగంచుకుంటున్నారు. దీంతో గ్రామ పంచాయతీ ఎన్నికలతో పాటు మున్సిపాల్టీ ఎన్నికల్లో సైతం ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఇలాంటి వాటిని నివారించడానికి




ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది.- సులభంగా గుర్తింపు ప్రక్రియకొత్తగా ప్రవేశపెట్టిన ఫొటో సిమిలర్ ఎంట్రీస్ సాఫ్ట్‌వేర్‌తో ఇటువంటి వాటికి చెక్ పెట్టే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రెండు చోట్ల ఒకే ముఖ కవలికలు ఉంటే కొత్తగా వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులు వీరిని గుర్తిస్తున్నారు. ఇలా రెండుచోట్ల ఓటుహక్కు ఉన్న వారందరినీ గ్రామాలు, వార్డుల వారీగా గుర్తించనున్నారు. ఇలా రెండేసి ఓటరు జాబితాలో ఉన్న వారిని ఒక చోట ఓటు హక్కు తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. . అలాగే ఇతరరాష్ట్రాల్లోకూడా ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎలాంటి అవకాశం లేకుండా అధికారులు పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు..ఓటరుకార్డు ఉన్న వారు ఫారం-6లో పూర్తి వివరాలు నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేస్తే వాటిని క్రోడీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. నమోదు చేసిన వెంటనే ఓటరు యొక్క ఫోన్‌కు మెస్సెజ్ వస్తుంది. జిల్లాలో ఇప్పటివరకు సిర్పూరు నియోజవకర్గం నుంచి 2,05,212 ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 20వేలకుపైగా ఆధార్ కార్డుతో అనుసంధానం చేశారు. అలాగే ఆసిఫాబాద్ నియోజవకర్గం నుంచి 2,03,637 మంది ఓటర్లు ఉండగా 27,647మంది ఓటర్ల ఆధార్ కార్డులను అనుసంధానం చేశారు. వీటితో పాటు డబుల్ ఓటరు కార్డులున్న వారికి ఇప్పటికే సమాచారం అందించి తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.పక్కాగా ఓటరు జాబితా..- ప్రమోద్, కాగజ్‌నగర్ తహసీల్దార్ఓటరు జాబితాను పక్కాగా రూపొందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఫొటో సిమిలర్ ఎంట్రీస్ సాఫ్ట్‌వేర్ ద్వారా డబుల్ ఓట్లు కలిగిన వారిని గుర్తించి జాబితాను రూపొందిస్తున్నాం. జాబితా సిద్ధం కాగానే జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చి వాటిని తొలగిస్తాం.

# ఎన్నాళ్లీ ఎదురుచూపులు!

ఆదిలాబాద్ : గత కొన్నేళ్ల క్రితం తెల్ల కాగితాలపై భూ క్రయవిక్రయాలను జరిపిన వాటికి చట్టబద్ధత లేక పోవడంతో తరచూ గ్రామాల్లో వివాదాలకు దారి తీసేది. ఇలాంటి పరిస్థితులకు అడ్డు కట్ట వేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్ల క్రితం రైతుల నుంచి సాదా బైనామా దరఖాస్తులను స్వీకరించింది. దీంతో అర్హులైన వారంతా మీ సేవ కేంద్రాల ద్వారా మండల తహసీల్దార్‌కు దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా 2,083 సాదాబైనామా దరఖాస్తులు వచ్చినట్లు అధి కారులు పేర్కొంటున్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు చట్టబద్ధత లేకపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న అభద్ర తా భావంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం క్రమబద్ధీక రించి భూమిపై హక్కు కల్పిస్తోందని ఎంతో మంది రైతులు ఆశపడ్డా.. హక్కులు మాత్రం దక్కడమే లేదు. ఎంతో హడావుడి, ఆర్భాటంగా సాదా బైనామా దరఖాస్తులను స్వీకరించిన అధికారులు.. ప్రభుత్వ ఆదేశాలు అందలేదంటూ దరఖాస్తులను పక్కన పడేయడంతో రైతుల్లో నిరాశే కని పిస్తోంది. సాదాబైనామాలపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో అయో మయం నెలకొంది. అసలు సాదాబైనామాలకు చట్టబద్ధత కలుగుతుం దా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తు చేసుకుని రెండేళ్లు గడిచినా.. ప్రభుత్వం స్పష్టతనివ్వక పోవడంతో రైతులు ఊగిసలా టలో పడ్డారు. ఇకనైనా ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించి అర్హులైన వారికి భూ పట్టాలు ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.దరఖాస్తులకు మోక్షం ఎప్పుడో?ప్రభుత్వ ఆదేశాలతో ఆశపడి కొందరు రైతులు సాదాబైనామాలకు దరఖాస్తు చేసుకున్నా.. మోక్షం కలుగడం లేదని వాపోతున్నారు. గత రెండేళ్లుగా ఎదురుచూపులు తప్పడం లేదంటున్నారు. సాదాబైనామాల దరఖాస్తులకు చట్టబద్ధత ఎప్పుడు వస్తుందో?నని ఆశగా ఎదురు చూస్తున్నారు. దరఖాస్తులను పరిశీలించి భూపట్టాలు ఇవ్వాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామాల్లో అధికార పార్టీ నేతలు పర్యటిస్తున్న సమయంలోనూ కొందరు రైతులు సాదాబైనామాలపై ప్రశ్నిస్తున్నా.. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో సమాధానం చెప్పలేకపోతున్నారు. ముందు నుంచి సాగు భూమి ఆధీనంలో ఉన్నా.. చేతుల్లో పట్టా పాస్‌బుక్ లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. కనీసం ఇప్పటి వరకైనా దరఖాస్తులను పరిశీలన చేయకుండానే పక్కన పె ట్టారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం గ్రామా ల్లో భూ వివాదాలు ఉండకూడదనే ఉద్దేశంతో ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినా.. భూ సమస్యలకు పరిష్కారం దక్కడం లేదు. ధరణితో తమ సమస్యలు తీరిపోతాయని ఆశపడ్డా.. నిరాశే మిగిలింది. రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడం తో అధికారులు కూడా దరఖాస్తులను పట్టించుకోవడమే లేదు. అధికారు లను ప్రశ్నిస్తే తమ చేతిలో ఏమీ లేదని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే దరఖాస్తులకు చట్టబద్ధత కల్పిస్తామని చెబుతూ చేతులెత్తేస్తున్నారు.సంక్షేమ పథకాలకు దూరమే..పట్టా పాస్‌బుక్ కలిగి ఉన్న రైతులందరికీ రైతుబంధు పథకం కింద పెట్టుబడి సహాయంతో పాటు ఆపద కాలంలో రైతుబీమా సొమ్మును ప్రభుత్వం అందిస్తోంది. కానీ కొంతమంది రైతులకు భూపట్టా పాస్‌బుక్‌లు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమ వుతున్నారు. అలాగే పలు బ్యాంకులు కూడా రైతులకు రుణా న్ని ఇచ్చేందుకు ముందుకు రావ డం లేదు. కొన్ని గ్రామాలలో నాలుగు, ఐదు దశాబ్దాల క్రితం క్రయవిక్రయాలు జరిపిన వారంతా.. ప్రస్తుతం మరణించడం తో వారి వారసులపేరిట భూమిని బదలాయింపు చేయడం పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం ఉన్న వారసులకు భూమిని కొనుగోలు చేసిన యజమానులకు తరచూ వివాదా లు జరుగుతూనే ఉన్నాయి. గతంలో తమ పెద్దలు భూమిని విక్రయించ లేదంటూ తిరుగుబాటు చేస్తూ భూ ఆక్రమణలకు ప్రయత్నాలు చేస్తున్నా రు. దీంతో భూమిని కొనుగోలు చేసిన యజమానుల చేతిలో ఎలాంటి ఆధారం లేక దిక్కులు చూడాల్సి వస్తోంది. కేవలం తెల్లకాగితాలపై క్రయ విక్రయాలు చేయడంతో భూమిని క్రమబద్ధీకరించినా.. భవిష్యత్తులో చట్ట పరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందంటున్నారు. అమ్మినవారి వారసులు న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తే ఇబ్బందులు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఇలాంటి చట్టపరమైన చిక్కులతోనే ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తుంది. సాదాబైనామా లపై ప్రభుత్వం ఇప్పటికే ఓ నిర్ణ యం తీసుకున్నా.. చట్టపర మైన చిక్కులతో ఈ వ్యవహారం ముందుకు అడుగు వేయలేక పోతోంది. దీంతో సాదా బైనామాలపై భారీ ఆశ లు పెట్టుకున్న జిల్లా రైతుల ఆశలు.. నిరాశలు అవుతున్నాయి. ఇప్ప టికీ దరఖాస్తులపై సందిగ్ధమే నెలకొంది.పట్టా లేక పథకాలు రావడం లేదు: వర్దన్ వామన్, రైతు, కుచ్లాపూర్, తలమడుగువారసత్వంగా వస్తున్న భూములను సాగు చేసుకుంటున్నాం. పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ముఖ్యంగా రైతుబంధు, రైతుబీమా పథకాలు. బ్యాంకు రుణం కూడా దక్కకపోవడంతో.. అప్పు చేసి పంటలను సాగు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వ ప్రకటనతో పట్టాలు వస్తాయని ఆశపడ్డాం. రెండేళ్లు గడుస్తున్నా.. అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదు. గతంలో ఆర్థికస్తోమత లేకనే భూ యజమానుల నుంచి పట్టా మార్పిడి చేసుకోలేదు. ఇప్పటికైనా సాదాబైనామా దరఖాస్తులకు చట్టబద్ధత కల్పిస్తే బాగుంటుంది. దీంతో చేసేదేమీ లేక ఎదురుచూడాల్సి వస్తోంది.ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే తదుపరి చర్యలు: రాథోడ్ రమేష్, ఆర్డీవో, ఆదిలాబాద్సాదాబైనామా దరఖాస్తులపై ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే చర్యలు తీసుకుంటాం. గత రెండేళ్ల క్రితం అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించాం. తదుపరి దేశాలు వచ్చిన తర్వాత పరిశీలన చేసి అర్హులైన రైతులకు పట్టా పాస్‌బుక్‌లు అందజేస్తాం. ప్రస్తుతం ఈ ప్రక్రియ జిల్లా స్థాయిలోనే ఉంది. దరఖాస్తు చేసుకున్న రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం ఏదైనా పరిష్కారం చూపే అవకాశం కనిపిస్తోంది.

# సాధారణ ప్రసవాలు పెరిగేనా..?

జగిత్యాల : ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం అయిన మహిళలకు కేసీఆర్ కిట్, అమ్మ ఒడి పథకాలను అమలు చేస్తోంది. దీంతో సర్కారు ఆసుపత్రుల్లో ప్రసవా ల సంఖ్య పెరిగినప్పటికీ సాధారణ ప్రసవాలు తక్కువగా అవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం సిబ్బందికి, వైద్యులకు ప్రోత్సాహకాలు అందించడానికి నిర్ణయించింది. టీమ్ బేస్డ్ ఇన్సెంటివ్ పేరిట వైద్య ఆరోగ్య శాఖ ప్రోత్సాహకాలు ప్రకటించింది.

జిల్లాలో ప్రసవాల పరిస్థితి...జిల్లాలో ప్రస్తుత సంవత్సరంలో ఏప్రిల్ ప్రారంభం నుంచి ఈనెల 7వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 5,467 ప్రసవాలు జరిగాయి. ఇందులో 1,560 సాధారణ ప్రసవాలు, 3,907 సిజేరియన్లు జరిగాయి. ప్ర భుత్వ ఆసుపత్రుల్లో 2,742 ప్రసవాలు నిర్వహించగా 932 సాధారణ ప్రస వాలు, 1,810 సిజేరియన్లు నిర్వహించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో 2,725 ప్రసవాలు నిర్వహించగా 628 సాధారణ ప్రసవాలు, 2,097 సిజేరియన్లు నిర్వహించారు. ఏప్రిల్‌లో 1,277 మొత్తం ప్రసవాలకు గానూ 326 సాధార ణం, 951 సిజేరియన్లు, మేలో 1,289 మొత్తం ప్రసవాలకు గానూ 412 సా ధారణం, 877 సిజేరియన్లు, జూన్‌లో 1,232 మొత్తం ప్రసవాలకు గానూ 366 సాధారణం, 866 సిజేరియన్లు, జూలైలో 1,349 మొత్తం ప్రసవాలకు గానూ 370 సాధారణం, 979 సిజేరియన్లు, ఆగస్టులో 7వ తేది వరకు 320 మొత్తం ప్రసవాలకు గాను 86 సాధారణం, 234 సిజేరియన్లు జరిగాయి. ప్రోత్సహకాలు ఇలా..ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ ఆసు పత్రులలో సుమారు 85 శాతం నార్మల్ డెలివరీలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. లక్ష్యానికి మించి నార్మల్ డెలివరీలు చేసిన తదుపరి ప్రతీ డెలివరీకి రూ. 3 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేయనున్నారు. ఇందులో డాక్టర్, స్టాఫ్ నర్సుకు ఒక్కొక్కరికి రూ. 1,000 చొప్పున, సంబందిత పారిశుద్ధ్య సిబ్బందికి రూ. 500, ఏఎన్ఎంకు రూ. 250, ఆశా కార్యకర్తలకు రూ. 250 చొప్పున అందజేస్తారు.ఎంపిక చేసిన ఆసుపత్రులివే...జిల్లాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 2020-21లో సాధారణ ప్రసవాలకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించిన ఆసుపత్రులను ప్రోత్సాహకాలకు ఎంపి క చేశారు. ఇందులో జగిత్యాల జనరల్ ఆసుపత్రికి సంబంధించిన మాతా శిశు కేంద్రం, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న మెట్‌పల్లి, కోరుట్ల సీహెచ్‌సీలు, వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న ఇబ్రహీంపట్నం, సారంగపూర్, మల్లాపూర్, కథలాపూర్, కొడిమ్యాల, మల్యాల, పెగడపల్లి పీహెచ్‌సీలు ఎంపికయ్యాయి. లక్ష్యాన్ని నిర్దేశించారిలా..జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రితో పాటు మాతా శిశు ఆరోగ్య సం రక్షణ కేంద్రానికి జగిత్యాలతో పాటు కరీంనగర్, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల కు చెందిన గర్భిణులు ప్రసవాలకు వస్తుంటారు. ఇక్కడ




నెలకు 300 వర కు నార్మల్ డెలివరీలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. మాతా శిశు కేం ద్రంలో నెలకు 300కు పైగా అయ్యే డెలివరీలకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందించనుంది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాలో జగిత్యాల జనరల్ ఆసుపత్రి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురిలలో ఆసుపత్రులు పనిచేస్తున్నాయి. ఇందులో ధర్మపురి, రాయికల్‌లలో ప్రత్యేక స్త్రీ వైద్య నిపుణులు లేకపోవడం వల్ల ప్రసవాలు నామమాత్రంగా జరుగు తున్నాయి. కోరుట్లలో ప్రస్తుతం నెలకు సుమారు 70 వరకు, మెట్‌పల్లిలో నెలకు సుమారు 150 వరకు డెలివరీలు అవుతున్నాయి. వైద్య విధాన పరి షత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆసుపత్రుల్లో నెలకు 50 నార్మల్ డెలివరీ లు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అంతకు మించి అయ్యే నార్మల్ డెలి వరీలకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహం వర్తిస్తుంది. అయితే మెట్ పల్లి, కోరుట్లలో సైతం అవుతున్న డెలివరీలలో నార్మల్ డెలివరీలు తక్కు వగా అవుతున్నాయి.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో...జిల్లాలోని 19 ఆరోగ్య కేంద్రాల్లో నార్మల్ డెలివరీలు చేస్తారు. సిజేరియ న్ చికిత్సలు చేసే అవకాశం లేదు. వీటిలో 24 గంటలు పనిచేసే 9 ప్రా థమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు, సిజేరియన్లు అవుతుంటా యి. సగటున నెలకు పది సాధారణ ప్రసవాలు చేయాలని గతంలో లక్ష్యా న్ని నిర్దేశించారు. మిగిలిన 10 పీహెచ్‌సీలు 12 గంటలు వైద్య సేవలను అందించేవి. వీటిలో నెలకు అయిదు నార్మల్ డెలివరీలు చేయాలన్న ల క్ష్యం ఉంది. 2020-21లో జిల్లాలోని పీహెచ్‌సీల్లో 253 మొత్తం ప్రసవాలు జరగగా 101 సాధారణ ప్రసవాలు, 152 సిజేరియన్లు నిర్వహించారు. 2022-23లో మే మాసాంతం వరకు 37 మొత్తం ప్రసవాలు జరగగా 30 సాధారణ ప్రసవాలు, 7 సిజేరియన్లు నిర్వహించారు.ప్రైవేటులో ఇష్టారాజ్యం...జిల్లా వ్యాప్తంగా సుమారు 150 వరకు ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. వీటిలో సాధారణ ప్రసవాల కంటే సిజేరియన్ ప్రసవాలే ఎక్కువగా చే స్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఒక్కో సిజేరియన్‌కు రూ. 40 వేల నుం చి రూ. లక్ష వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో ప్ర భుత్వం దిద్దుబాటు చర్యల్లో భాగంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో నిర్వహిస్తు న్న సిజేరియన్లపై ప్రత్యేక పర్యవేక్షణను నిర్వహించడానికి ఆదేశించింది. ప్రయివేటు ఆసుపత్రి నిర్వాహకులు సిజేరియన్ డెలివరీకి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. సాధారణ ప్రసవం కాకుండా శస్త్ర చికిత్స ప్రసవం నిర్వహించడానికి దారితీసిన పరి స్థితులను స్పష్టంగా అందజేయాలని సూచించింది. మంత్రి హరీశ్ సమీక్షించినా మారని పరిస్థితి..మూడు నెలల క్రితం జిల్లాలో పర్యటించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రస వా లు పెంచడానికి జగిత్యాలలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వైద్యులకు పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. రానున్న ఆరు నెలల్లో సాధారణ ప్రసవాల నిష్ప త్తిని పెంచాలని ఆదేశించారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపిం చడం లేదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. నార్మల్ డెలివరీలు పెంచడానికి ప్రయత్నిస్తున్నాం- పుప్పాల శ్రీధర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి,ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీలను పెంచడానికి ప్ర యత్నిస్తున్నాం. ఇందుకు అనుగుణంగా వైద్యులకు, సిబ్బందికి ఎప్పటికప్పు డు సలహాలు, సూచనలు ఇస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యానికి మించి నార్మల్ డెలివరీలు చేయడానికి ముందుకు వెళ్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అ దునాతన సౌకర్యాలు కల్పించాము. ప్రజలల్లో అవగాహన పెంచి ప్రభు త్వ ఆసుపత్రుల్లో డెలివరీలు అయ్యేలా ప్రోత్సహిస్తున్నాం.

# మెడికల్ కాలేజీ ప్రారంభానికి సన్నద్ధం

జగిత్యాల : ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. సకల సౌకర్యాలతో జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభానికి సన్నద్ధం అవుతోంది. జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్‌కు స మీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇదివరకే ఉన్న గిడ్డంగులను మెడికల్ కళాశాలగా మార్చి రెనోవేషన్ కోసం రూ. 8 కోట్ల నిధులను ప్రభుత్వం కే టాయించింది. దీంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొన్ని రోజులుగా కళాశాల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేశాడు. సెప్టెంబరు 10 న జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన దాదాపుగా ఖరారైంది. అదే రోజున మెడికల్ కళాశాలను సీఎం ప్రారంభించే అవకాశాలు ఉండడంతో అధికా రులు పనులు వేగవంతం చేసే విధంగా చర్యలు చేపడుతున్నారు. ఇటీ వల దేశ వ్యాప్తంగా నీట్ ఎంట్రెన్స్ పరీక్ష కూడా పూర్తి కాగా ఫలితాలు, కౌన్సెలింగ్ అనంతరం విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నారు. దీంతో ఈ ఏడాది నుంచే జగిత్యాలలో ఏర్పాటు కానున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతుల నిర్వాహణకు అనుమతు లు మంజూరు చేస్తూ ఇటీవల నేషనల్ మెడికల్ కమిషన్ ఉత్తర్వులు జా రీ చేసింది. దీంతో జగిత్యాలలో 150 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు వై ద్య కోర్సు చదివే అవకాశం లభించింది. 27 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిర్మాణం...జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఉన్న 27 ఎకరాల ప్రభుత్వ స్థలా న్ని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కేటాయించారు. పూర్తి మెడిక ల్ కళాశాల నిర్మాణానికి రూ. 400 కోట్లు అంచనా ఉండగా, తాత్కాలికం గా జగిత్యాలకు మొదటి విడతలో కళాశాల నిర్మాణానికి రూ. 8 కోట్లు కే టాయించారు. కొద్ది నెలల్లోనే జగిత్యాలలో తాత్కాలికంగా మెడికల్ కళాశా ల కోసం 250 మంది విద్యార్థులు చొప్పున రెండు లెక్చరర్ హాళ్లు, ఒక్కో ల్యాబ్‌లో 100 మంది చొప్పున పరీక్షలు చేసే విధంగా ఆరు ల్యాబ్‌లు, 400 మంది విద్యార్థులు ఒకేసారి కూర్చునే విధంగా విశాలమైన లైబ్రరీ, 500 మంది విద్యార్థుల కోసం పరీక్ష హాల్ ఇలా అన్ని సౌకర్యాలతో ఎన్ఎంసీ ని బంధనలకు అణుగుణంగా అన్ని హంగులతో నిర్మించారు. ఇదే సంవత్స రం ఫిబ్రవరి 8న ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను నేషనల్ మెడికల్ కమిషన్ బృందం సభ్యులు స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్య క్తం చేశారు. అనంతరం జూన్ 8న మరోసారి బృందం సభ్యులు వర్చువ ల్ విధానం ద్వారా పనులను పరిశీలించి పూర్తి నివేదికను నేషనల్ మెడి కల్ కమిషన్ రేటింగ్ బోర్డు సభ్యులకు సమర్పించారు. రాష్ట్రంలో నూతనంగా ఎనిమిది మెడికల్ కళాశాలలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా 2022-23 విద్యాసంవత్సరంలో మాత్రం జగిత్యాలలో ఏర్పాటు చేసిన ప్రభు త్వ మెడికల్ కళాశాల నిర్వాహణకు అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జగిత్యాల ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కళాశా ల ఒక వరంలా మారనుంది. మొదటి సంవత్సరంలో మూడు సబ్జెక్టుల్లో వైద్య విద్య ..... జగిత్యాలలో ఏర్పాటు కాబోతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2022 - 23 విద్యాసంవత్సరం ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో మూడు సబ్జెక్ట్ లలో విద్యనందించేలా అన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చే పట్టింది. మొదటి సంవత్సరం ఎంబీబీఎస్‌లో శరీర నిర్మాణ శాస్త్రం (అనా టమీ), జీవరసాయన శాస్త్రం(బైయోకెమిస్ట్రీ), ఫిజియాలజీ సబ్జెక్టుల్లో 150 మంది విద్యార్థులకు విద్యనందించేందుకు ప్రభుత్వం ఇదివరకే 96 మంది డాక్టర్లతో పాటు సిబ్బందిని నియమించింది. తరగతి గదుల నిర్వాహణ కో సం కావాల్సిన సామగ్రి ఇప్పటికే మెడికల్ కళాశాలకు చేరుకుంది.విద్యార్థుల కోసం ప్రత్యేక వసతి గృహాలు....జగిత్యాలలో ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాలలో విద్యనభ్యసించే ఎంబీబీఎస్ విద్యార్థిని, విద్యార్థుల కోసం గెస్ట్ లెక్చరర్ హాల్లతో పాటు ప్ర త్యేక వసతి గృహాలను నిర్మించారు. బాలుర కోసం నూతన కలెక్టరేట్ వె నుక భాగాన ప్రత్యేక భవనం, బాలికల కోసం నర్సింగ్ కళాశాల ఆవరణ లో నూతన హంగులతో వసతి గృహాలను నిర్మిస్తుండగా దాదాపు పనులు పూర్తి కావస్తున్నాయి.

# కొత్తవారికి ఆసరా ఏదీ?

ఆదిలాబాద్ : పండుటాకుల ఆసరా కోసం అందించే ఆసరా పింఛన్ల జాడ తెలియడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పింఛన్లను అట్టహాసంగా ప్రభుత్వం ప్రారంభించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా కొత్తగా 15,474 మందికి ఆసరా కార్డులను అందించి పింఛన్‌ను సైతం అందిస్తామని ప్రకటించింది. అయితే, ఇప్పటి వరకు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో 864 మందికి మాత్రమే ఆసరా కార్డులను అందించింది. ఇంకా మిగిలిన ఆసరా పింఛన్‌దారులకు కార్డులను అందజేయాల్సి ఉంది. ఈ కార్డులను వారం రోజుల అనంతరం ఇంటింటికి పంపిణీ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఈ కార్డులు లబ్ధిదారులకు ఎప్పుడు ఇస్తారో? ఎన్ని రోజులకు ఇస్తారో? అని లబ్ధిదారులు చెప్పుకుంటు న్నారు. ఆసరా పింఛన్లు అందితే ఒక భరోసా ఉంటుందని భావిస్తున్న పింఛన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిరాశకు లోను చేస్తోందని వాపోతున్నారు. ఆగస్టు 15 నుంచే కొత్త పింఛన్లు పంపిణీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించినా.. అవి ఇప్పట్లో పంపిణీ అయ్యే అవకాశం కనిపించడం లేదు. ప్రస్తుతం కార్డుల పంపిణీతోనే సరిపెడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 15,474 మంది కొత్త పింఛన్‌దారులు ఉండగా.. ప్రస్తుతం ఊరికి ముగ్గురు, నలుగురు చొప్పున జిల్లాలో 18 మండలాలకు గాను, మండలానికి 48 మంది చొప్పున 864 కార్డులను పంపిణీ చేసినట్లు సంబంధిత అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్త పింఛన్లు వస్తాయని ఆశించినప్పటికీ, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చేతుల మీదుగా ఆసరా కార్డులు అందుకునప్పటికీ.. మిగితా లబ్ధిదారులకు మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు.వచ్చే నెలలో అనుమానమే.. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు ముఖ్యంగా 57ఏళ్లు నిండిన ప్రతీ ఒక్క లబ్ధిదారుడికి ఆసరా పింఛన్లు అందిస్తామని ప్రకటించింది. ముఖ్యంగా సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన ఈ హామీతో 57 ఏళ్లతో పాటు 57ఏళ్లు పూర్తి చేసుకున్న వారు సైతం జిల్లావ్యాప్తంగా లక్షల్లో ఆసరా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే అధికారులకు గతేడాది రెండుసార్లు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుని వాటిని అధికారులకు అందజేశారు. యేడాది తర్వాత ఈ పింఛన్లకు మోక్షం లభించిందని భావించిన లబ్ధిదారులకు ఆసరా కార్డులు మాత్రమే అందాయి తప్ప, పింఛన్ మాత్రం ఎప్పుడొస్తుందో? తెలియని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధు లు లబ్ధిదారులకు కొత్త పింఛన్లు త్వరగానే అందిస్తుందని చెప్పినా.. అవి నేటికి తీరే అవకాశం కనిపించడం లేదు. అలాగే, ప్రభుత్వ వర్గాలు వచ్చే నెలలో కొత్త పింఛన్లు వస్తాయని చెప్పినా.. అది గగనంగా మారింది. ముఖ్యంగా ఈ కొత్త పింఛన్ల పంపిణీ వచ్చే నవంబరు వరకు గాని ప్రారంభమయ్యేలా కనిపించడం లేనట్లు తెలుస్తుంది. ఇలాంటి సందర్భంలో ఆసరా కార్డులు అందుకున్న లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పవని స్పష్టమవుతుంది.864 మందికే కొత్త కార్డులుప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఆసరా పింఛన్లను అందించేందుకు ఆసరా కార్డుల పంపిణీ ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15న ప్రారంభమైన ఈ పంపిణీలో భాగంగా.. జిల్లాలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరైన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఈ కార్డులను అట్టహాసంగా ప్రారంభించారు. కార్డుల పంపిణీ ప్రారంభమై వారం రోజులు కావొస్తున్నా.. ఇప్పటి వరకు 864 మందికి మాత్రమే ఆ కార్డులను అందజేశారు. ఇంకా జిల్లావ్యాప్తంగా 14వేల 610 మందికి కార్డులు అందజేయాల్సి ఉంది. అయితే ఈ కార్డుల పంపిణీ వారం రోజుల అనంతరం జిల్లావ్యాప్తంగా ఇంటింటికీ స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా అందించనున్నట్లు సమాచారం. అయితే కార్డుల పంపిణీ పూర్తయినా.. కొత్త పింఛన్ల కోసం మాత్రం మరో మూడు నెలల పాటు ఎదురు చూడక తప్పదన్నట్లు తెలుస్తుంది. ఆసరా కార్డులు అందుకున్న లబ్ధిదారులకు దీంతో మూడు నెలల పాటు నిరాశే ఎదురుకానుంది.రెండు నెలలుగా పెండింగ్ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్లు లబ్ధిదారులకు ఎంతగానో ఆసరా ఇస్తున్నాయి. కానీ ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పండుటాకుల పింఛన్లు రెండు నెలలుగా అందని పరిస్థితి నెలకొంది. జిల్లాలో వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, కల్లు గీత కార్మికులు వంటి మొత్తం పింఛన్లు 67వేల పైచిలుకు ఉన్నాయి. వీరందరికీ ప్రతీ నెలా ఆయా మండల, గ్రామ కేంద్రాల్లో పింఛన్లు అందిస్తున్నారు. కానీ ఇవి గత మే నెల వరకు మత్రమే అందాయని.. ఇంకా జూన్, జూలై పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుతం ఆగస్టు నెల కూడా పూర్తి కావొస్తున్నా.. ఆ పింఛన్లు మాత్రం రావడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమలాంటి లబ్ధిదారులను దృష్టిలో ఉంచు కుని ప్రతీనెలా 1వ తేదీ నుంచి 10వ తేదీలోపు పింఛ న్లు చెల్లిస్తే.. తమకు పూర్తి ఆసరా ఉంటుందని అంటు న్నారు. ప్రతీనెలా పింఛన్లు రాకపోవడంతో పండుటాకులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని అంటున్నారు.ప్రభుత్వ ఆదేశాలు రాగానే పింఛన్ల చెల్లింపులు: కిషన్, పీడీ, డీఆర్డీఏ, ఆదిలాబాద్జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నాం. ఈ పింఛన్లను ప్రతీనెలా వారివారి పరిధిలో చెల్లింపులు చేస్తున్నాం. ప్రస్తుతం కొత్తగా జిల్లాలో 15,474 పింఛన్‌దారులు ఉన్నారు. వీరిలో 864 మందికి ఆసరా కార్డులను పంపిణీ చేయడం జరిగింది. మిగిలిన కార్డులను సైతం వారం రోజుల్లోగా స్థానిక ప్రతినిధుల ద్వారా ఇంటింటికీ అందజేస్తాం. అయితే వీరందరకీ ప్రభుత్వ ఆదేశాలు ఫించన్ల చెల్లింపులు చేస్తాం.

# రుణ మాఫీ అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

ధర్మపురి : రైతులకు రుణాలు మాఫీ చేయడం ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని డీసీసీ అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన రైతులకు లక్ష రూపాయల రుణాలు వెంటనే మాఫీ చేయాలని కోరుతూ ధర్మపురి తహసీల్దార్ నలువాల వెం కటేష్‌కు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆయన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడు తూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గోదావరి వరదల వల్ల రైతులు తీ వ్రంగా నష్టపోయారని అన్నారు. రైతులకు కేవలం రూ 50 వేలు వరకు మాత్రమే రుణాలు మాఫీ చేయగా కొంత మంది పేర్లు జాబితాలో లేవని పేర్కొన్నారు. కొత్త రుణాలు కోసం బ్యాంకులకు వెళితే వడ్డీలు చెల్లిస్తే తిరిగి రుణాలు అందిస్తామని రైతులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నియోజకవర్గంలో సుమారు 3 వేల మంది రైతు లు కొత్త పంట రుణాలు కోసం బ్యాంకుల చుట్టు తిరుగుతున్నారని ఆయ న ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని లే నియెడల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నేత లు, కార్యకర్తలు కలిసి రైతుల పక్షాన భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు, ధర్నాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రె స్ ధర్మపురి మండల అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేము ల రాజేష్, జిల్లా కార్యదర్శి కస్తూరి శ్రీనివాస్, చిలుముల లక్ష్మణ్, ఆశెట్టి శ్రీనివాస్, మైనార్టీ అధ్యక్షులు ఎండీ రఫియొద్దీన్, మాజీ ఎంపీటీసీ సీపతి సత్యనారాయణ, గరిగె రమేష్, యువజన కాంగ్రెస్ మండల, పట్టణ శాఖ ల అధ్యక్షులు రాందేని మొగిలి, అప్పం తిరుపతి పాల్గొన్నారు.

# అక్రమ ఆస్తుల కేసులో జగన్ సంస్థలకు సుప్రీం నోటీసులు




న్యూఢిల్లీ: ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సుప్రీం కోర్టు షాకిచ్చింది. అక్రమ ఆస్తుల కేసులో జగన్ సంస్థలకు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. జగతి పబ్లికేషన్స్, భారతి సిమెంట్స్, వైకాపా పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డిలకు ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. అక్రమాస్తుల కేసులో తొలుత సీబీఐ కేసులు విచారించాలని, అప్పటి వరకు ఈడీ రిజిస్టర్ చేసిన కేసుల విచారణ ఆపాలని ట్రయల్ కోర్టును తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీబీఐ ఛార్జిషీట్లపై తీర్పు వెలువడిన తర్వాతే ఈడీ కేసుల విచారణ చేపట్టాలని పేర్కొంది. ఒకవేళ సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసుల విచారణ సమాంతరంగా జరిపితే.... సీబీఐ కేసులపై తీర్పు తర్వాతే... ఈడీ కేసులపై తీర్పు ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ఆదేశించింది. సీబీఐ నమోదు చేసిన కేసులు, ఈడీ నమోదు చేసిన కేసులు సమాంతరంగా విచారణ కొనసాగించవచ్చునని సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం కొట్టివేసింది. హైదరాబాద్ సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తుది ఆదేశాలపై 2021లో తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును ఈడీ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఈడీ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ సంజయ్ కరోలలతో కూడిన ధర్మాసనం సెప్టెంబర్ 5వ తేదీలోపు సమాధానం చెప్పాలని ప్రతివాదులుగా ఉన్న విజయసాయిరెడ్డి, భారతి సిమెంట్స్, జగతి పబ్లికేషన్స్‌లకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు పూర్తి స్థాయి విచారణ సుప్రీంకోర్టులో ద్విసభ్య ధర్మాసనం చేపట్టాలా.. లేక త్రిసభ్య ధర్మాసనం చేపట్టాలన్నది ఆరోజు నిర్ణయిస్తామని ధర్మాసనం పేర్కొంటూ.. సెప్టెంబర్ 5వ తేదీకి తదుపరి విచారణ వాయిదా వేసింది. వైఎస్ భారతి రెడ్డిపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై.... ఈ కేసులతో జత పరిచి ఉన్న పిటిషన్‌ను విడిగా విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సీఎం వైయస్ జగన్ భేటీ



**ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. కొద్దిసేపటి క్రితం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సీఎం వైయస్ జగన్ భేటీ అయ్యారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, బకాయిలపై సీఎం వైయస్ జగన్ చర్చించినట్లు తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టుకు రావాల్సిన నిధులపై కూడా హోం మంత్రి దృష్టికి తీసుకు వచ్చినట్లు సమాచారం. ఢిల్లీలో సీఎం వైయస్ జగన్‌కు ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి స్వాగతం పలికారు.**




## వివేకా హత్య కేసు.. పీఏ కృష్ణారెడ్డి పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

ఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తనను బాధితుడిగా పరిగణించాలంటూ ఆయన వ్యక్తిగత సహాయకుడు (పీఏ) కృష్ణారెడ్డి వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో దస్తగిరి అప్రూవర్‌గా మారడాన్ని సవాల్ చేసే అధికారం తనకు కూడా ఉన్నట్లు ఆదేశాలు ఇవ్వాలన్న ఆయన అభ్యర్థను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ కేసులో జోక్యానికి సిద్ధంగా లేమని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. వాద, ప్రతివాదుల అభిప్రాయాలు హైకోర్టు ముందే చెప్పుకోవాలని సూచించింది. దీనిపై తమ అభిప్రాయాలతో సంబంధం లేకుండా హైకోర్టు స్వతంత్రంగా తగిన నిర్ణయం తీసుకోవచ్చని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. రేపు దీనిపై లిఖితపూర్వకంగా ఆదేశాలు ఇస్తామని తెలిపింది.

# పోలవరం నిలిచిపోవడానికి ప్రధానకారకుడు ఎవరంటే..

అమరావతి: సీఎం జగన్ రెడ్డి మూరత్వం, అహంభావం పోలవరం నిర్మాణానికి శాపాలుగా మారాయని, పోలవరం నిలిచిపోవడానికి ప్రధానకారకుడు ముఖ్యమంత్రేనని టీడీపీ నేత, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ కేంద్రమంత్రి షెకావత్ వ్యాఖ్యలపై జగన్ రెడ్డి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పోలవరంలో జరుగుతున్న పనుల్ని రద్దు చేయవద్దని, కొత్త ఏజెన్సీలను పెట్టవద్దని పీపీఏ, కేంద్ర ప్రభుత్వం చెప్పినా జగన్ రెడ్డి మూరత్వంతో ముందుకెళ్లారని విమర్శించారు. కొత్త సంస్థలకు పనులు అప్పగిస్తే, జరిగే తప్పిదాలకు ఎవరు బాధ్యత వహిస్తారన్న కేంద్ర ప్రభుత్వ ప్రశ్నకు ముఖ్యమంత్రి నోరెత్తలేదన్నారు. కమీషన్లకు ఆశపడి, పోలవరం పవర్ ప్రాజెక్ట్ కొట్టేయాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే జగన్ రెడ్డి రివర్స్ టెండరింగ్ డ్రామాలు ఆడారని దేవినేని ఉమ ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వంలో పోలవరంలో జరిగిన ప్రతిపనికి కేంద్ర ప్రభుత్వం డబ్బులు చెల్లించిందని, జగన్ వచ్చాక ఎంతమేరపనులు జరిగితే ఎన్నికోట్లు ఇచ్చిందని ప్రశ్నించారు. పోలవరంలో కుంగింది గైడ్ బండ్ కాదని, జగన్ రెడ్డి పరువు ప్రతిష్టలు జారాయన్నారు. తండ్రి విగ్రహం పెట్టడానికి రూ. 350 కోట్లు కేటాయించిన జగన్ రెడ్డి, నిర్వాసితులకు నాలుగేళ్ల లో రూ. 3 కోట్లు కేటాయించలేదని విమర్శించారు. తన బతుకు, బండారం బయటపడుతుందనే జగన్ రెడ్డి పోలవరం చూడటానికి ఎవరినీ అనుమతించడంలేదన్నారు. నాలుగేళ్లలో పోలవరం సహా, రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన ప్రగతిని జగన్ రెడ్డి ప్రజలకు చెప్పగలరా? అని దేవినేని ఉమ




ప్రశ్నించారు. ప్రధాని, కేంద్ర మంత్రుల్ని కలిశాక, ఢిల్లీలో మీడియాతో మాట్లాడటానికి జగన్ రెడ్డికి ఎందుకంత భయమన్నారు. పోలవరం డీపీఆర్–2ని 49 నెలలుగా కేంద్రంతో ఆమోదింపచేయించుకోకుండా జగన్ రెడ్డి గడ్డిపీకుతున్నారా? అని నిలదీశారు. ఇసుక అమ్ముకోవడానికి ప్రాజెక్టులు, డ్యామ్‌లను గాలికివదిలేసిన దుర్మార్గుడిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. రూ. 1500 కోట్లు తన మనుషులైన ఇరిగేషన్ కాంట్రాక్టర్లకు దోచిపెట్టి, ఆ సొమ్ముని వచ్చేఎన్నికల్లో వినియోగించుకోవడానికి జగన్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారన్నారు. 4 ఏళ్లలో రాష్ట్రంలో ఒక్క లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పూర్తి చేసి, ఎకరాకు నీరివ్వని దద్దమ్మలు పోలవరాన్ని పూర్తిచేస్తారా? అంటూ ఎద్దేవా చేశారు.

బుల్లెట్లు దించుతానన్న అనిల్ కుమార్ పోలవరం ప్రాజెక్టుపై కేంద్రమంత్రి వ్యాఖ్యలకు ఏం సమాధానం చెబుతారన్నారు. పులిచింతల డ్యామ్‌కు గేటు బిగించలేని సంబరాల రాంబాబుకు పోలవరంపై మాట్లాడే అర్హతలేదని దేవినేని ఉమ్మ అన్నారు.

# ఆడవాళ్లను కించపరిస్తే కఠిన చర్యలు తప్పవు

విజయవాడ: మహిళలపై పిచ్చి పిచ్చి పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ హెచ్చరించారు. విజయవాడలో జరిగిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. "సోషల్ మీడియాలో మహిళలపై జరుగుతున్న దాడిలో సీఎం కుటుంబ సభ్యులు, మహిళా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అన్న తేడా లేకుండా పోతుంది. మహిళలు అడుగు పెట్టాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోషల్ మీడియాలో జరుగుతున్న దాడిపై వేలెత్తి చూపాల్సిన బాధ్యత ఉంది. మహిళల పట్ల ఇలాగే సోషల్ మీడియాలో వ్యవహరిస్తామని అంటే రోడ్డుపై తన్నులు తినే రోజులు వస్తాయి. మహిళలు కూడా సోషల్ మీడియాలో సంయమనం పాటించాలి. అవసరం అయితే చట్టాలు, శిక్షలు మార్చాలి. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న వారిని వదిలి పెట్టం. మహిళలను మళ్లీ ఇళ్లకు పరిమితం చేయాలని చూస్తున్నారు. రాజకీయ పార్టీలను సెమినార్‌కు ఆహ్వానించలేదు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా సెమినార్ నిర్వహిస్తున్నాం. అయినా ఎవరి గొంతు నొక్కటం లేదు. రాజకీయ




పార్టీల ప్రకటనలతో, విమర్శలతో సంబంధం లేకుండా మాట్లాడితే అందరికీ స్వాగతం పలుకుతాం. శుక్రవారం గౌరవ దినంగా పాటించాలని కోరుతున్నాం." అని వాసిరెడ్డి పద్మ తెలిపారు.





# అధికార పక్షం క్లారిటీగానే ఉంది.. కానీ విపక్షాల నుంచే క్లారిటీ మిస్ అవుతోంది

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజకీయం సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపిస్తోంది. విపక్షాల పొత్తులపై అంతులేని అయోమయం నెలకొంది. ఎవరు ఎవరితో ఉన్నారో అస్సలు తెలియడం లేదు. అసలు పొత్తులుంటాయోలేదో తెలియని గజిబిజి గందరగోళం. టీడీపీ, జనసేన, బీజేపీ స్ట్రాటజీ ఏంటో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు కార్యకర్తలు. అధికారపక్షం క్లారిటీగానే ఉంది, కానీ విపక్షాల నుంచే క్లారిటీ మిస్ అవుతోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలినివ్వమంటారు, కలిసి ముందుకెళ్తామంటారు..!! కానీ, ఎవరు ఎవరితో ఉన్నారో తెలియదు. కలిసే ఉన్నట్టు కనిపిస్తారు, అంతలోనే తీవ్ర ఆరోపణలు చేసుకుంటారు. తెలుగుదేశం, జనసేన, బీజేపి ఈ మూడు పార్టీలదీ అదే తీరు. అసలు ఈ పార్టీల స్ట్రాటజీ ఏంటో అంతు పట్టడం లేదు ఆంధ్రా ఓటర్లకి. కలిసి పోటీ చేస్తారా? లేక విడివిడిగా బరిలోకి దిగుతారా? మొత్తం గందరగోళమే!! వైనాట్ 175, ఇదీ వైసీపీ పెట్టుకున్న లక్ష్యం. ఇప్పుడిదే మాట టీడీపీ నుంచి కూడా వినిపిస్తోంది. వైసీపీ బాటలోనే వైనాట్ 175 అంటోంది తెలుగుదేశం. జనసేన అధినేత పవన్ కూడా ఇదే తరహా డైలాగ్స్ వినిపిస్తున్నారు. ఒక్క ఛాన్స్ ప్లీజ్ అంటూ ప్రజల్లోకి వెళ్తున్నారు. ఇక్కడే, ఏదో తేడా కొడుతోంది. మొన్నటి వరకూ పొత్తులతోనే ముందుకెళ్తామన్న పవన్, ఇప్పుడు సడన్‌గా అధికారం ఇవ్వండని అడగడం పొత్తులను ప్రశ్నార్థకం మార్చేశాయ్..! బీజేపీ, జనసేన మిత్రపక్షాలు, కానీ ఈ రెండు పార్టీల మధ్య ప్రస్తుతం అలాంటి పరిస్థితి అస్సలు కనిపించడంలేదు!. పోనీ, జనసేన–టీడీపీ కలిసి పోటీ చేస్తాయా? అంటే అదీ చెప్పలేని సిట్యుయేషన్!. అసలు టీడీపీ, జనసేన, బీజేపీ వ్యూహం ఏంటో అర్థంకాక బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారు జనం. ప్రజలకే కాదు పొలిటికల్ అనలిస్టులకు కూడా అంతుపట్టడం లేదు ఈ మూడు పార్టీల స్ట్రాటజీ ఏంటో. అంత అయోమయంగా ఉంది విపక్షాల వ్యూహం. పొత్తులుంటాయ్..! ఖచ్చితంగా కలిసే పోటీ చేస్తాం... వారాహి టూర్‌కి ముందు వరకూ పవన్ నోటి నుంచి పదేపదే వచ్చిన మాటలు. కానీ, వారాహి టూర్ మొదలయ్యాక సీన్ మొత్తం మారిపోయింది. వారాహి టూర్‌లో పొత్తులపై ఒక్కటంటే ఒక్క డైలాగ్ కూడా పవన్ నోట నుంచి రాలేదు. అదే టైమ్‌లో చంద్రబాబు నోట నుంచి వైనాట్ 175 డైలాగ్ రావడం పొత్తులను గందరగోళంలో పడేశాయ్. టీడీపీ – జనసేన మధ్య పరిస్థితి ఇలాగుంటే, ఇంకోవైపు తెలుగుదేశం – బీజేపీ మధ్య హాట్ అండ్ హీట్ డైలాగ్ వార్ నడుస్తోంది. చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి నడ్డా, అమిత్‌షాను కలిసొచ్చినా.. ఏపీలో మాత్రం టీడీపీని టార్గెట్ చేస్తూనే ఉన్నారు రాష్ట్ర బీజేపీ నేతలు. దాంతో, ఈ రెండు పార్టీలు దగ్గరైనట్టే అయ్యి దూరం దూరంగానే ఉంటున్నాయి. ఏపీలో ఇదీ విపక్షాల పరిస్థితి. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు మహా అయితే ఇంకా ఏడెనిమిది నెలల టైముంది. మరి, ఇప్పుడైనా ఈ మూడు పార్టీలూ తమ వ్యూహామేంటో క్లారిటీ ఇస్తాయోలేదో..! వేచి చూడాల్సిందే మరి.

# అవినాష్ రెడ్డి అరెస్టుపై లోక్ సభ సెక్రటేరియట్ కు సీబీఐ సమాచారం..!




కడప : ఏపీలో మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో గత నెలలో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా వివేకా కేసులో నిందితుల్ని ఒక్కొక్కరిగా అరెస్టులు చేస్తూ, విచారిస్తూ సీబీఐ కీలక సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నించింది. మధ్యలో నిందితుల్లో ఒకరైన వైఎస్ అవినాష్ రెడ్డిని కూడా అరెస్టు చేసేందుకు పలు ప్రయత్నాలు చేసిన సీబీఐ.. ఎట్టకేలకు తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా అరెస్టు చేసి బెయిల్ పై విడుదల చేసింది. అనంతరం సుప్రీంకోర్టు ఇచ్చిన తుది గడువు లోపు అవినాష్ రెడ్డిపై విచారణ పూర్తి చేసిన సీబీఐ.. అదనపు ఛార్జిషీట్ ను సీబీఐ కోర్టులో దాఖలు చేసింది. అయితే ఈ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు జూన్ 30తో ముగియడంతో తిరిగి కోర్టు ఇచ్చే ఉత్తర్వులు ఇప్పుడు కీలకంగా మారిపోయాయి. అదే సమయంలో గత నెలలో చోటు చేసుకున్న పరిణామాలపై సీబీఐ లోక్ సభకు తాజాగా ఓ రిపోర్ట్ పంపింది. ఇది తమకు అందినట్లు లోక్ సభ సచివాలయం నిర్ధారించింది. గత నెలలో వైఎస్ అవినాష్ రెడ్డిని అరెస్టు చేసేందుకు సీబీఐ చాలా ప్రయత్నాలు చేసింది. ఇందులో భాగంగా పలుమార్లు విచారణకు రప్పించి ఎప్పటికప్పుడు అరెస్టు చేస్తారనేలా హంగామా చేసింది. ఈ క్రమంలో వైఎస్ అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు ముందస్తు బెయిల్ అయితే ఇవ్వలేదు కానీ.. దాదాపు దానికి సమానమైన నిర్ణయం తీసుకుంది. అవినాష్ ను తప్పనిసరి పరిస్దితుల్లో అరెస్టు చేయాల్సి వస్తే 5 లక్షల పూచీకత్తుతో బెయిల్ ఇచ్చి విడుదల చేయాలని ఆదేశించింది.

# ఈసారి బాలయ్యపై పోటీ చేసేది ఈమే?



అనంతపురం : ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ కంచుకోటల్లో ఒకటి.. హిందూపురం. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం అంటే 1983 నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా టీడీపీ ఆ నియోజకవర్గంలో ఓడిపోలేదు. 1985 1989 1994ల్లో ఇక్కడి నుంచి టీడీపీ వ్యవస్థాపకుడు మాజీ సీఎం ఎన్టీఆర్ విజయం సాధించారు. ఇక ఎన్టీఆర్ మరణించాక జరిగిన ఉప ఎన్నికలో ఆయన కుమారుడు నందమూరి హరికృష్ణ గెలుపొందారు. 1999లో టీడీపీ అభ్యర్థి సీసీ రాముడు కాంగ్రెస్ పార్టీ గాలి వీచిన 2004 2009ల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన రంగనాయకులు అబ్దుల్ ఘని విజయం సాధించారు. ఇక 2014 2019ల్లో ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ గెలుపొందారు. ఈ నేపథ్యంలో తమకు కొరకరాని కొయ్యగా ఉన్న హిందూపురం నుంచి ఈసారి వైసీపీ కొత్త అభ్యర్థిని బరిలోకి దించుతోంది. 2019లో మహ్మద్ ఇక్బాల్ 2014లో న వీన్ నిశ్చల్ వైసీపీ అభ్యర్థులుగా పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం మహ్మద్ ఇక్బాల్ ఎమ్మెల్సీగా నవీన్ నిశ్చల్ ఏపీ ఆగ్రోస్ చైర్మన్ గా ఉన్నారు. ఇప్పటివరకు మహ్మద్ ఇక్బాల్ వైసీపీ నియోజకవర్గ ఇంచార్జిగా కొనసాగుతున్నారు. ఇప్పుడు ఆయనను తప్పించి దీపికను వైసీపీ ఇంచార్జిగా నియమించారని సమాచారం. ఇటీవల సీఎం జగన్ నిర్వహించిన ఎమ్మెల్యేలు నియోజకవర్గాల ఇంచార్జిల సమావేశానికి దీపిక హాజరు కావడం ముందు వరుసలో కూర్చోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఎవరీ కొత్తావిడ అంటూ అంతా ఆరాలు తీయడం మొదలుపెట్టారు. హిందూపురం నియోజకవర్గంలో దీపిక వైసీపీ సీనియర్ నాయకురాలిగా ఉన్నారు. అంతేకాకుండా పెద్దాయనగా పేరున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులు ఆమెకు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి వచ్చే ఎన్నికల్లోనూ వైసీపీ తరఫున ఇక్బాల్ పోటీ చేయాలనుకున్నారు. ఈ నాలుగేళ్లు వైసీపీ ఇంచార్జిగా ఆయనే చక్రం తిప్పారు. అయితే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో దీపిక నియోజకవర్గ ఇంచార్జి బాధ్యతలను దక్కించుకున్నారు. ఇక్బాల్ పై వైసీపీలోనే వ్యతిరేక వర్గాలు ఉన్నాయని టాక్.

ఆగ్రోస్ చైర్మన్ గా ఉన్న నవీన్ నిశ్చల్ తోపాటు గతేడాది దారుణ హత్యకు గురయిన చౌళూరు రామకృష్ణారెడ్డి సోదరి మధుమతి వర్గీయులు ఇక్బాల్ కు వ్యతిరేకంగా ఉన్నారని అంటున్నారు. హిందూపురం నియోజకవర్గంలో వైసీపీ కీలక నేతగా ఉన్న చౌళూరు రామకృష్ణారెడ్డిని ఇక్బాల్ చంపించారని ఆయన కుటుంబ సభ్యులు బహిరంగంగా విమర్శలు కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఇక్బాల్ ను నియోజకవర్గ ఇంచార్జిగా తప్పించి దీపికకు బాధ్యతలు ఇచ్చారని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల నియోజకవర్గాల ఇంచార్జులతో జగన్ జరిపిన సమీక్షకు ఆమె హాజరయ్యారని చెబుతున్నారు. మరి టీడీపీ కంచుకోటలో.. అది కూడా బాలయ్యపైన దీపిక గెలవగలరా?

# అందుకే సోమును తప్పించి పురంధేశ్వరికి ఇచ్చారేమో...

విజయవాడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి మార్పుపై సీపీఐ నేత రామకృష్ణ స్పందించారు. సోము వీర్రాజుపై అనేక ఆరోపణలు వచ్చాయని.. వైసీపీకి అనుకూలంగా పని చేశారనే భావన ఉందని తెలిపారు. అందుకే ఆయన్ని తప్పించి పురంధరేశ్వరికి ఇచ్చారని అనుకుంటున్నానని అన్నారు. సత్యకుమార్, రమేష్ పేర్లు వినిపించినా వారికి ఇవ్వలేకే ఆమెకు ఇచ్చారన్నారు. పురంధరేశ్వరికి ఇచ్చినా ఏపీలో బీజేపీ బలం పెరగదని స్పష్టం చేశారు. సీఎం జగన్మోహన్ రెడ్డికి బీజేపీ పెద్దల అండ పుష్కలంగా ఉందన్నారు. ఆయన అడిగినప్పుడు నిధులు ఇస్తారని.. కేసుల్లో బెయిల్ ఇస్తారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డికి కేంద్ర పెద్దల సహకారం లేదని ఎవరైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. పొత్తుల విషయంలో ఎవరి అంచనాలు వారివన్నారు. పురంధరేశ్వరి రామారావు కుమార్తె అయినా బీజేపీతో ఎన్టీఆర్‌కు ఏం



సంబంధం అని నిలదీశారు. బీజేపీతో చంద్రబాబు పొత్తు పెట్టుకుంటాడని తాను అనుకోవడం లేదని రామకృష్ణ పేర్కొన్నారు

## జాన్వీ జాతర ఆగేట్టు లేదు బాబోయ్

నటవారసురాలి జాతర ఆగేట్టు లేదు బాబోయ్ .. ! ఇటీవలి కాలంలో నెట్టింట విరుచుకుపడుతున్న జాన్వీ కపూర్ ని చూడగానే అభిమానుల ఫీలింగ్ ఇదీ. రోజు అయినా గ్యాప్ లేకుండా గంట గంటకో ఫోటోషూట్ తో విరుచుకుపడుతోంది ఈ బ్యూటీ ఇప్పటికే జాన్వీ ఫోటోషూట్లు కుప్పలుతిప్పలుగా వెబ్ ని ముంచెత్తాయి. ఇందులో వేడెక్కించే పరువాల విందుకు కొదవేమీ లేదు. ఇప్పుడు ఇదే కేటగిరీలో మరో ఫోటోషూట్ తో చెలరేగింది జాన్వీ. తాజా ఫోటోషూట్ ఎంతో కళాత్మకంగా భన్సాలీని సైతం ఆకర్షించేదిగా కనిపిస్తోంది. ఇక ఇటీవలే ఆలియా భట్ గంగూభాయి కథియావాడీగా మెప్పించింది. తదుపరి జాన్వీలాంటి బ్యూటీకి కూడా భన్సాలీ నుంచి ఆఫర్ ఉందన్న టాక్ ఉంది. అందుకే ఇలా కాస్త కళాత్మకమైన ఫోజులతో కనిపించిందేమో అన్న డౌట్లు పుట్టించేస్తోంది. హద్దులు చెరిపేసిన స్పైసీ ఊంప్ ఫ్యాక్టర్ లుక్ లో కనిపిస్తున్నా కానీ అందులోనూ కళాత్మకతను ప్రదర్శించింది జాన్వీ. ఇటీవల అన్నీ స్పోర్ట్స్ బయోపిక్ లలో నటిస్తోంది. అందుకు



భిన్నమైన ఇమేజ్ తనకు కావాలని అనుకుంటోంది. తనకు వేశ్య తరహా పాత్రలు ఇచ్చినా బోల్డ్ గా డీగ్లామర్ గా లేదా అందాల ఆరబోతతో విరుచుకుపడేలా ఏవైనా కొత్త కొత్త పాత్రలు కావాలనుకుంటోంది. అందుకే జాన్వీలో వైవిధ్యాన్ని ఇలా తెరపరిచేస్తోంది అంటూ అభిమానులు భావిస్తున్నారు. పైనుంచి మామ్ శ్రీదేవి అన్నిటినీ చూస్తోంది. స్టార్ కిడ్ ఆశీస్సులు అందుకుంటూ తన పనిలో తాను ఉంది మరి. కెరీర్ మ్యాటర్ కి వస్తే..జాన్వీ కపూర్ నటిస్తున్న తాజా చిత్రం మిస్టర్ & మిసెస్ మహి సంచలనాలు ఖాయమని అర్థమవుతోంది. ఈ మూవీలో జాన్వీ క్రికెటర్ గా నటిస్తోంది. ఇందు కోసం దినేష్ కార్తీక్ సారథ్యంలో క్రికెట్ క్యాంప్ లో శిక్షణ పొందుతోంది. ఈ చిత్రం క్రికెట్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోంది. మూవీ గురించి తెలుసుకోవాలని అభిమానులు ఆసక్తిగా ఉన్నారు. ఈ చిత్రంలో జాన్వీ రూహి సహనటుడు రాజ్ కుమార్ రావ్ కూడా నటిస్తున్నారు. ఇంతకుముందు రిపబ్లిక్ డే 2022 (జనవరి 26) నాడు జాన్వీ తన ఇన్ స్టాలో క్రికెటర్గా నటించే అవకాశం రావడంపై ఆనందం వ్యక్తం చేసింది. ఆ లుక్ లో క్రికెట్ హెల్మెట్ ను ధరించి జాన్వీ కనిపించారు. వెటరన్ ఇండియన్ వికెట్ కీపర్-బ్యాట్స్ మన్ దినేష్ కార్తీక్ నెట్స్ లో ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యాన్ని కూడా ఆమె షేర్ చేయగా వైరల్ అయ్యింది. మిస్టర్ అండ్ మిసెస్ మహిలో జాన్వీ - రాజ్కుమార్ వరుసగా మహేంద్ర అలాగే మహిమ అనే పాత్రలను పోషించనున్నారు. శరణ్ శర్మతో జాన్వీకి ఇది రెండో ప్రాజెక్ట్. జాన్వీ కపూర్ టైటిల్ రోల్ లో నటించిన 2020 చిత్రం 'గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్' శరణ్ కి దర్శకుడిగా రెండో సినిమా. భారతదేశంలో క్రికెట్ కు విపరీతమైన ఆదరణ ఉన్నందున ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలా ఆడుతుంది అన్నది ఆసక్తిని పెంచుతోంది.

## పసుపు వర్ణంలో శివానీ సూపర్ హాట్!

జీవితారాజశేఖర్ కుమార్తెగా టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన శివానీ సుపరిచియతమే. అద్భుతం సినిమాతో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అటుపై డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ శేఖర్ లాంటి చిత్రాల్లో నటించింది. అలాగే కోలీవుడ్ లోనూ అన్ బరైవూ అనే సినిమాతో లాంచ్ అయింది. ఇలా ఒకేసారి తెలుగు..తమిళ సినిమాల్లో నటించింది. అయితే ఆవేవి శివానీకి పెద్ద సక్సెస్ ని అందించలేదు. దీంతో వెబ్ సిరీస్ ల్లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆహా నా పెళ్లంట అనే సిరీస్ లో నటించింది. అది గతేడాదే రిలీజ్ అయింది. మరి శివానీ తాజా అప్ డేట్ ఏంటి? అంటే విద్య వసూల అహం అనే సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా మినహా అమ్మడి చేతిలో కొత్త ప్రాజెక్ట్ లేవి లేవు. అయితే బ్యూటీ కెరీర్ ప్రారంభమైన రెండున్నరేళ్లే అవుతుంది. మరి ఈ సమయంలో



ప్రయత్నాలు ఎలా చేసింది? అన్నది తెలియదుగానీ పరిశ్రమలో ఈ వేగం సరిపోదు. పోటీ వాతావరణంలో దూసుకుపోవాలంటే? మరింత శ్రమించక తప్పదు. ఇక సోషల్ మీడియాలో శివానీ యాక్టివ్ గానే ఉంటుంది. మరీ రెగ్యులర్ గా కకపోయినా అప్పుడప్పుడు కొత్త ఫోటోలతో దర్శనమిస్తుంది. డిజైనర్ దుస్తుల్లో మెప్పిస్తుంది. తాజాగా శివానీ కొత్త ఫోటో ఒకటి ఇన్ స్టాలో వైరల్ గా మారింది. ఇటీవలే ఆమె పుట్టిన రోజు సందర్భంగా అభిమానుల్ని ఇలా కొత్త దుస్తుల్లో పలకరించింది. ఇందులో బ్యూటీ కాస్త స్కిన్ షో చేసినట్లు కనిపిస్తోంది. బ్యాక్ లెస్ ఫోజులో దర్శనమించింది. పసుపు రంగు స్లీవ్లెస్ టాప్ మరియు లెహంగా ధరించి కనిపించింది. క్యూట్ లుక్ తో ఆకట్టుకుంది. తనలోని నేచురల్ బ్యూటీని చూపించే ప్రక్రియలో భాగంగా లైట్ మ్యాకప్ లో కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. శివానీ అందానికి యువత ఫిదా అవుతున్నారు. ఆ బ్యూటీని తమదైన శైలిలో పొగిడేస్తున్నారు.




## జాన్వీ కపూర్.. స్టన్నింగ్ గ్లామర్ ట్రీట్





బాలీవుడ్ లో హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న అందాల భామ జాన్వీ కపూర్. ఒకప్పటి స్టార్ హీరోయిన్ శ్రీదేవి కూతురుగా ఆమె బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. అయితే ఇప్పటి వరకు ఆమె కెరియర్ లో అరడజను సినిమాల వరకు హిందీలో చేసింది. అయితే అందులో మొదటి చిత్రం ధడక్ తప్ప ఏ ఒక్కటి కమర్షియల్ సక్సెస్ కాలేదు. నటిగా మంచి మార్కులు వేసుకున్న స్టార్ హీరోలతో జతకట్టే ఛాన్స్ లు మాత్రం హిందీ చిత్రపరిశ్రమలో రాలేదు. అయితే శ్రీదేవికి ఎలా అయితే తెలుగు చిత్రపరిశ్రమ స్టార్ ఇమేజ్ అందించిందో అలాగే జాన్వీకి కూడా ఊహించని స్థాయిలో పాన్ ఇండియా మూవీతో తెరంగేట్రం చేసే ఛాన్స్ వచ్చింది. అది కూడా గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్ కి జోడీగా దేవర చిత్రంలో ఆమె మొదటి తెలుగు అవకాశం దక్కించుకుంది. ఇప్పుడు అక్కినేని యువ హీరో అఖిల్ కి జోడీగా ధీర అనే మూవీ కోసం జాన్వీ కపూర్ ని ఎంపిక చేయాలని అనుకుంటున్నారంట. అయితే ఇంకా అఫీషియల్ గా కన్ఫర్మ్ కాలేదు. జాన్వీ కపూర్ కి సినిమాల ద్వారా వచ్చే ఫేమ్ కంటే ఇన్ స్టాగ్రామ్ లో గ్లామర్ షోతో లభించిన పాపులారిటీ ఎక్కువ అని చెప్పాలి. ఇన్ స్టాగ్రామ్ లో జాన్వీ కపూర్ చేసే అందాల ప్రదర్శనని మిలియన్స్ లో ఫాలోవర్స్ ఉన్నారు. ఇక సోషల్ మీడియా ద్వారా కాస్ట్యూమ్స్ ని ప్రమోట్ చేస్తూ జాన్వీ కపూర్ ఆదాయం కూడా భాగానే ఆర్జిస్తోంది. అందుకే రెగ్యులర్ గా హాట్ హాట్ కాస్ట్యూమ్స్ తో గ్లామర్ షో చేస్తూ ఫ్యాన్స్ కి అందాల విందు అందిస్తూ ఉంటుంది.

ఈ ఫోటోలకి కూడా లక్షల్లో లైక్స్ వస్తాయి. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ కి మించిపోయే విధంగా జాన్వీ కపూర్ హాట్ షో ఉంటుందని చెప్పొచ్చు. తాజాగా మరోసారి గోల్డ్ కలర్ ట్రెడిషనల్ డ్రెస్ తో అదిరిపోయే రేంజ్ లో అందాల ప్రదర్శన చేస్తూ జాన్వీ కపూర్ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది.. మనీష్ మల్హోత్రా డిజైన్ చేసిన ఈ డ్రెస్సింగ్ లో జాన్వీ కపూర్ దివి నుంచి దిగి వచ్చిన అప్సరసలా ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఏకంగా 11 లక్షల మందికి పైగా జాన్వీ కపూర్ హాట్ ఫోటోలని లైక్ చేయడం విశేషం.

## చెరువుకే వన్నె తెచ్చిన అనసూయ అందాలు



అందమైన..అద్భుతమైన లోకేషన్ ఏదైనా కెమెరా క్లిక్ మనిపించాల్సిందే. ఆలోకేషన్ ని కవర్ చేస్తూ ఓ సెల్ఫీ దిగాల్సిందే. తాజాగా అనసూయ అదే పనిచేసింది. ఇది ఏ చెరువు గట్టునో తెలియదు గాని ఉదయాన్ని సూర్యుడు ఉదయిస్తోన్న సమయంలో అనసూయ సూర్య కిరణాలు ఆ చెరువులో పడుతుండగా..ఆ చెరువు ఒడ్డున నిలబడి ఇలా ఫోటో దిగింది. ఈ ఫోటోలో అనసూయ అందాలు సమ్ థింగ్ స్పెషల్ గా హైలైట్ అవుతున్నాయి. గ్రీన్ కలర్ పొట్టి నిక్కర్ లోథై అందాల్ని ఎలివేట్ చేయగా..గాలికి చొక్కా బటన్లను విప్పేసి లో దుస్తుల్లో ఇలా కెమెరాకి ఫోజులిచ్చింది. నెత్తిపైన బిస్కెట్ కలర్ క్యాప్..కళ్లకి కూలింగ్ గ్లాసెస్ ధరించింది యువతని ఆకట్టుకునే రేంజ్ లో ఎలివేట్ చేసింది. అయితే లొకేషన్ స్పాట్ మాత్రం రివీల్ చేయలేదు. సహజంగా ఇలాంటి లోకేషన్లు హైదరాబాద్ లోనే చాలా ఉన్నాయి. పెద్ద పెద్ద బండరాళ్లతో కూడిన చెరువులు సిటీలో చాలానే నెలకొన్నాయి. మిషన్ కాకతీయ ప్రాజెక్ట్ లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చెరువుల పునరుద్దరణ కార్యక్రమం చేపట్టి ఎండిపోతున్న చెరువుల్లోకి నీళ్లను మళ్లిస్తోన్న సంగతి తెలిసిందే. ప్రతీ వేసవిలోనూ ఇంకి పోతున్న చెరువుల్ని ప్రభుత్వం నీళ్లతో నింపుతుంది. మరి ఈ చెరువులో నీళ్లు ఇంకా ఇంకాయో లేదో తెలియదుగానీ..ఆ చెరువు గట్టున నిలబడి అనసూయ ఫోజులిస్తుంటే ఆ చెరువుకే వన్నే వచ్చింది. ఇంకి పోతున్న చెరువులు సైతం అనసూయ అందాలకి నిండిపోవాల్సిందే. అనసూయ కెరీర్ ఫుల్ స్వింగ్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఒక్కో సినిమాకి లక్షల్లో పారితోషికాలు అందుకుంటున్న అనసూయ వరుస చిత్రాలతో క్షణం తీరిక లేనంత బిజీగా ఉంది. ఇటీవలే పుష్ప చిత్రంతో పాన్ ఇండియా సక్సెస్ ని ఖాతాలో వేసుకుంది. దాక్షయణి పాత్రలో ఛమక్కులా మెరిసి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. రంగస్థలం లో రంగమ్మత్త పాత్ర తర్వాత క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ మరోసారి దాక్షాయణిగా గుర్తిండిపోయే మంచి పాత్రను ఇచ్చారు. మొదటి భాగంలో పవర్ ఫుల్ పాత్రతో ఎంట్రీ ఇచ్చిన దాక్షాయణికి రెండో భాగంలో మరింత ప్రాధాన్యత ఉంటుందట. ఆ పాత్రకు పుష్ప -ది రూల్ లో కొనసాగింపు ఆసక్తిని రేకెత్తిస్తుందట. నటిగా అనసూయ స్థాయిని పెంచే చిత్రంగా పుష్ప 2 నిలుస్తుందని టాక్ వినిపిస్తోంది. ఇటీవల రిలీజ్ అయిన ఖిలాడీలోనూ నటించింది. కానీ ఆ సినిమా అంచనాల్ని అందుకోవడంలో విఫలమైంది. దీంతో అనసూయ ఎఫెర్ట్ వృద్ధా అయింది. ప్రస్తుతం నటిస్తోన్న రంగమార్తాండ తనకు పేరు తెస్తుందని అనసూయ బావిస్తోంది. ఇవేగాక.. ఇంకొన్ని చిన్న చిత్రాల్లోనూ అనసూయకి అవకాశాలు వస్తున్నాయి. అయితే వాటి విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. మంచి బ్యానర్...సరైన స్క్రిప్ట్ ప్యాడింగ్ ఉంటేనే సంతకాలు చేస్తోంది. పారితోషికం కోసం కమిట్ అవ్వడం లేదు. ఇక బుల్లి తెర హోస్ట్ గా ఎప్పటిలాగే బిజీగానే కొనసాగుతోంది. కొత్త కొత్త గేమ్ షోలతో ప్రేక్షకుల్ని అలరిస్తోంది. బుల్లి తెరపై మాత్రం తన మార్క్ ఎక్కడా చెరగలేదు. అదే చరిష్మాతో దూసుకుపోతోంది.

## కిల్లింగ్ బికినీ షోతో మళ్లీ అగ్గి రాజేసిందిగా

లోఫర్ ఫేం దిశా పటానీ ఇటీవల సీకే బ్యూటీగా పాపులారిటీ పెంచుకున్న సంగతి తెలిసిందే. వరుసగా ఇన్నర్ దుస్తుల్ని ధరించి అందాల్ని ఆరబోయడంలో దిశా తర్వాతే ఎవరైనా అని ప్రూవ్ అయ్యింది. కెల్విన్ క్లైయిన్ బ్రాండ్ వ్యాల్యూ పెంచడంలో దిశా కృషిని అంత తేలిగ్గా మర్చిపోలేరు. ఇక దిశా బికినీ బీచ్ సెలబ్రేషన్స్ గురించి ప్రత్యేకించి గుర్తు చేయాల్సిన అవసరం లేదు. బీచ్ లో వాలిపోతే ఇక ఆ ట్రీట్ మరో లెవల్లో ఉంటుంది. ఇంతకుముందు మాల్దీవుల విహారయాత్ర నుంచి వరుస బికినీలను షేర్ చేసిన ఈ బ్యూటీ నెట్ లో మంటలు పెట్టింది. తాజాగా మరోసారి బికినీ లుక్ లో కనిపించి అగ్గి రాజేసింది అమ్మడు. దిశా నెవ్వర్ బిఫోర్ అనేంత హాట్ లుక్స్ తో



కనిపిస్తోంది ఈ సరికొత్త బికినీలో. అసలు బికినీ వేయలంటే దిశా తర్వాతే అని పొగిడేయకుండా ఉండలేకపోతున్నారు యూత్. ఇక బికినీలో దిశా కిల్లర్ ఎక్స్ ప్రెషన్ లు మతులు చెడగొడుతున్నాయి. ఇన్ స్టాగ్రామ్ లో 49 మిలియన్లకు పైగా అనుచరులతో దిశా సోషల్ మీడియాలో అత్యధికంగా అనుసరించే భారతీయ నటీమణిగా వెలిగిపోతోంది. దిశా అద్భుతమైన ప్రదర్శనతో ఈ రేంజును సాధించింది. ఒక్కో ట్వీట్ కి లక్షల్లో ప్యాకేజీ అందుకుంటోంది అంటే అర్థం చేసుకోవాలి. ఆమె ఎందుకు అంత పెద్ద ఫాలోయింగ్ ను అందుకుందో ఈజీగానే అర్థమవుతోంది. ఇక దిశా ప్రస్తుతం ప్రియుడు టైగర్ ష్రాఫ్ తో తదుపరి చిత్రంలో కనిపించనుంది. దిశా పటానీ ప్రస్తుతం పలు ప్రాజెక్ట్స్ పై వర్క్ చేస్తోంది. మోహిత్ సూరి ఏక్ విలన్ 2 తదుపరి విడుదల కావాల్సి ఉంది. ఈ యాక్షన్ చిత్రంలో తారా సుతారియా- అర్జున్ కపూర్ మరియు జాన్ అబ్రహం నటించారు. ఏక్తా కపూర్ చిత్రం కే-టీనా కూడా చిత్రీకరణలో ఉంది.

## క్లాసీ అందాలతో కవ్విస్తున్న అందాల శ్రీయ

ఆర్.ఆర్.ఆర్ లాంటి పాన్ ఇండియా సినిమాతో ఘనమైన రీఎంట్రీని కోరుకుంది శ్రీయ శరణ్. కానీ ఆ సినిమాలో తన పాత్ర చాలా పరిమితమైనది. ఆ తర్వాత వరసగా మూడు నాలుగు సినిమాలు చేసినా ఇవేవీ విడుదలకు రాకపోవడం నిరాశపరుస్తోంది. ఇంతలోనే ఈ మ్యారీడ్ బ్యూటీ తన హబ్బీతో నిరంతర వెకేషన్లను ఆస్వాధిస్తూ..వరుస ఫోటోషూట్లతో అంతర్జాలంలో సంచలనంగా మారుతోంది. ఇన్ స్టా మాధ్యమంలో శ్రీయ నిరంతర ఫోటోషూట్లు ఇటీవల హాట్ టాపిక్. తాజాగా శ్రీయ చిట్టి పొట్టి పరికిణీలో అందాలు ఆరబోసిన ఫోటోలు అంతర్జాలాన్ని షేక్ చేస్తున్నాయి. శ్రీయ బిగి సడలని అందాలు యువతరానికి స్పెషల్ ట్రీట్ గా మారాయి. సింపుల్ గా థై అందాలను ఎలివేట్ చేసే ఫ్రాక్ లో శ్రీయ టూ హాట్ గా కనిపిస్తోందంటూ యువతరం కామెంట్లు చేస్తోంది. శ్రీయ వేడి పెంచే



మానసిక స్థితి లో ఉందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

**భారీ పాన్ ఇండియా చిత్రంతో..! :** ప్రస్తుతం ఈ భామ ఉపేంద్ర-కిచ్చా సుదీప్ లతో కలిసి ఆనంద్ పండిట్ అండర్ వరల్డ్ డ్రామా కబ్జాలో నటిస్తోంది. ఇది భారీ యాక్షన్ ఎంటర్ టైనర్. గ్రేట్ అర్కేశ్వర స్టోరీని తెరపై వీక్షించేందుకు ప్రేక్షకులు ఉత్కంఠగా వేచి చూస్తున్నారు. ఇటీవల మేకర్స్ శ్రీయతో డ్యాన్స్ నంబర్.. మెయిన్ తో చలీ చలి ఆవిష్కరణ కోసం గ్రాండ్ ఈవెంట్ ని నిర్వహించారు. గురు కిరణ్ మ్యూజికల్ నైట్ ఆహ్లాదాన్ని పంచింది. ఆదివారం సాయంత్రం బెంగుళూరులోని శిడ్లగట్ట జూనియర్ కళాశాలలో నిర్మాత ఆనంద్ పండిట్ ఇతర చిత్రబృందం శివన్న అలియాస్ శివరాజ్ కుమార్ సమక్షంలో లిరికల్ పాటను ఆవిష్కరించారు. 1.5 లక్షల మందికి పైగా ప్రజలు మేన్ తో చలీ చలి పాటలకు డ్యాన్స్ చేస్తూ హెూరెత్తించారు. అండర్ వరల్డ్ కా కబ్జా మార్చి 17న పాన్-ఇండియా కేటగిరీలో విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ స్పెషల్ పాటలో ఉపేంద్ర సహా తాన్యా హెూప్ నర్తించింది. మెయిన్ తో చలి చలి అనేది డాన్ అర్కేశ్వరుని ఎలివేషన్ కి సంబంధించిన పాట. ఈ పాటను స్నిగ్ధా శర్మ -రితేష్ జి రావు పాడారు. రవి బస్రూర్ సంగీతం అందించగా ఈ పాటకు షబ్బీర్ అహ్మద్ సాహిత్యం అందించారు. అండర్ వరల్డ్ కా కబ్జా నాకు చాలా ప్రత్యేకమైన చిత్రం.. మాతృభూమిలోని విభిన్న సంస్కృతులను ప్రదర్శించే చిత్రమిదని దర్శకుడు చంద్రు తెలిపారు. శ్రీ సిద్దేశ్వర ఎంటర్ ప్రైజ్ - అలంకార్ పాండియన్ లతో కలిసి ఆనంద్ పండిట్ మోషన్ పిక్చర్స్ నిర్మించిన ఈ మాఫియా థ్రిల్లర్ 17న విడుదలకు సిద్ధమవుతోంది.



# రిసోర్స్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా హైదరాబాద్..: మంత్రి కేటీఆర్

హైదరాబాద్: రిసోర్స్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా హైదరాబాద్ ఎదిగిందని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రపంచంతో పోటీపడే సత్తా మనకు ఉందని చెప్పారు. ట్యాలెంట్ ఉన్న పిల్లలకు మనదేశంలో కొరతలేదని తెలిపారు. హైదరాబాద్ నానక్‌రాంగూడలో సెల్లాంటిస్ డిజిటల్ హబ్‌ను, రైట్ సాఫ్ట్‌వేర్ ఆఫీస్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆటోమొబైల్ రంగం కూడా ఇప్పుడు కంప్యూటర్ ఓరియెంటెడ్ డిజైన్స్ ద్వారా ముందుకు వెళ్తున్నదని చెప్పారు. ప్రభుత్వం మొబిలిటి వ్యాలి ప్రారంభించిందన్నారు. కంపెనీకి ప్రభుత్వం నుంచి అన్ని సహాయ సహకారాలు అందుతాయని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉండగా హైదరాబాద్ ఐటీలో 3 లక్షల మంది పనిచేసే వాళ్లు, ప్రస్తుతం ఆ సంఖ్య 9 లక్షలకుపైగా పెరిగిందన్నారు. ఇక్కడ ఉన్న గ్రోత్ దేశంలోని ఏ నగరంలో లేదని వెల్లడించారు. వరంగల్‌లో ఐటీ కంపెనీ ఏర్పాటు చేసిందందుకు రైట్ సాఫ్ట్‌వేర్ కంపెనీకి ధన్యవాదాలు తెలిపారు.

మూడేండ్లలో వెయ్యి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పినందుకు అభినందించారు. రైట్ సాఫ్ట్‌వేర్ సీఈవో కృష్ణను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం టీహబ్‌లో మోబిస్–బిట్స్ పిలాని హైదరాబాద్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

# మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం ఒక అద్భుత ఘట్టం



సిద్దిపేట జిల్లా: కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారిని మంత్రి హరీష్‌రావు దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రూ.12 కోట్ల వ్యయంతో క్యూలైన్ల కాంప్లెక్స్ నిర్మాణానికి మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో ఆలయం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రూ.12 కోట్ల వ్యయంతో క్యూ లైన్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక రూ.36 కోట్లతో ఆలయంలో అభివృద్ధి పనులు చేశామన్నారు. గత కళ్యాణంలో హామీ ఇచ్చినట్టు స్వామి వారికి బంగారు కిరీటం, మీసాలు, వెండి దర్వాజాలు చేయించినట్లు చెప్పారు. మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం ఒక అద్భుతమైన ఘట్టమన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా మల్లన్న స్వామి దయతో మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ పూర్తి చేసి కాళేశ్వరం జలాలతో నింపామని మంత్రి అన్నారు. మల్లన్న సాగర్ నీటితోనే సీఎం కేసీఆర్ స్వామివారికి అభిషేకం చేశారని తెలిపారు. జాతీయ రహదారి నుంచి ఆలయం వరకు డబుల్ రోడ్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వంద గదుల సత్రం త్వరలోనే అందుబాటులోకి వస్తుందని చెప్పారు. గుట్టపై దాతల సహకారంతో భక్తుల సౌకర్యార్థం గదులను నిర్మిస్తున్నామన్నారు. కొమురవెల్లి దేవాలయం దినదిన అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ప్లాస్టిక్ రహితంగా మల్లన్న ఆలయం ఉండాలని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గతంలో ఆదాయం తక్కువ ఖర్చులు ఎక్కువ ఉండేవని.. ఇప్పుడు ప్రతీ యేటా దాదాపు రూ.18 కోట్ల ఆదాయం వస్తోందని అన్నారు. మల్లన్న స్వామి ఆశీస్సులతో ఈ ప్రాంతం సుభీక్షంగా ఉందన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో కాలంతో నిమిత్తం లేకుండా, వర్షాలతో అవసరం లేకుండా మల్లన్న సాగర్ ద్వారా రైతులు రెండు పంటలు పండిస్తున్నారని మంత్రి హరీష్‌రావు వెల్లడించారు.

# తొమ్మిదేండ్లలో మారిన తెలంగాణ స్వరూపం.. పెట్టుబడులతో రాష్ట్రానికి వరుసకడున్న పారిశ్రామిక దిగ్గజాలు: మంత్రి నిరంజన్ రెడ్డి



హైదరాబాద్: తొమ్మిదేండ్లలో తెలంగాణ స్వరూపం మారిపోయిందని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ పేరు అంతర్జాతీయంగా మరింత ఆదరణ చూరగొంటున్నదని చెప్పారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పారిశ్రామిక దిగ్గజాలు పెట్టుబడులతో రాష్ట్రానికి వరుస కడుతున్నాయని తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా ఫ్లోరిడా రాష్ట్రం టంపాలో బీఆర్ఎస్ యూఎస్ఏ కన్వీనర్ చందు తాళ్ల అధ్యక్షతన జరిగిన ప్రవాస తెలంగాణ వాసుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణకు ప్రవాసులు చేయూతనివ్వాలన్నారు. 24 గంటల కరెంట్, సాగునీరు, తాగునీరుతో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పనలో ముందడుగు వేస్తున్నదని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24 గంటల కరెంట్, అందుబాటులో విత్తనాలు, ఎరువులతో తెలంగాణ సాగు దశమారిందని వెల్లడించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి కల్పన రంగాలలో వేగంగా విస్తరిస్తున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాలలో ఇస్తున్న అవార్డులే దీనికి నిదర్శనమన్నారు. ఎదుగుతున్న తెలంగాణకు మట్టిబిడ్డల సహకారం కావాలని చెప్పారు.

# సర్పంచ్ నవ్య వర్సెస్ ఎమ్మెల్యే రాజయ్య ఎపిసోడ్‌లో బిగ్ ట్విస్ట్



వరంగల్ : సర్పంచ్ నవ్య వర్సెస్ ఎమ్మెల్యే రాజయ్య ఎపిసోడ్‌లో పోలీసులు బిగ్ ట్విస్ట్ ఇచ్చారు. నవ్య ఆరోపణల్లో వాస్తవాలు లేవని పోలీసులు తేల్చారు. ఈ మేరకు జాతీయ మహిళా కమిషన్‌కు నివేదిక సమర్పించారు. రెండు పర్యాయాలు నోటీసులు ఇచ్చినా పోలీసులకు ఎలాంటి ఆధారాలూ నవ్య సమర్పించలేదు. నిర్ణీత సమయానికి ఆధారాలు సమర్పించని నేపథ్యంలో కేసు క్లోజ్ చేయవచ్చని పోలీసులకు నవ్య తెలిపారు. దీంతో నవ్య – రాజయ్య పంచాయతీకి తెర పడింది. తెలంగాణ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యపై మహిళా సర్పంచ్ లైంగిక ఆరోపణలు తీవ్ర దుమారం లేపిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే రాజయ్య తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ హన్మకొండ జిల్లా జానకిపురం సర్పంచ్ నవ్య సంచలన ఆరోపణలు చేసింది. మాట విననందుకు తనపై రాజయ్య లైంగిక వేధింపులకు దిగుతున్నారని నవ్య పేర్కొంది. తనకు ఎమ్మెల్యే కాల్ చేసి బయటకు రమ్మంటున్నారని.. నీ మీద కోరికతోనే పార్టీ టికెట్ ఇచ్చానని వేధిస్తున్నాడని నవ్య ఆరోపించారు. మరోవైపు నవ్య తనపై చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే రాజయ్య ఖండించారు.

# అడవి బిడ్డలను అన్నదాతలను చేసినం : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ : ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కుమ్రం భీం ఆశయ సాధనకు సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని, జల్ జంగల్ జమీన్ స్ఫూర్తితో అడవి బిడ్డలను అన్నదాతలుగా చేసి భూమి హక్కులను కల్పిస్తున్నామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం కుబీర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గిరిజనులకు పోడు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా 4,05,601 ఎకరాలకు చెందిన 1.51 లక్షల మంది అడవి బిడ్డలకు పోడు పట్టాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇకపై పోడు భూములకు కూడా రైతు బంధు ఇస్తామన్నారు. గిరివికాసం పథకం ద్వారా గిరిజన రైతులకు మేలు చేస్తున్నామని, పట్టాదారులు తమ భూముల్లో బోర్లు వేసుకునేందుకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిజేస్తామని వెల్లడించారు. త్రీ ఫేజ్ కరెంట్ కూడా సరఫరా చేస్తామని చెప్పారు. పోడు రైతులపై ఉన్న కేసులను కూడా ప్రభుత్వం ఎత్తివేస్తుందని స్పష్టం చేశారు. హక్కుదారులు తమ భూములను అమ్ముకోవడానికి వీలు లేదని, వారసులకు మాత్రమే పోడు భూములపై హక్కులు ఉంటాయని పేర్కొన్నారు. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలుచేస్తోందని తెలిపారు. తొమ్మిదేళ్లలో ఏజెన్సీలోని గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, కలెక్టర్ వరుణ్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అర్హులకు పోడు పట్టాలు రానట్లయితే వారికీ మంజూరు చేయిస్తా: మంత్రి వేముల

నిజామాబాద్ : తెలంగాణ ప్రభుత్వం అందించిన పట్టాలతో పోడు భూముల్లో ఇకపై గిరిజనులు దర్జాగా పంటలు సాగు చేసుకోవచ్చని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఎవరికీ భయపడాల్సిన, అణిగిమనిగి ఉండాల్సిన అవసరం లేకుండా భూముల హద్దులతో కూడిన సమగ్ర నక్షాతో ప్రభుత్వం పక్కాగా పట్టా పాస్ బుక్కులు అందిస్తున్నదని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలోని కమ్మర్‌పల్లి మండలం దొమ్మర్ చౌడ్ తండాలో (డీ.సీ తండా) లబ్ధిదారులకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బుధవారం పోడు భూముల పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అమీర్ నగర్ తండా, సర్పంచ్ తండా, డీ.సీ తండా, కోనాపూర్ కేసి తండా, ఊప్లనాయక్ తండా, సోమిడి తండా, బిల్యానాయక్ తండా, గుడిమల్కాపూర్ తండాలకు చెందిన 190 మంది లబ్ధిదారులకు 590 ఎకరాల పోడు భూమికి సంబంధించిన పట్టా పుస్తకాలు అందజేశారు. **గిరిజనులతో కలిస నృత్యం చేస్తున్న మంత్రి వేముల..** ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పోడు భూముల్లో పంట సాగు చేసుకునేందుకు గిరిజనులు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. వారి బాధలను దూరం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న పట్టాలతో లక్షలాది గిరిజన కుటుంబాలకు పోడు భూములపై యాజమాన్య హక్కులు ఏర్పడ్డాయని హర్షం వెలిబుచ్చారు. తరతరాలకు జీవనోపాధిని అందించే ఈ భూములను అమ్ముకోవద్దని మంత్రి హితవు పలికారు. పోడు భూముల లబ్ధిదారులకు ప్రభుత్వం ఈ సీజన్ నుంచే రైతు బంధు, రైతు బీమా పథకాలను వర్తింపచేస్తుందన్నారు. ఇందులో భాగంగా పట్టాల పంపిణీ కంటే ముందే లబ్ధిదారుల ఖాతాలలో రైతుబంధు డబ్బులు జమ చేశామని గుర్తు చేశారు.



# బీఆర్ఎస్ 3.0 సక్సెస్

## కంగ్రాచ్యులేషన్స్ కేసీఆర్.. మీరే గెలిచారు!!

హైదరాబాద్ : ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుని మార్పు చేయడం రాష్ట్రవ్యాప్తంగా దుమారంగా మారింది. సోషల్ మీడియాలో సీఎం కేసీఆర్ కు కంగ్రాచులేషన్స్ చెబుతూ పెద్ద ఎత్తున రచ్చ జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఇక గెలిచే పరిస్థితులు లేవని, సీఎం కేసీఆర్ ను బలంగా ప్రస్తుత తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఎదుర్కోలేరని పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది. వచ్చే ఎన్నికలలో మళ్లీ బీఆర్ఎస్ దే విజయం అంటూ అప్పుడే ప్రచారం కొనసాగుతుంది. కంగ్రాచ్యులేషన్స్ కేసీఆర్ అంటూ కిషన్ రెడ్డి కెసిఆర్ కలిసి ఉన్న ఫోటోలను పోస్ట్ చేసి ట్వీట్ చేస్తున్నారు. ఇక ఇదే అదునుగా కాంగ్రెస్ అభిమానులు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ని మార్చడాన్ని టార్గెట్ చేస్తూ పోస్టులు పెడుతున్నారు. దీంతో తెలంగాణ కాంగ్రెస్ కు మరింత జవసత్వాలు వచ్చాయని, తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ కాంగ్రెస్ అని చర్చ జరుగుతుంది. బిజెపి, బిఆర్ఎస్ బీ టీమ్ అని తాజా అధ్యక్షుడి మార్పుతో అందరికీ అర్థం అవుతుందని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. దీంతో తెలంగాణలో కాంగ్రెస్ విజయం ఖరారైందని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో బలమైన గొంతు వినిపించకుండా కిషన్ రెడ్డి కి పట్టం కట్టారని పలువురు చర్చలు జరుపుతున్నారు. అంతేకాదు కెసిఆర్ ను బుజ్జగించడానికి కిషన్ రెడ్డి ని నియమించాలని నిర్ణయం తీసుకున్నారని, ఈ ఎన్నికలలో బిజెపి విజయావకాశాలను కోల్పోయిందని, ఖచ్చితంగా గెలిచే అవకాశం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీ పోరాటాన్ని వదిలిపెట్టి, బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకున్నట్టుగా కనిపిస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నియోజకవర్గంలో అభ్యర్థిని ఖరారు చేసిన సీఎం జగన్..!! బండి సంజయ్ ఇంత కాలం చేసిన కష్టమంతా నీరుగారిపోయింది అని పోస్టులు పెడుతున్నారు. ఇది సీఎం కేసీఆర్ కు చాలా సంతోషం కలిగిస్తుందని చెబుతున్నారు. బీఆర్ఎస్ 3.0 100% సక్సెస్ అవుతుందని పేర్కొంటున్నారు. కిషన్ రెడ్డి వల్ల పార్టీకి లాభం జరగదని, కిషన్ రెడ్డి లో పోరాట పంథా ఉండదని అంటున్నారు. కిషన్ రెడ్డి మంచి లీడర్ అయినా.. పార్టీని నడిపించే సామర్థ్యం ఉన్న లీడర్ కాదని, ఆయన పార్టీని ముందుకు నడిపించలేరని సోషల్ మీడియాలో ప్రస్తుతం రచ్చ కొనసాగుతోంది. ఇక అందరూ కలిసి కంగ్రాచ్యులేషన్స్ కేసీఆర్ .. మీరే గెలిచారు అంటూ పోస్టులు పెట్టడం ఆసక్తికరంగా మారింది. ఇది కేసీఆర్ మాస్టర్ మైండ్ అని కూడా కొందరు వ్యాఖ్యలు చేస్తున్నారు.

# కిషన్ రెడ్డికి ప్రమోషనా? డిమోషనా?



హైదరాబాద్ : తెలంగాణ కమల దళపతిగా కిషన్ రెడ్డిని ఎంపిక చేస్తూ బీజేపీ జాతీయ వర్గం తీసుకున్న నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. సమ్ థింగ్ ఈజ్ రాంగ్ అన్నట్లుగా రోటీన్ కు భిన్నంగా తెలంగాణ కమలం పార్టీలో కలకలం రేగటం.. టీ బీజేపీ సారథిగా ఉన్న బండి సంజయ్ ను సాగనంపేందుకు రంగం సిద్ధమైందన్న వాదనలు జోరుగా వినిపించటం.. ఆ వార్తలకు బలం చేకూరేలా..తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యే సభకు తాను అధ్యక్షుడి హోదాలో హాజరువుతానో లేదో అన్న మాట రావటం తోనే.. బండికి స్థానచలనం ఖరారైందన్న విషయంపై క్లారిటీ వచ్చేసింది. ఇందుకు తగ్గట్లే మంగళవారం ఆయన్ను తెలంగాణ బీజేపీ సారథిగా నియమిస్తూ నిర్ణయం తీసుకోవటం తెలిసిందే. అయితే.. ఈ స్థానం కిషన్ రెడ్డికి ప్రమోషనా? డిమోషనా? అన్నదిప్పుడు కొత్త చర్చగా మారింది. ఎందుకంటే.. ఇప్పటికే ఉమ్మడి ఏపీ.. తెలంగాణ బీజేపీ సారథిగా రెండుసార్లు పని చేసిన ఆయనకు.. తాజాగా మూడోసారిపార్టీ పగ్గాల్ని ఇవ్వటాన్ని ప్రశ్నిస్తున్నారు. గడిచిన రెండు దఫాల్లో పార్టీని విస్తరించే విషయంలోనూ.. క్రేజ్ తీసుకొచ్చే విషయంలోనూ కిషన్ రెడ్డి ట్రాక్ రికార్డు ఏ మాత్రం గొప్పగా కనిపించదు. అలాంటప్పుడు.. కీలకమైన ఎన్నికల వేళలో కిషన్ రెడ్డికి టీ బీజేపీ బాధ్యతల్ని అప్పజెప్పటం హాట్ టాపిక్ గా మారింది. ఒకవైపు బీఆర్ఎస్ కు బీజేపీ బి పార్టీగా మారిందన్న ప్రచారం జోరుగా సాగుతున్న వేళలో.. కిషన్ రెడ్డిని ఎంపిక చేయటం ఆసక్తికరంగా మారింది. బీజేపీ యువమోర్చాకు రాష్ట్ర అధ్యక్షుడిగానే కాదు.. జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరించిన కిషన్ రెడ్డి.. గతంలోనే రెండు దఫాలు ఉమ్మడి ఏపీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో నియమితులయ్యారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కిషన్ రెడ్డి.. 2018లోఎమ్మెల్యేగా ఓడిపోవటం.. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా గెలిచి.. సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి.. తర్వాత కేంద్ర మంత్రిగా అప్ గ్రేడ్ కావటం తెలిసిందే. అలాంటి కిషన్ రెడ్డి చేతికి తాజాగా తెలంగాణ పార్టీ పగ్గాలు అందించటం హాట్ టాపిక్ గా మారింది. గతంలో ఎప్పుడూ లేని రీతిలో తెలంగాణ బీజేపీలో గ్రూపులు పెరిగిపోయిన నేపథ్యంలో.. వాటిని చక్కదిద్ది పార్టీని ఒక గాడిన పెట్టే సత్తా కిషన్ రెడ్డికి ఉందని పార్టీ జాతీయ నాయకత్వం భావించినట్లుగా చెబుతారు. అయితే.. అంతకంతకూ ఉన్నత స్థాయికి చేరాల్సిన కిషన్ రెడ్డి.. అందుకు భిన్నంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావటం ఏమిటి? మూడోసారి రాష్ట్ర పగ్గాలు సొంతం చేసుకోవటం పెద్ద విషయం కాదని.. ఆయన వ్యక్తిగత కెరీర్ కోణంలో చూస్తే.. ఇదే మాత్రం ప్రమోషన్ కాదని.. డిమోషన్ అన్న వాదన బలంగా వినిపించటం గమనార్హం.




# కుమార్తె ప్రేమ వివాహం.. అల్లుడి స్నేహితుల ఇళ్లు తగలబెట్టించిన సర్పంచ్

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ములుగు జిల్లా మంగపేట మండలంలోని 23 గ్రామాలు షెడ్యూల్ ప్రాంతాలేనని స్పష్టం చేసింది. ఈ మేరకు ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఆయా గ్రామాలు రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ పరిధిలోకి వస్తాయని హైకోర్టు వెల్లడించింది. ఈ మేరకు హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ బెంచ్ తీర్పు వెలువరించింది. ఈ విషయంలో సింగిల్ జడ్జి ఇచ్చి తీర్పులో జోక్యం చేసుకోలేమన్న సీజే ధర్మాసనం.. ఆదివాసీయేతరుల అప్పీల్‌ను కొట్టివేసింది.

# గిరిజన వర్సిటీ ఏర్పాటు అయ్యేంత వరకు కేంద్రంపై పోరాడుతాం : మాజీ ఎంపీ సీతారాం నాయక్

ములుగు : జిల్లాలో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేసేంత వరకు ఇక కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం చేస్తామని మాజీ ఎంపీ ఆజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు విషయంలో కేంద్రం అవలంబిస్తున్న విధానాలను నిరసిస్తూ ప్రధాని మోదీ పర్యటనను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 7,8 తేదీల్లో జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద గిరిజన విద్యార్థులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి 48 గంటల పాటు నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన యూనివర్సిటీ వంటివి ఏర్పాటుకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణలోని బీజేపీ ఎంపీలు కేంద్రం నిధులు తేవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

గిరిజన విశ్వ విద్యాలయానికి స్థల సేకరణ జరుగలేదని తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ కేంద్ర మంత్రి అబద్దాలు ఆడటం శోచనీయమన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో ములుగు, మహబూబాబాద్ లో గిరిజన యూనివర్సిటీ కోసమని స్థల సేకరణ కోసం ఉన్న పూర్తి భూమి వివరాలను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించినట్లు గుర్తు చేశారు. వర్సిటీ కోసం 336 ఎకరాల భూమిని కేటాయించి కొన్ని సంవత్సరాలు గడుస్తున్నా యూనివర్సిటీని ఏర్పాటు చేయడంలో కేంద్రం విఫలమైందన్నారు. మోదీ పర్యటనలో గిరిజన యూనివర్సిటీ , మేడారం జాతరకు జాతీయ హోదా ప్రకటించకపోతే ఆయన పర్యటనకు సార్థకత లేదన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, ప్రజలు, ప్రజా సంగాల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ములుగు, వెంకటాపూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు బాదం ప్రవీణ్, లింగాల రమణారెడ్డి, అశోక్, భూక్య మురళి, విద్యార్థి విభాగం నాయకులు మోతె రాజు, విష్ణువర్ధన్, భూక్య అమర్ సింగ్, ఎంపీటీసీల జిల్లాఫోరం అధ్యక్షుడు పోరిక విజయ్ రాం నాయక్, బైకాని సాగర్, కోగిల మహేశ్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com